శుక్రవారం
30•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 66
• పేజీలు: 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## గ్రామాల సమగ్రాభివృద్ధికి

# నేడు కార్యాచరణ ప్రణాళిక

ప్రతినెలా పంచాయతీలకు రూ.339 కోట్లు

సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతినెలా రూ.339 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత మెరుగుపర్చడానికి, పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడానికి ఉద్దేశించిన కార్యాచరణ ప్రణాళిక విధివిధానాలపై గురువారం సాయంత్రం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం మరోమారు సమీక్ష జరిపి పూర్తిస్థాయి అవగాహనకు వచ్చిన తర్వాత తుదినిర్ణయం ప్రకటిస్తామని సీఎం చెప్పారు. కార్యాచరణ ప్రణాళికలో ఏయే అంశాలుండాలో నిర్ణయిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రణాళిక విషయంలో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి ప్రతినెలా రూ.339 కోట్లు గ్రామ పంచాయతీలకు కార్యాచరణ పథకం అమలు ప్రారంభానికి ముందే విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి నెలా విడుదలయ్యే ఈ నిధులు మొత్తం ఎనిమిది నెలలపాటు విడుదలచేయాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావును ముఖ్యమంత్రి ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక అక్టోబరు 5 లేదా 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయన్నారు. ఈ లోపల కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని కూడా నిర్ణయించారు. కార్యాచరణ ప్రణాళికను పటిష్ఠంగా అమలుచేయడానికి సర్పంచ్‌లను, వార్డు సభ్యులను, అధికారులను, ఇతరులను సిద్ధంచేయాలని సూచించారు. కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ తన వార్షిక, పంచవర్ష ప్రణాళికలు

మిగతా 2వ పేజీలో

# ఏడాదిలో పాలమూరు

## జిల్లాలో అన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి 15-20 లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం

### పాలమూరు ఎత్తిపోతల పనుల పరిశీలనలో సీఎం కేసీఆర్

- పాలమూరు.. పాలుగారే ఊరు కావాలి
- మొగులు చూడకుండా వ్యవసాయం చేయాలి
- ప్రగతినిరోధక శక్తులవల్లే పాలమూరు ఆలస్యం
- మొదటి దశలో కరివెన నింపే యోచన తర్వాత ఉద్ధండాపూర్ లేదా లక్ష్మిదేవిపల్లి
- ఏపీ సర్కార్‌తో వచ్చే భేటీలో గోదావరి-కృష్ణా అనుసంధానం కొలిక్కి దానిపైనా చంద్రబాబు కుత్సితబుద్ధి: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు


గురువారం పాలమూరు పర్యటనలో ఏదుల వద్ద మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు

> 'పాలమూరు జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాల నీళ్లు' నినాదం విజయవంతం కావడమే కాదు.. అదనంగా 3, 4 లక్షల ఎకరాలకు నీళ్లు.. మొత్తంగా 15-20 లక్షల ఎకరాల మధ్య పాలమూరు జిల్లా సస్యశ్యామలంగా పంటలతో తులతూగే జిల్లాగా వచ్చే సంవత్సరం నుంచి మారే అవకాశముంటది. – సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

సంవత్సరంలోపు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. పాలమూరు జిల్లాలో మొత్తంగా 15-20 లక్షల ఎకరాలకు సాగునీరందించి.. సస్యశ్యామలం అవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. అన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి.. పాలమూరును పాలుగారే ఊరుగా, పాలుగారే పాలమూరుగా తయారుచేస్తామని చెప్పారు. 'రంగారెడ్డి జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా, కొంత పాక్షికంగా దక్షిణ నల్లగొండ కావచ్చు. అదేవిధంగా నాగార్జునసాగర్ ద్వారా నల్లగొండ, ప్రస్తుత వికారాబాద్ జిల్లా.. ప్రస్తుత రంగారెడ్డి జిల్లా సస్యశ్యామలమయ్యే పరిస్థితి వస్తది' అని సీఎం అన్నారు. కొందరు దుర్మార్గులు, కొన్ని ప్రగతి నిరోధకశక్తులు అడ్డుకోవటంవల్ల పాలమూరు ఎత్తిపోతల పథకం ఆలస్యమైందని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా పథకాలను వెంటనే పూర్తిచేసి నీళ్లిచ్చామని, అక్కడ మంచి ఫలితం కూడా వచ్చిందని తెలిపారు. దాదాపు 1000 నుంచి 1500 వరకు చెరువులు నింపుకొనే కార్యక్రమం విజయవంతంగా జరుగుతున్నదని వివరించారు. ఇంకా సక్సెస్‌ఫుల్‌గా చేయనున్నామని తెలిపారు. గోదావరి, కృష్ణానదుల అనుసంధానానికి ఏపీ ప్రభుత్వం ముందుకు వచ్చిందని, వచ్చే సమావేశంలో ఈ అంశం ఒక కొలిక్కివచ్చే అవకాశం ఉన్నదని సీఎం వెల్లడించారు. గురువారం ఆయన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణపనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏదుల వద్ద మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఏమన్నారో.. ఆయన మాటల్లోనే..

**కృష్ణా-గోదావరి అనుసంధానంతో అద్భుతాలు**

గోదావరి, కృష్ణానదుల అనుసంధానంతో శ్రీశైలాన్ని గోదావరి జలాలతో నింపుకొందామని

మిగతా 2వ పేజీలో

> **కృష్ణా - గోదావరి** అనుసంధానంపై మేం ఇద్దరు ముఖ్యమంత్రులం ఒక అభిప్రాయానికి వచ్చినం. భవిష్యత్‌లో బాగుపడేదే పాలమూరు, నల్లగొండ, వికారాబాద్ జిల్లాలు. హైదరాబాద్ తాగునీటి సమస్య దూరమైతది. చాలా సమస్యలు శాశ్వతంగా దూరమైతయి. గతంలో ఇదే చంద్రబాబు బాబ్లీ, పరవాడ ప్రాజెక్టులపై గొడవ పడి సాధించింది ఏమిటి? గుండు సున్నా! మేం వెళ్లి ఒప్పందం చేసుకుంటే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయింది. 570 టీఎంసీల నీళ్లు తీసుకునే అవకాశం తెలంగాణకు సంపూర్ణంగా లభిస్తున్నది. చంద్రబాబు, ఇంకా ఎవరైనా కుత్సితబుద్ధితో ఆలోచించేవారికి ఒకటే చెప్తున్నా.. రేపు ఆంధ్రా, తెలంగాణ కృష్ణా, గోదావరి అనుసంధానం చేసి నీళ్లు తీసుకోవాలనుకున్నప్పుడు తగురీతిలో ఒప్పందాలు చేసుకుంటం. సుహృద్భావ పూర్వకంగా చర్చలదశలో ముందుకు పోతున్నం.
>
> - సీఎం కేసీఆర్

## బంగారం బంగారమాయె!



రూ.250 ఎగబాకి
రూ.40,220కి చేరిన తులం ధర
ఇది ఆల్‌టైమ్ రికార్డు
రూ.49 వేలు దాటిన కిలో వెండి

9

## తెలంగాణలో గిరిజనాభివృద్ధి భేష్



జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్‌సాయి ప్రశంస

3


గురువారం ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ శివాజీ, ఇతర నాయకులు

## రేవంత్.. కరంట్ కట్ చేయాలా?

ఇదండీ!

70 వేల మంది ఉద్యోగులు తలుచుకుంటే ఎక్కడుంటారు
విద్యుత్ సంస్థల సీఎండీకి తక్షణమే క్షమాపణ చెప్పాలి
రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు
విద్యుత్ సౌధలో 25 సంఘాల ఆందోళన

3

## మున్సిపల్ ఎన్నికల్లో గులాబీదే విజయం



- మా నాయకుడు సీఎం కేసీఆరే.. నేను గులాబీ సైనికుడినే
- నా ఎదుగుదల చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారం
- తప్పుడు వార్తలతో అవమానించాలని చూడవద్దు
- తన ప్రసంగాన్ని తప్పుగా ప్రచారం చేయడంపై మంత్రి ఈటల రాజేందర్ ఆగ్రహం

**హుజూరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘనవిజయం సాధించడం ఖాయమని, మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. పనిచేసేటోళ్లకు పార్టీలో తప్పకుండా తగిన ప్రాధాన్యం ఉంటుందని ఈటల స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చూసి ఇతర పార్టీల నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గురువారం హుజూరాబాద్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కాసిపేట శ్రీనివాస్, ఆ పార్టీ నేతలు రావుల అశోక్, కన్నెబోయిన మహేందర్‌యాదవ్, కాసిపేట కృష్ణ, కుడిక్యాల శ్రీనివాస్, కందుల సందీప్‌రెడ్డి, సంగెం శ్రీనివాస్ తదితరులు మంత్రి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, తనను ఒక కులానికి ప్రతినిధిగా, డబ్బులకు ఆశపడే వ్యక్తిగా

మిగతా 6వ పేజీలో



గురువారం ఢిల్లీలో 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

## ఫిట్‌నెస్ జీవన విధానం కావాలి

విజయానికి, దృఢత్వానికి అవినాభావ సంబంధం
నయా పైసా పెట్టుబడి లేకుండా 'ఫిట్‌నెస్'తో అనంత లాభాలు
టెక్నాలజీ రాకతో తగ్గిన భౌతిక శ్రమ
యువతలో జీవనశైలి వ్యాధుల పెరుగుదల ఆందోళనకరం
'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

5

## రాష్ట్రానికి 3110 కోట్ల కంపా నిధులు



- విడుదలచేసిన కేంద్ర మంత్రి జవదేకర్
- 27 రాష్ట్రాలకు మొత్తం 47వేల కోట్లు
- ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికే వినియోగిస్తాం
- అడవుల పెంపకానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం
- ఢిల్లీలో మీడియాతో రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కంపా (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) నిధులకింద రాష్ట్రానికి రూ.3110 కోట్లు విడుదలచేస్తూ కేంద్ర పర్యావరణశాఖ ఆదేశాలు జారీచేసిందని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్‌జవదేకర్ దేశంలోని అన్నిరాష్ట్రాల అటవీశాఖ మంత్రులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి కంపా నిధులు విడుదలచేస్తూ రాష్ట్ర మంత్రికి చెక్ తరహా మంజూరుపత్రాన్ని అందించారు. మొత్తంగా 27 రాష్ట్రాలకు కంపా నిధుల కింద రూ.47వేల కోట్లను కేంద్రమంత్రి అందజేశారు. అత్యధికంగా ఒడిశాకు రూ.5,933 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌కు రూ.5,791 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.5,196 కోట్లు దక్కాయి. సమావేశం అనంతరం

మిగతా 6వ పేజీలో



3

## తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

ఢిల్లీకి వెళ్తుండగా హర్యానాలో ఘటన

## లే అవుట్లకు పాస్‌పుస్తకం

ధర్మగంట

ప్లాట్లను మళ్లీ వ్యవసాయ భూమిగా మార్చిన రెవెన్యూ అధికారులు
పదిహేడేండ్ల తర్వాత కబ్జాదారుడి పేరిట పాస్‌పుస్తకం జారీ
వరంగల్ నగరంలో ఓ తాసిల్దార్ నిర్వాకం.. ఆందోళనలో ప్లాట్లు కొనుగోలుచేసిన ఉద్యోగులు

6

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 65.00 | రిటైల్ లైవ్ | 87.00 |
| డ్రెస్‌డ్ | 126.00 | స్కిన్‌లెస్ | 144.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 327.00 | రంగారెడ్డి | 327.00 |
| మెదక్ | 327.00 | కరీంనగర్ | 330.00 |
| వరంగల్ | 330.00 | చిల్లర ధర | 3.85 |





గురువారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం కరివెనవద్ద సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఏదుల రిజర్వాయర్ పనుల పరిశీలనకు ప్రత్యేక వాహనంలో వెళ్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు.



కరివెన వద్ద ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలించి సూచనలిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం తదితరులు కూడా ఉన్నారు.

# ఏడాదిలో పాలమూరు

మొదటిపేజీ తరువాయి...

ఏపీ ముఖ్యమంత్రి, ఆ రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం సహృదయంతో నిర్దిష్టమైన ప్రతిపాదనలతో వచ్చారు. ఈసారి అదృష్టం కలిసొచ్చి కృష్ణకు పెద్దఎత్తున నీళ్లు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో అసలే రావడంలేదు. కాబట్టి మేం కూడా అంగీకరించాం. చర్చలు సఫలమైతే చాలా అద్భుతాలు చూడబోతున్నాం. బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. శ్రీశైలం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా, కొంత దక్షిణ నల్లగొండ కావచ్చు.. అదేవిధంగా నాగార్జునసాగర్ ద్వారా నల్లగొండ కావచ్చు.. పైన ఉన్నటువంటి వికారాబాద్ జిల్లా, రంగారెడ్డి జిల్లా మొత్తం అంతా సస్యశ్యామలమయ్యే పరిస్థితి వస్తది. రైతులు ఎదురుచూసే పరిస్థితి రాదు. గత సమైక్య పాలకుల అసమర్థ, తెలివితక్కువ విధానాలవల్ల తెలంగాణకు నష్టం కలిగింది. స్కీం బీ కోరకపోవడం ఒకటి. మంచినీళ్లకు కూడా కర్ణాటకను బతిమిలాడాల్సి వచ్చింది. అదంతా అధిగమించాలంటే గోదావరిని కృష్ణకు అనుసంధానం చేసుకోవడం ఉత్తమ మార్గం. దానికి ఏపీ కూడా సిద్ధంగా ఉన్నది. బహుశా వచ్చే సమావేశంలో కొలిక్కి వచ్చే ఆస్కారం ఉంటది. ఏపీలో కూడా కుత్సిత మనస్తత్వం ఉన్న మాజీ సీఎం చంద్రబాబు లాంటివారు ఉన్నారు. ఆయనకు ఏం గుణం ఉన్నదో ఇతరులకూ అదే గుణం ఉన్నదనుకుంటున్నరు. సంకుచితంగా, కుత్సితంగా, నీచంగా ఆలోచించేవారికే చంద్రబాబులాంటి ఆలోచనలు వస్తయి. అనుసంధానంపై మేం ఇద్దరు ముఖ్యమంత్రులం ఒక అభిప్రాయానికి వచ్చినం. భవిష్యత్‌లో బాగుపడేదే పాలమూరు, నల్లగొండ, వికారాబాద్ జిల్లాలు.



వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహం, అంజయ్య యాదవ్, పైలట్ రోహిత్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్ తాగునీటి సమస్య దూరమైతది. చాలా సమస్యలు శాశ్వతంగా దూరమైతయి. గతంలో ఇదే చంద్రబాబు బాబ్లీ, పరవాడ ప్రాజెక్టులపై గొడవపడి సాధించింది ఏమిటి? గుండు సున్నా! మేం వెళ్లి ఒప్పందం చేసుకుంటే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయింది. 570 టీఎంసీల నీళ్లు తీసుకునే అవకాశం తెలంగాణకు సంపూర్ణంగా లభిస్తున్నది. చంద్రబాబు, ఇంకా ఎవరైనా కుత్సితబుద్ధితో ఆలోచించేవారికి ఒకటే చెప్తున్నా.. రేపు ఆంధ్రా, తెలంగాణ కృష్ణా, గోదావరి అనుసంధానం చేసి నీళ్లు తీసుకోవాలనుకున్నప్పుడు తగురీతిలో ఒప్పందాలు చేసుకుంటం. సుహృద్భావపూర్వకంగా చర్చలదశలో ముందుకు పోతున్నం. నాకు కూడా కల ఉన్నది. అసాధ్యమేమీకాదు. ఇప్పుడు కూడా కొందరు తెలివిలేని సన్నాసులు 'మేమేమీ చేయలేదు.. మీరుకూడా ఏమీ చేయొద్దు' అనే పద్ధతిలో మాట్లాడుతున్నరు.

### ఆరునూరైనా ఉచిత విద్యుత్ సరఫరా

సమైక్యపాలనలో జీవన విధ్వంసం జరిగి.. తెలంగాణ రైతాంగం చాలా ఘోరాలకు గురైంది. ఆత్మహత్యలు చేసుకునే స్థితికి దిగజారింది. మాకొక నిర్దిష్టమైన అభిప్రాయం ఉన్నది. చాలా స్పష్టంగా చెప్పిఉన్నాం. తెలంగాణలో ప్రతిరైతు అప్పులో కూరుకొనిపోయి ఉన్నడు. వాళ్లు బాగుపడాలంటే ఇంకా ఐదారు.. ఏడెనిమిదేండ్లపాటు వాళ్లకు నగదు నిల్వలు, సొంత పెట్టుబడి సమకూరేవరకు ఆరునూరైనా కరంట్ సరఫరాచేస్తం. నీటితీరువా రద్దుచేసినం. ఎత్తిపోతల పథకాలకు కరంట్ బిల్లులు ఇంతగనమా? అని మాట్లాడుతున్నరు. రూ.5 వేల కోట్లు కాదు.. రూ.15 వేల కోట్లు అయినా ఖర్చు పెట్టి రైతాంగానికి నీళ్లిస్తం. రైతుల అప్పులు తీరి, వాళ్ల బ్యాంకులో నాలుగు లక్షలో, ఐదు లక్షలో జమ అయితే పెట్టుబడికోసం అప్పుల చేసే దుస్థితి పోతది. ఆ స్థితి రావాలనేది మా పంతం. ఇది మా పార్టీ, మా ప్రభుత్వ సిద్ధాంతం.

### వాళ్లు మనుషులా దరిద్రులా?

ఇదే పాలమూరు జిల్లాలో సన్నాసులు ఉన్నరు. వాళ్లను చూస్తే నవ్వాలో ఏడ్వాల్నో అర్థంకాదు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జూరాల నుంచి నీళ్లు తీసుకోవాల్సి ఉండే అని మాట్లాడుతరు. వాళ్లు మనుషులా? దరిద్రులా? ఈ జిల్లాల ఎట్ల పుట్టింద్రు? భగవంతుడు వాళ్లకు ఎట్ల జన్మ ఇచ్చిండో అర్థంకాలే. జూరాల ప్రాజెక్టులో యూజబుల్ వాటర్ ఆరు టీఎంసీలే. దానిమీద నెట్టెంపాడు, జూరాల సొంత ఆయకట్టు 1.04 లక్షల ఎకరాలు అఫీషియల్. మొత్తం 1.15- 1.20 లక్షల ఎకరాల వరకు జూరాల సొంత ఆయకట్టు ఉంటది. భీమాకింద 2.03 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు కింద 2 లక్షలు, కోయిల్‌సాగర్ కింద 52 వేలు, కొత్తగా ప్రతిపాదించిన గట్టు మీద 33 వేల ఎకరాలు, అదేవిధంగా మిషన్ భగీరథ కింద తీసుకునే నీళ్లు 3.87 టీఎంసీలు. వాడుకోవాల్సిన నీళ్లు, పెట్టిన ఖర్చులకు, చేపట్టిన ప్రాజెక్టులకు 71.1 టీఎంసీలు జూరాల నుంచి వాడితే తప్ప మనం బతుకలేని పరిస్థితి. జూరాల రెండు మూడేండ్లుగా ఎండిపోతున్నది. రామన్‌పాడు ఎండిపోతది. ఏం చేయాలి? ఏటా కర్ణాటకను బతిమాలుకొని ఒక టీఎంసీనో, అర టీఎంసీనో తేవడం అంతా చూస్తున్నారు. ఇంత దుస్థితి జూరాలలో ఉంటే ఇంకా అమోఘమైన తెలివితేటలున్న చవటలు.. పాలమూరు ఎత్తిపోతలకు జూరాలనుంచి తెచ్చుకోవాలని మాట్లాడుతరు. శ్రీశైలం పొటెన్షియల్ పాయింటు. అక్కడ 200 టీఎంసీల స్టాకు ఉంటది. వాస్తవంగా 300 టీఎంసీల ప్రాజెక్టు. కానీ సిల్ట్ వల్ల 200 టీఎంసీలు అయింది. ఇప్పుడు ఒక పూట వెనకోముందో గోదావరికి శ్రీశైలం అనుసంధానం కాబోతున్నది. సంకల్ప శుద్ధి, చిత్త శుద్ధి ఉంటే కచ్చితంగా జరుగుతది. అప్పుడు జూరాల గతి ఏంకావాలి? శ్రీశైలానికి నీళ్లు వచ్చినా జూరాలలో నీళ్లు ఉండవు. నారాయణపేట నియోజకవర్గానికి సాగునీరిచ్చే పాలమూరు ఎత్తిపోతల కాల్వను పెద్దది చేసి, దాన్ని భీమా ద్వారా సంఘంబండ రిజర్వాయర్‌లో వేసి అక్కడి నుంచి వాగుద్వారా జూరాలకు కూడా నీళ్లు ఇవ్వాలి. లేకపోతే జూరాల ఆయకట్టు బతకది. నెట్టెంపాడుకు, భీమాకు నీళ్లురావు. తాగడానికి కూడా ఉండవు. ఇవన్నీ కావాలంటే సమగ్రమైన విధానం అవలంబించాలి.

### జూరాలకు కూడా పాలమూరు నీళ్లు

**జూరాల** ప్రాజెక్టుకు కూడా పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారానే నీళ్లు సప్లిమెంట్ చేయాల్సి ఉన్నది. కర్ణాటకను బతిమాలుకొనే దుస్థితి లేకుండా ఆలోచన చేసినం. 'పాలమూరు జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాల నీళ్లు' నినాదం విజయవంతం కావడమే కాదు.. అదనంగా 3, 4 లక్షల ఎకరాలకు నీళ్లు.. మొత్తంగా 15-20 లక్షల ఎకరాల మధ్య పాలమూరు జిల్లా సస్యశ్యామలంగా పంటలతో తులతూగే జిల్లాగా వచ్చే సంవత్సరం నుంచి మారే అవకాశముంటది. కాళేశ్వరం ప్రాజెక్టు చేస్తమని చెప్తే ఎవనికీ నమ్మకంలేదు. అయ్యేపనా.. సచ్చేపనా? అని మాట్లాడినారు. ఇప్పుడు సచ్చినోడు ఎవరో బతికినోడు ఎవరో అందరికీ తెలుసు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కావచ్చు, పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సెంట్రల్ వాటర్ కమిషన్ కావచ్చు.. ఇదొక అద్భుతం, మ్యాన్ మేడ్ మార్వెల్ అని వేయినోళ్ల ప్రశంసిస్తున్నరు. అమెరికాలోని న్యూయార్క్ టైమ్‌స్క్వేర్‌లో మన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చూపిస్తున్నరు. ఇది జీర్ణంకాని సన్నాసులు.. ఇక్కడ కాళేశ్వరం నీళ్లు పక్కపంటి దూకుతుంటే ప్రాణహితల పోయి డ్రామాలు చేస్తున్నరు.

### తొలి దశలో కరివెన వరకు నీళ్లు

గోదావరి ప్రాజెక్టులు కొలిక్కి వచ్చినయి. కాళేశ్వరం దాదాపు పూర్తయింది. మిడ్‌మానేరు 14 టీఎంసీలతో నిండుతా ఉన్నది. కంటి న్యూగా గంగ పొంగుతున్నది. అదే పరిస్థితి పాలమూరు జిల్లాలో కూడా రావాలే. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులే కాకుండా పాలమూరు ఎత్తిపోతల పథకం కచ్చితంగా ఒకనెల వెనకో ముందో వచ్చే వర్షాకాలం నాటికి తీసుకురావాలనే సంకల్పంతో ఈ రోజు ఇక్కడికి వచ్చిన. తొందరపాటు ఏమీలేదు. రాజకీయాల్లేవు. ఫస్ట్ ఫేజ్‌లో కరివెన వరకు నీళ్లు తీసుకొచ్చి నింపే ఆలోచనలో ఉన్నం. ఆ తర్వాత ఉద్దండాపూర్ కానీ, లక్ష్మీదేవిపల్లి కానీ, అదేవిధంగా వికారాబాద్ జిల్లాకు పోయే నీళ్లుకానీ ఇచ్చే ఆలోచన చేస్తున్నం. రూ.10 వేల కోట్లు అప్పుతెచ్చినం. బడ్జెట్‌లో కొంత సమకూర్చినం. వచ్చే బడ్జెట్‌లో కొంత సమకూరుస్తాం. రెండు ఫేజ్‌లలో సమగ్ర లక్ష్యాన్ని రాబోయే రెండేండ్లలో సాధించాలి.

### పాలమూరును ఎండబెట్టినారు..

**సమైక్యపాలనలో** పాలమూరును ఎండబెట్టినారు. బొంబాయి బస్సుల నిలయం చేశారు. ఘోరమైన పరిస్థితులుండేవి. కరువు, వలసల జిల్లా కింద దెబ్బకొట్టినారు. ఉత్తర తెలంగాణ ఆరిపోయింది. దేశంలోనే ఎక్కడలేనన్ని పంపుసెట్లు! అధికారికంగానే 24 లక్షలు, అనధికారికంగా మరో 3, 4 లక్షల పంపుసెట్లు ఉంటయి. తెలంగాణ రైతాంగం ఒక్కొక్క పంపుసెట్టు, ఒక్కొక్క బోరు కోసం రూ.25 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చుపెట్టారు. 800-900 ఫీట్లు లోపలికి వేస్తే తప్ప నీళ్లురాని దుస్థితికి కారకులు ఇదే కాంగ్రెస్ నాయకులు. పాలమూరు వలసల జిల్లా కావడానికి కారకులు ఎవరు? ఇయ్యాల మళ్లీ వాళ్లే మాట్లాడుతున్నరు. చాలా ఘోరం, చాలా బాధ, జాలి కూడా కలుగతది. వాళ్లకు నీళ్ల పరిమాణాల మీద, భౌగోళిక, కాంటూరు అంశాలమీద పరిజ్ఞానం లేదు. నోటికివచ్చి నట్లు మాట్లాడే దుర్మార్గమైన పద్ధతి.

## పాలమూరు ప్రజలను గుండెలో పెట్టుకుంటాం

**పాలమూరు** ప్రజలు మమ్ముల్ని గుండెల పెట్టుకున్నరు. 14కు 13 అసెంబ్లీ సీట్లు, రెండింటికి రెండు ఎంపీ సీట్లు, ఐదింటికి ఐదు జిల్లా పరిషత్తులను గెలిపించారు. రేపు అన్ని మున్సిపాలిటీలు గెలిపిస్తరని మాకు తెలుసు. ఉన్న మరొక్క ఎమ్మెల్యే కూడా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి టీఆర్ఎస్‌లో చేరారు. ఇంత ఏకపక్షంగా ఈ జిల్లా మమ్ముల్ని గుండెలో పెట్టుకున్నది కాబట్టి వందశాతం పాలమూరును గుండెలో పెట్టుకుంటం. 'ఇది తెలంగాణ.. అవసరమైతే కుర్చీ వేసుకొని పాలమూరు ప్రాజెక్టు కట్టిస్త' అని 2014 గద్వాల సభలో చెప్పిన. అట్లనే ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను కంప్లీట్ చేసినం. మిగిలినవి కూడా వందశాతం నెరవేర్చి ఈ జిల్లాలో 15-20 లక్షల ఎకరాలకు నీళ్లిస్తం. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు బ్రహ్మాండంగా నీళ్లు వస్తయి. కేసీఆర్ అన్నడు అంటే వందశాతం జరిగి తీరుతది. మిషన్ భగీరథను కూడా 'అయితదా... పోతదా' అన్నరు. ఇప్పుడంతా కండ్లప్పగించి చూస్తున్నరు. పాలమూరు ప్రజలకు సేవచేసి వారి రుణాన్ని తప్పకుండా తీర్చుకుంటామని ముఖ్యమంత్రిగా హామీ ఇస్తున్న. హైదరాబాద్‌లో విలువైన భూములు అమ్మకానికి పెట్టినం. ఆ డబ్బు చాలావరకు పాలమూరు ఎత్తిపోతల పథకానికే వాడుతం. ఎక్కడా లోపంరాకుండా, ఒక్కరోజు కూడా ఆగకుండా పాలమూరు ప్రాజెక్టు వేగం పుంజుకుంటది. మూడు షిఫ్టుల్లో పనిచేస్తం. రోజుకు రెండు మూడు గంటలు మినహా యుద్ధంలా చేస్తం. ప్రతి 10-15 రోజులకు ఒకసారి నేను కూడా వచ్చే ప్రయత్నం చేస్త. పూర్తిస్థాయిలో ప్రాజెక్టులను విజయవంతంచేసి పాలమూరు పాలుగారే ఊరుగా, పాలుగారే పాలమూరుగా తయారుచేస్తం. బంగారంలాంటి భూములున్నయి. కష్టపడి పనిచేసే రైతాంగం ఉన్నది. అద్భుతమైన ఫలితాలు రాబోతాయి. మేము కలలుకన్న పాలమూరు వందకు వందశాతం కండ్లచూస్తం. కల్వకుర్తి, పాలమూరు రెండూ కలిపి 15-20 లక్షల ఎకరాల మధ్య ఎట్ల తీసురావాలనే ఆలోచన జరుగుతున్నది. మిత్రుడు నిరంజన్‌రెడ్డి గుడిపల్లి గట్టు ఎత్తు పెంచుకోవచ్చని చెప్పినారు. ఇక్కడనే 10 టీఎంసీలు పెంచుకోవచ్చు. జొన్నలబోడు కూడా పెంచుకోవచ్చుననే ప్రతిపాదనలు ఉన్నయి. సిస్టర్న్ లెవల్, పంప్ లెవల్ సరిపోవడంలేదు. ఒకటిరెండు రిజర్వాయర్లు తెచ్చినట్లయితే మనకు చాలా లాభం జరుగతది. గోదావరి- కృష్ణా అనుసంధానం కల నిజమైతే శ్రీశైలం ఎప్పుడూ నిండుగా ఉంటది కాబట్టి మనకు ఆ బాధ లేకుండాపోతది. దీన్ని ఆలోచిద్దాం. రాబోయే నెల ఆంధ్రతో మనకు ఏం సంబంధం జరుగుతుందో చూద్దాం. ఒకవేళ నింపేసని అయితే పుష్కలమైన నీరు గోదావరిలో ఉన్నది. కాబట్టి మనం మొగులుకు ముఖం చూడకుండా (మహబూబ్‌నగర్ జిల్లాలో మెడం అంటరు) వ్యవసాయం చేసే పరిస్థితి పాలమూరుకు త్వరలోనే వస్తది.

### ముహూర్తం

సూర్యోదయం: 6.05 గంటలకు

సూర్యాస్తమయం: 6.28 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, అమావాస్య సాయంత్రం 4.09 వరకు, తదుపరి శుక్లపక్షం పాడ్యమి, నక్షత్రం: మఖ సాయంత్రం 5.12 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.06 నుంచి సాయంత్రం 4.42 వరకు, రాహుకాలం: ఉదయం 10.44 నుంచి మధ్యాహ్నం 12.17 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి 9.23 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.41 నుంచి 1.31 వరకు, వర్జ్యం: ఉదయం 6.42 నుంచి 8.18 వరకు.



నాగర్‌కర్నూలు జిల్లా నార్లాపూర్ వద్ద అప్రోచ్ కాల్వను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలో కురుమూర్తిరాయ (కరివెన) రిజర్వాయర్ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్లు



గురువారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్

# కాళేశ్వరం స్ఫూర్తితో పూర్తిచేద్దాం

- యుద్ధప్రాతిపదికన పాలమూరు- రంగారెడ్డి పనులు
- ఇక్కడా బీహెచ్ఈఎల్ బాహుబలి మోటర్లు వాడాలి
- ఏదులలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం కేసీఆర్ రివ్యూ

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధానప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రతిపక్షాల ఆటంకాలను ఎదుర్కొని ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసుకున్నామని, అదే స్ఫూర్తితో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేద్దామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణం లక్ష్యంగా అంకుఠితదీక్షతో యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలో పనుల పురోగతిపై సీఎం కేసీఆర్ గురువారం వనపర్తి జిల్లా గోపాలపేట మండలం ఏదుల రిజర్వాయర్ వద్ద ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల నిర్మాణం, కాల్వలు. సొరంగమార్గాల తవ్వకాలు, ఎత్తిపోతల మోటర్ల బిగింపు పనులు, విద్యుత్ నిర్మాణ పనుల్లో పురోగతిపై చర్చించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ కేంద్రంగానే కొనసాగుతున్న మిషన్‌భగీరథ పనుల పురోగతితోపాటు ఇప్పటికే 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టుపైనా సమీక్షించారు. ఎత్తిపోతల పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల పురోగతిని ఈఎన్సీ, వర్క్ ఏజెన్సీలను వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం.. ఇకనుంచి పనులు పరుగులు పెట్టాల్సిందేనని స్పష్టంచేశారు. పాలమూరు- రంగారెడ్డి పురోగతిపై ఇకనుంచి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ పదిరోజులకోసారి సమీక్ష జరుపుతారని సీఎం తెలిపారు. 'కాళేశ్వరం పని పట్టినం.. ఇకనుంచి మీ వెంట పడుతం' అంటూ సమావేశంలో నవ్వులు పూయించిన సీఎం.. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను ఆకుపచ్చగా మార్చేవరకు అహర్నిశలు కృషిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. సమీక్షను కల్వకుర్తి ఎత్తిపోతలతో ప్రారంభించిన సీఎం ఆ పథకం పనుల వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలిచ్చారు. ఇక్కడ కూడా నీటిఎత్తిపోతకు బాహుబలి మోటర్లను వినియోగించనున్నారు. వీటిని బయటినుంచి కాకుండా వీలైనంత వరకు బీహెచ్ఈఎల్ కంపెనీ ద్వారానే కొనుగోలు చేయాలని వర్క్‌ఏజెన్సీ ప్రతినిధి మెగా కృష్ణారెడ్డికి సీఎం కేసీఆర్ సూచించారు.

### కరివెన నుంచి ఏదుల దాకా..

**పాలమూరు- రంగారెడ్డి** ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనలో భాగంగా సీఎం కేసీఆర్ గురువారం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను, పంప్‌హౌస్‌లు, టన్నెళ్లు, అప్రోచ్ చానెళ్లు, కాల్వలను పరిశీలించారు. బేగంపేట నుంచి హెలికాప్టర్ ద్వారా సీఎం కేసీఆర్ 11 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కరివెన రిజర్వాయర్‌కు చేరుకున్నారు. ఇక్కడ పనులు కొనసాగించడానికి అన్ని అనుకూలతలు ఉన్నా ఎందుకు ఆలస్యమవుతున్నదని అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. నాలుగు నెలల్లోగా రిజర్వాయర్, పంప్ హౌస్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.200 కోట్లు కావాలని జిల్లా కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకురాగా.. నిధులు విడుదలచేయాలని సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్‌ను ఆదేశించారు. కరివెన నుంచి హెలికాప్టర్‌లో వట్టెం రిజర్వాయర్ చేరుకున్న సీఎం అక్కడి పనులను పరిశీలించారు. జీ గుట్టతండా, పోతిరెడ్డిపల్లి, వట్టెం, అనాకపల్లి రైతులు పరిహారంకోసం వినతిపత్రం సమర్పించగా.. వెంటనే అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. అక్కడ ప్రాజెక్టు ఫొటో ప్రదర్శన తిలకించారు. వట్టెం రిజర్వాయర్ కట్ట పనులు సగమే జరిగాయని, త్వరగా మొత్తం పూర్తిచేయాలని ఆదేశించారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో నార్లపూర్ రిజర్వాయర్‌కు చేరుకున్న సీఎం అక్కడ రెండుగంటలపాటు ఉన్నారు. శ్రీశైలం కృష్ణానది బ్యాక్‌వాటర్‌ను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. సమీపంలోని ప్రతిపాదనలో ఉన్న సోమశిల సిద్దేశ్వరం బ్రిడ్జి నిర్మాణప్రాంతాన్ని పరిశీలించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి వీటిని తీసుకునే కోతిగుండు ప్రాంతాన్ని, ఎంజీకేఎల్‌ఐ పంపింగ్ సరళిని గమనించారు. నార్లాపూర్ రిజర్వాయర్ పంపింగ్ స్టేషన్ల పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్ ద్వారా శ్రీశైలం బ్యాక్‌వాటర్, కృష్ణానది ఏపీ, తెలంగాణ వైపు విస్తరించిన తీరును సీఎం పరిశీలించారు. అక్కడి నుంచి హెలికాప్టర్లో ఏదుల రిజర్వాయర్ ప్రాంతానికి చేరుకొని మధ్యాహ్న భోజనం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏదుల వచ్చే క్రమంలో నార్లాపూర్ నుంచి వచ్చే కాల్వ పనులను, ఏదులలో కొనసాగుతున్న రిజర్వాయర్ నిర్మాణ పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. సాయంత్రం 6 .20 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు సంతోష్‌కుమార్, పీ రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వరరెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, అబ్రహం, పైలట్ రోహిత్‌రెడ్డి, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్లు స్వర్ణ సుధాకర్‌రెడ్డి, వనజ ఆంజనేయులుగౌడ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం,మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, కార్పొరేషన్ చైర్మన్లు బాద్మి శివకుమార్, దేవర మల్లప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సీఈ రమేశ్‌కుమార్, సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి కలెక్టర్లు రొనాల్డ్ రోస్, శ్రీధర్, శ్వేతామొహంతి, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### లోకం పోకడ




డ్రంకెన్ డ్రైవింగ్ కాదు సార్.. ట్రాఫిక్ జరిమానాలు చూసి..!

## నేడు కార్యాచరణ ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి...

రూపొందించుకుని దానికి గ్రామసభ ఆమోదం పొందాలని సీఎం అన్నారు. గ్రామంలో ఖర్చుపెట్టే ప్రతిపైసా గ్రామసభ ఆమోదంతోనే జరుగాలని సీఎం స్పష్టంచేశారు. శుక్రవారం జరుగనున్న సమీక్షా సమావేశానికి ఇతర అధికారులు, అనధికారులతోపాటు, కామారెడ్డి, సిద్దిపేట, వరంగల్ అర్బన్ జిల్లాల కలెక్టర్లను కూడా పిలువాలని సీఎం ఆదేశించారు. వారితోపాటు వారి జిల్లాలకు సంబంధించిన ఇద్దరు ఎంపీడీవోలను, ఒక డీఎఫ్‌వోను, ఒక డీపీవోను, విద్యుత్‌శాఖ ఎస్ఈని, సీపీవోను తమ వెంట తీసుకురావాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు కొప్పులఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు రాజీవ్ శర్మ, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి పొందిన ముఖ్యమంత్రి చీఫ్ సెక్యూరిటీ అధికారులు ఎస్ వీరారెడ్డి, నరేందర్‌సింగ్ గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేస్తున్న దృశ్యం

## కాళేశ్వరానికి మరో 18వేల కోట్ల రుణం

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూడో టీఎంసీ ఎత్తిపోతల అదనపు పనులకు గ్రామీణ విద్యుద్ధీకరణ సంస్థ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు సీఎస్ ఎస్కే జోషి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ నుంచి శ్రీపాద ఎల్లంపల్లి వరకు మూడో టీఎంసీ నీటి ఎత్తిపోతల పనులకు రూ. 4,657.95 కోట్లు, శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) బరాజ్ నుంచి శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్ వరకు మూడో టీఎంసీల నీరు ఎత్తిపోతలకు రూ.14,093.43 కోట్లు.. మొత్తం రూ. 18,751.38 కోట్ల రుణానికి అనుమతించింది. ఇందుకు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్ట్ సంస్థకు రాష్ట్రం గ్యారంటీ ఇవ్వనున్నది.



సచివాలయం నిర్మాణంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు నివేదిక అందజేస్తున్న క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్

# సచివాలయం నిర్మాణంపై సీఎంకు నివేదిక

- సమర్పించిన క్యాబినెట్ సబ్‌కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయ నిర్మాణం కోసం ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ గురువారం సీఎం కే చంద్రశేఖర్‌రావుకు నివేదిక సమర్పించింది. సబ్‌కమిటీ సభ్యులైన మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్ ఉదయం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదిక అందించారు. వివిధశాఖల ఈఎన్సీలతో ఏర్పాటైన టెక్నికల్ కమిటీ బుధవారం తన నివేదికను సబ్‌కమిటీకి అందించింది. దీనిని పరిశీలించిన సబ్‌కమిటీ తమ అభిప్రాయాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేసింది.



మంటల్లో కాలిపోతున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ బోగీలు

# తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- ఢిల్లీకి వెళ్తుండగా హర్యానాలో ఘటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. ఢిల్లీకి వెళ్తున్న రైలు.. గురువారం ఉదయం 7.43 గంటలకు హర్యానాలోని అసోటి-బల్లభ్‌గఢ్ మధ్య బోగీల్లో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. గమనించిన గేట్‌మెన్.. రైలు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన అధికారులు బల్లభ్‌గఢ్ వద్ద రైలును నిలిపివేశారు. మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా ప్రభావిత మూడు బోగీలను తొలిగించారు. మంటలు ఆర్పేశారు. రైల్వే సిబ్బంది, అధికారులు సకాలంలో స్పందించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని, ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణికులను ఇతర బోగీల్లో సర్దుబాటు చేసి మధ్యాహ్నానికి ఢిల్లీకి క్షేమంగా తరలించినట్టు తెలిపింది. బోగీల్లో పొగలు రావడానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్టు పేర్కొన్నది.

## కంప్యూటర్ వినియోగ సామర్థ్య పరీక్ష 8న

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెప్టెంబర్ 8న 'ప్రొఫిషియెన్సీ ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ విత్ యూసేజ్ ఆఫ్ కంప్యూటర్ అండ్ అసోసియేటెడ్ సాఫ్ట్‌వేర్' అంశంపై కంప్యూటర్ వినియోగ సామర్థ్య పరీక్ష నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ తెలిపారు. జీఏడీ, న్యాయశాఖ, ఆర్థికశాఖలో ఏఎస్వో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ పరీక్ష 30 నిమిషాలు ఉంటుందని తెలిపారు. ప్రతి అభ్యర్థికి ప్రశ్నపత్రం ఇస్తామని, కంప్యూటర్‌పై పూర్తిచేయాలని చెప్పారు. సమాధాన పత్రం డౌన్‌లోడ్ చేసుకొని ఇన్విజిలేటర్ సమక్షంలో అటెస్టేషన్ చేయాలని తెలిపారు. హాల్‌టికెట్, పరీక్ష కేంద్రానికి సంబంధించిన సమాచారం, పరీక్ష సిలబస్, స్కీమ్ ఆఫ్ ఎగ్జామ్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. గ్రూప్-2 అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి సమాచారం పొందాలని సూచించారు.

## 'విదేశీ విద్యానిధి'కి గడువు సెప్టెంబర్ 27

- మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్‌ఖాసిం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీ విద్యార్థులు ఈ ఏడాది మైనార్టీ సంక్షేమ శాఖ అందించే విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుచేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్‌ఖాసిం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60 శాతం మార్కులు సాధించి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలనుకొనేవారు, పీజీలో 60 శాతం మార్కులు సాధించి పీహెచ్‌డీ చేయాలనుకొనేవారు మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 27వ తేదీలోగా దాఖలుచేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం telangana.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల

- రూ.31.64 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాంతాల అభివృద్ధికి వివిధ జిల్లాలు, నియోజకవర్గాలకు రూ.31.64 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రణాళికశాఖ, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు పలు ఉత్తర్వులు జారీచేశారు. అదిలాబాద్ జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.70.35 లక్షలు , హైదరాబాద్ జిల్లాలకు రూ.43.32 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గానికి రూ.2.06 కోట్లు, భూపాలపల్లి నియోజకవర్గానికి రూ.14.30 కోట్లు, మంచిర్యాల నియోజకవర్గానికి రూ.58.62 లక్షలు, వర్ధన్నపేట నియోజకవర్గానికి రూ.10 కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు రూ.132.96 లక్షలు నిధులు కేటాయించారు.

# గిరిజనాభివృద్ధికి కృషి భేష్

- పంచాయతీలతో గిరిజనుల స్వయంప్రగతి
- తెలంగాణ ప్రభుత్వ పథకాలు బాగున్నాయ్
- జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్‌సాయి ప్రశంస




గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ అధికారులతో సమావేశమైన జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్‌సాయి. చిత్రంలో తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి, కమిషన్ సభ్యులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని, దీనిద్వారా గిరిజనులు స్వయంప్రగతి సాధించేందుకు అవకాశం కల్పించినట్టయిందని జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్‌సాయి తెలిపారు. గిరిజనుల సమగ్రాభివృద్ధికి తెలంగాణప్రభుత్వం చేపడుతున్న కృషి భేష్ అని ప్రశంసించారు. జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో గిరిజన సంక్షేమశాఖ, హోంశాఖ, రెవెన్యూ, పట్టణాభివృద్ధి, అటవీ, విద్య, వైద్యం తదితర శాఖలకు చెందిన ముఖ్యకార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో గిరిజనుల కోసం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం నందకుమార్‌సాయి మీడియతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఉమ్మడిఏపీ విభజన చట్టం ప్రకారం తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం అనుమతిచ్చిందని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్నదని అన్నారు. దీని అభివృద్ధికి కేంద్రం తరపున తగిన ప్రోత్సాహం అందేలా ప్రతిపాదనలు చేస్తామన్నారు. చెంచులకు భూమితో పాటు, మరికొన్ని సదుపాయాలు కావాలని డిమాండ్ చేస్తున్నారని, వాటిపై కేంద్రానికి ప్రతిపాదిస్తామని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 150 నుంచి 200 పనిదినాలకు పెంచడం ద్వారా ఎస్సీ, ఎస్టీవర్గాలకు ఉపాధి దక్కుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గిరిజనుల్లో సికిల్‌సెల్ ఎనీమియా వంటి వ్యాధులను నయంచేసే పథకాలను కేంద్రప్రభుత్వం చేపడుతుందన్నారు. అదేవిధంగా గిరిజనతండాలకు వైద్యుడు, నర్సు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు.

### డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం హర్షణీయం

తెలంగాణలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ పథకం ఒక మంచి ఆలోచనఅని, దేశంలో ఎక్కడాలేనివిధంగా అధిక మొత్తం నిధులతో ఇండ్లను నిర్మించడం అభినందనీయమని నందకుమార్‌సాయి తెలిపారు. తెలంగాణకు హరితహారం వంటి మంచి కార్యక్రమాలతో రాష్ట్రప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినాజెడ్‌చోంగ్తూ, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హరిక్రిష్ణదామోదర్, హర్షద్ భాయ్, చున్నీలాల్ వాసవ, మాయ చింతమన, జాయింట్ సెక్రటరీ ఎస్కేరా తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో మొహర్రం ఏర్పాట్లపై సమీక్షలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్ మల్లారెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తదితరులు ఉన్నారు.

# మొహర్రానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ఈ పండుగ హిందూ, ముస్లిం మతసామరస్యానికి ప్రతీక
- సమీక్షలో మంత్రులు కొప్పుల, మహమూద్‌అలీ, తలసాని, మల్లారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మొహర్రం సందర్భంగా ప్రభుత్వశాఖలన్నీ పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్ మల్లారెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్‌తో కలిసి మొహర్రం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని పండుగల మాదిరిగానే మొహర్రంకు కూడా ప్రాధాన్యమిచ్చి అవసరమైన ఏర్పాట్లుచేస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా ఆషూర్‌ఖానాల మరమ్మతులకు తగిన నిధులు మంజూరుచేసినట్టు చెప్పారు. బీబీకా ఆలం ఊరేగింపు కోసం ఏనుగును ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. మొహర్రం సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఎప్పటికప్పుడు శానిటేషన్‌పై దృష్టిసారించాలన్నారు. విద్యుత్, మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు మొహర్రంను జరుపుకొంటారని చెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. అవాంతరాలు చోటుచేసుకోకుండా అధికారులతో వాట్సాప్ గ్రూపు తయారుచేసి పర్యవేక్షించాలని ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్‌కు సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, ఎఫెండీ, ఎమ్మెల్యేలు అహ్మద్‌పాషాఖాద్రి, ముంతాజ్‌అహ్మద్‌ఖాన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్‌సలీం, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ కలెక్టర్ హరీశ్, అదనపు కమిషనర్ డీఎస్ చౌహాన్, మైనార్టీ సంక్షేమశాఖ సంచాలకుడు షానవాజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

### మైనార్టీల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి కొప్పుల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని మైనార్టీల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హామీఇచ్చారు. మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు వహీద్‌అహ్మద్ గురువారం మంత్రిని కలిసి.. సబ్సిడీ రుణాలు, వివిధశాఖల్లో అధికారుల నియామకం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పందిస్తూ.. మైనార్టీశాఖలో పూర్తిస్థాయి అధికారుల నియామకం, కొత్త రుణాల మంజూరు సమస్యలను వారంరోజుల్లో పరిష్కరిస్తామని స్పష్టంచేశారు.

# రేవంత్‌రెడ్డిఖబ డ్దార్!

- మా సీఎండీనే కాల్చేస్తామంటారా?
- 70 వేల మంది ఉద్యోగులు తలుచుకుంటే ఎక్కడుంటారు
- ఇంటికి కరంట్ కట్‌చేసి చెమటలు పట్టిస్తాం జాగ్రత్త
- కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై ఆగ్రహం
- క్షమాపణ చెప్పాలి: విద్యుత్ సంఘాలు



ఎంపీ రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యుత్‌సౌధలో విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మా సీఎండీనే కాల్చేస్తామంటున్నారు.. మేం 70 వేల మంది ఉద్యోగులం తలుచుకుంటే మీరు ఎక్కడుంటారు.. 24 గంటలూ కష్టపడుతున్న తమ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదంటూ కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డిపై విద్యుత్ ఉద్యోగ సంఘాలు మండిపడ్డాయి. రేవంత్ ఇంటికి కరంట్ కట్ చేసి చెమటలు పట్టిస్తామని, రుజువులేని ఆరోపణలు చేస్తున్న ఆయనపై కేసులు వేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించాయి. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును అమరవీరుల స్థూపం వద్ద కాల్చినా తప్పులేదంటూ మీడియా సమావేశంలో ఎంపీ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలను విద్యుత్ సంస్థల్లోని సంఘాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. గురువారం ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధలో 25 సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళనకు దిగాయి. అనంతరం విద్యుత్ సౌధ ఎదుట భారీ ధర్నా నిర్వహించాయి. ఓటుకు నోటు దొంగ రేవంత్ ఖబడ్దార్, రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నేతలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. రేవంత్ అహంకారపూరితమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. క్షమాపణ చెప్పని పక్షంలో కరంట్ ఉద్యోగుల ఆగ్రహానికి గురికాకతప్పని హెచ్చరించారు.

పదిహేను రోజులుగా విద్యుత్ సంస్థలపై జరుగుతున్న విషప్రచారానికి ముగింపు పలుకకపోతే తీవ్ర పరిణామాలుంటాయని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ శివాజీ హెచ్చరించారు. విద్యుత్ సౌధలో జరిగిన ఉద్యోగుల ధర్నాలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఆయన పరిధి దాటి సీఎండీని కాల్చి చంపాలనడం తమను కలచివేసిందని, ప్రజాసేవచేసే నాయకులు ఇలా మాట్లాడటం దారుణమన్నారు. 'మీరు మా సీఎండీని కాల్చిచంపుతామంటున్నారు. మేం 70వేల మందిమి తలచుకుంటే మీరెక్కడుంటారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. మేం కాల్చడం కాదు.. మీ ఇంటికి కరంట్ కట్‌చేసి చెమటలు పట్టించగలమని గుర్తుపెట్టుకోవాలి' అని హెచ్చరించారు. 1150 మంది ఏపీ ఉద్యోగులు అక్కడకు వెళ్లకుండా తెలంగాణలోనే తిష్టవేసి కూర్చుంటే రేవంత్‌రెడ్డి ఒక్కసారైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. సీఎండీ ప్రభాకర్‌రావుకు విద్యుత్ ఉద్యోగులమంతా అండగా ఉంటామని, రేవంత్ వ్యాఖ్యలపై చర్చించి కేసు నమోదు చేసే విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన వారిని తిరిగి ఎలా నియమిస్తారంటూ రేవంత్ ప్రశ్నిస్తున్నారని.. గతంలో ఏపీఎస్ఈబీ, ట్రాన్స్‌కో, జెన్‌కోకు సీఎండీలుగా పదవీవిరమణ పొందిన తాతారావు, పార్థసారథి, బలరాంరెడ్డిని నియమించలేదా అని ప్రశ్నించారు. ప్రభాకర్‌రావు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలోనూ పనిచేసిన విషయం తెలియదా? అని మండిపడ్డారు. అనుభవం, సామర్థం రీత్యానే తెలంగాణ ప్రభుత్వం ప్రభాకర్‌రావును సీఎండీగా నియమించిందని, ఆయన నాయకత్వంలో విద్యుత్ సంస్థలు పురోగమిస్తున్నాయన్నారు. రేవంత్ వాఖ్యలు యావత్ విద్యుత్ ఉద్యోగులను అవమానించేవిగా ఉన్నాయని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మేడి రమేశ్ అన్నారు. విద్యుత్‌రంగంలో అనుభవశీలిఅయిన ప్రభాకర్‌రావు కష్టం, త్యాగఫలితంగానే నేడు తెలంగాణ చీకట్లను దాటి కోటి కాంతుల ఖిల్లాగా మార్చుకోగలిగామని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ విద్యుత్ ఉద్యోగుల ఆగ్రహావేశాలకు గురికాకతప్పని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి అంజయ్య హెచ్చరించారు. ప్రభాకర్‌రావు 70 ఏండ్ల వయస్సులోనూ యువ ఇంజినీర్‌గా పనిచేస్తూ తెలంగాణ సమాజానికి విద్యుత్‌నందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మా సీఎండీని కాల్చినా తప్పులేదన్నారంటే.. 70 వేల మందిని కాల్చుతామన్నట్లేనని.. తామంతే ఏకతాటిపై ఉండి రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ఓసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ రాజకీయాలు చేసుకోవాలంటే ఏమైనా చేసుకోండి కాని. మా సీఎండీ జోలికొస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. టీఆర్వీకేఎస్ కార్యదర్శి కమలాకర్‌రావు, టీఈఈఏ డిస్కం అధ్యక్షుడు తుల్జారాంసింగ్, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు సదానందం, శంకర్, బీసీరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భానుప్రసాద్, కమలాకర్, రాంజీ, రాజేంద్రప్రసాద్, షరీఫ్ తులసినాగరాణి తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.




# గ్రామాల్లో పనుల ప్రాధాన్యం గుర్తించాలి

- అభివృద్ధి చేయాలే తప్ప కాంట్రాక్టర్లుగా మారొద్దు
- స్థానిక సంస్థలకు త్వరలోనే నిధులు
- రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్




ఆర్థిక, పరిపాలనపై ఎంపీపీలకు నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామాలకు అవసరమయ్యే పనుల్లో ప్రాధమ్యాలను గుర్తించి చేయించాలని, రాజకీయ నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడు అభివృద్ధి పనులుచేయాలి కానీ కాంట్రాక్టర్లుగా మారొద్దని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థికసంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని ఇంజినీరింగ్‌భవన్‌లో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ)లకు ఆర్థిక, పరిపాలన అంశాలపై గురువారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వినోద్‌కుమార్ మాట్లాడుతూ స్థానికసంస్థలకు 2003లో అప్పటి ఫైనాన్స్‌కమిషన్ నివేదికల ప్రకారం ఇప్పటికీ నిధుల కేటాయింపులు చేస్తున్నారని, ఈ పద్ధతి మారాలన్నారు. నూతనంగా 15వ ఆర్థికసంఘం సిఫారసులు, రాష్ట్ర ఆర్థికసంఘం సర్వేలన్నీ త్వరగా పూర్తిచేసి, జనవరిలోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రతి ప్రజాప్రతినిధి ఆర్థికసంఘం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. 2014లో ఫైనాన్స్ కమిషన్ నివేదికలన్నీ తప్పుగా ఉన్నాయని చెప్పారు. స్థానికసంస్థలకు నిధులు అవసరం లేదని, రాష్ట్రాలే భరించుకోవాలని తప్పుదోవ పట్టించడంతో గత ఐదేండ్లలో జిల్లా, మండల పరిషత్తులకు రూపాయి కూడా నిధులు రాలేదన్నారు. దీనిపై గతంలోనే కేంద్రాన్ని ప్రశ్నించానని, స్థానిక సంస్థలకు నిధులివ్వాలని 2017లో కేంద్రానికి లేఖరాశానని వినోద్‌కుమార్ వివరించారు. జిల్లా, మండల పరిషత్‌లకు నిధులివ్వాలని సీఎం కేసీఆర్ సైతం 15వ ఆర్థికసంఘానికి నివేదిక ఇచ్చారని గుర్తుచేశారు. గ్రామీణరోడ్ల గురించి కూడా సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తున్నారన్నారని, గ్రామాల అభివృద్ధికి త్వరలోనే నిధులు కేటాయించనున్నారని తెలిపారు.

### ఎంపీపీలకు పర్యవేక్షణ బాధ్యతలు

మండల పరిషత్ అధ్యక్షులంటే ఆషామాషీకాదని, మండల పరిధిలోని అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ అధికారులు, ఇతర అంశాలపై పరిశీలన చేసే బాధ్యతలు ఉంటాయని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ అన్నారు. స్థానికసంస్థలకు రూ.1400 కోట్ల నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులైనా ఎంపీపీల పరిధిలోకి వస్తాయని, అన్నింటిలో ఎంపీపీల భాగస్వామ్యం ఉండాలని చెప్పారు. వివిధ జిల్లాల ఎంపీపీలు తమకు నిధులు లేవని, కనీసం మండల పరిధిలో తిరిగేందుకు వాహనం కూడా లేదని ఫైనాన్స్ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి ఎన్నో శాఖలు, మండలాల ఆర్థికస్థితిని పెంపొందించేందుకు తలసరి గ్రాంటు, సీనరేజ్, భూమి బదలాయింపు రుసుం వంటి వాటా పెంచడం, ప్రజా పరిషత్తులకు సర్దుబాటుచేసే వాటిపై చొరవ తీసుకోవాలని కోరారు. ఎంపీపీలు లేవనెత్తిన అంశాలన్నీ సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామని రాజేశంగౌడ్ తెలిపారు. సదస్సులో తెలంగాణ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఫైనాన్స్ కమిషన్ సభ్యులు చెన్నయ్య, ఆనంద్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఆర్థిక సంఘం కార్యదర్శి సురేశ్‌చందాతోపాటు రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి ఎంపీపీలు పాల్గొన్నారు.





బీజేపీ దగ్గర 'వాషింగ్ మిషిన్' ఉన్నది. ఎవరినైనా మేం పార్టీలోకి తీసుకునేటప్పుడు, వారిని మా వాషింగ్ మిషిన్‌లో శుద్ధి చేస్తాం. మా దగ్గర గుజరాత్ నిర్మాపౌడర్ ఉన్నది.

**రావ్ సాహెబ్ దాన్వే, కేంద్ర మంత్రి**

అమిత్ షా బాధ్యతారహితంగా మాట్లాడటం మానుకోవాలి. ఆయన పార్లమెంట్‌లో చేసిన ప్రకటనలో అస్సాంలో 40లక్షల మంది జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ)లో నమోదుకాని వారున్నారని, వారిని వలస వచ్చినవారిగా గుర్తించి దేశం నుంచి బహిష్కరిస్తామని అన్నారు. ఈ విధమైన ప్రకటనలతో ప్రజల్లో గందరగోళం, భయాందోళనలు నెలకొంటాయి. అమిత్ షా నిగ్రహం పాటించాలి.

**సుస్మితా దేవ్, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు**



**చరిత్రలో నేడు**



**1682** నూతన ప్రపంచ ఆవిష్కరణ కోసం ఇంగ్లండ్ నుంచి సముద్రయానానికి బయలుదేరిన విలియం పెన్.

**1928** భారత్‌కు స్వాతంత్ర్యం ప్రకటించాలని బ్రిటన్‌ను డిమాండ్ చేసిన జవహర్‌లాల్ నెహ్రూ.





**1932** జర్మనీ పార్లమెంట్ రీష్‌స్టాగ్ చైర్మన్‌గా ఎన్నికైన హెర్మన్ గోరింగ్.

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై నుంచి అవినీతి, లంచగొండితనాన్ని రూపుమాపుతానని ప్రకటించారు. ఆ క్రమంలోనే తాజాగా 22మంది ఆదాయపన్ను శాఖలోని ఉన్నతాధికారులను నిర్బంధ పదవీ విరమణతో ఇంటికి పంపారు. గతంలోనూ ఇదే విధంగా 27మంది అత్యున్నత అధికారులను ఇంటికి సాగనంపారు. ఇందులో పన్నుల శాఖలోని కేంద్రబోర్డు అధికారులుండటం విశేషం. మన సమాజాన్ని క్యాన్సర్‌లా పీడిస్తున్న అవినీతి, లంచగొండితనాన్ని రూపుమాపేందుకు మహోద్యమమే సాగాల్సిన అవసరం ఉన్నది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**

చట్టాలు, కోర్టులు ఎన్ని హితబోధలు చేసినా చెవికెక్కని సమాజం మనది. సంప్రదాయాలు, కట్టుబాట్ల పేర గ్రామీణ సమాజాన్ని హింసాత్మకం చేస్తున్నారు. కుటుంబ కట్టుబాట్లను అతిక్రమించారని హతమారుస్తున్నారు. కేరళలోని కొట్టాయంలో కెవిన్ జోసెఫ్ అనే 23 ఏండ్ల యువకుడు ప్రేమ వివాహం చేసుకున్న నేరానికి హత్యచేశారు. కోర్టు పదిమంది ముద్దాయిలకు జీవిత ఖైదు విధించింది. కోర్టులు, శిక్షలతోనే ఇలాంటి హత్యాకాండ ఆగిపోదు. దీనికి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చైతన్యోద్యమం చేపట్టాల్సిన అవసరం ఉన్నది.

**ది హిందూ**



# ప్రజాస్వామ్యమే మన బలం

పత్రికా స్వేచ్ఛ, విలువల కోసం నిలువవలసిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) మీడియాపై ఆంక్షలను సమర్థిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం, పైగా పత్రికా స్వేచ్ఛ, దేశ ప్రయోజనాలు పరస్పర విరుద్ధమనే రీతిలో కుతర్కాన్ని వినిపించడం తీవ్ర అభ్యంతరకరం. తీవ్ర విమర్శలు పెల్లుబుకడంతో పీసీఐ చైర్మన్ సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌ను మార్చుకున్నట్టు కనిపించినా, ఆ వైఖరిలో మాత్రం తేడా కనిపించడం లేదు. కశ్మీర్‌లోని వార్తలను స్థానిక పత్రికలే కాకుండా, ఇతరరాష్ట్రాలలోని మీడియా కూడా సేకరించడం అసాధ్యమైపోయింది. ఈ నేపథ్యంలో కమ్యూనికేషన్స్‌పై ఆంక్షలను ఎత్తివేయాలని కోరుతూ కశ్మీర్‌లోని ఒక పత్రిక ఎడిటర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పత్రికా స్వేచ్ఛకు అండగా నిలువడం ప్రెస్ కౌన్సిల్ విద్యుక్తధర్మం. కానీ పీసీఐ చైర్మన్ స్వయంగా ఈ విషయంలో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తూ దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం హేతుబద్ధమైన ఆంక్షలు అవసరమని చెప్పడం ఆశ్చర్యకరం. ప్రెస్‌కౌన్సిల్ చట్టబద్ధ సంస్థ. పత్రికా స్వేచ్ఛకు ఆటంకం వాటిల్లకుండా చూడటం, పత్రికా విలువలకు భంగం కలుగకుండా చూడటం పీసీఐ బాధ్యత. పంజాబ్‌లో ఉగ్రవాదం తీవ్రరూపం దాల్చినప్పుడు, నిజాయితీగా వార్తలను అందించడం పత్రికలకు కత్తిమీద సాము మాదిరిగా మారినప్పుడు పీసీఐ ఎంతో గురుతరమైన బాధ్యతను పోషించింది. అయోధ్య వివాదం పతాకస్థాయికి చేరుకున్నప్పుడు, కొన్ని హిందీ పత్రికలు మతవిద్వేషం రగిలించే కథనాలు ప్రచురించినందుకు ప్రెస్‌కౌన్సిల్ వాటిని తప్పుపట్టింది. అంతటి ఘన చరిత్ర ఉన్న ప్రెస్‌కౌన్సిల్‌ను పత్రికా స్వేచ్ఛ అణిచివేత సాధనంగా మార్చడం తగదు. ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ సీకే ప్రసాద్ సుప్రీం కోర్టుకు తమ వైఖరిని తెలిపే ముందు ప్రజాస్వామ్యబద్ధంగా అంతర్గత చర్చ జరుపకపోవడం గమనార్హం. దీంతో ప్రెస్‌కౌన్సిల్ సభ్యులు కొందరు సుప్రీంకోర్టుకు చైర్మన్ తెలిపింది ఆయన వ్యక్తిగత భావనే తప్ప కౌన్సిల్ అభిప్రాయం కాదని స్పష్టం చేశారు.

> **మన దేశం డెబ్బయేండ్లకు పైగా స్వాతంత్ర్య చరిత్రలో అనేక ఉద్యమాలను చవిచూసింది. సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించడం వల్ల ఆ ఉద్యమాలు సమసిపోయాయి. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజాస్వామ్య పరిష్కారం ద్వారానే ఉపశమించింది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయిందీ అంటే అది అక్కడి నిరంకుశ ప్రభుత్వ బలహీనత. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా ఉన్నదీ అంటే అది మన ప్రజాస్వామ్య వ్యవస్థకున్న బలం.**

నియంతృత్వ వ్యవస్థలో ప్రజలు ఏమనుకుంటున్నారో, తమ పరిపాలనలోని లోటుపాట్లేమిటో పాలకులకు తెలిసే అవకాశం ఉండదు. తమ అనుచరగణాలు చెప్పేదే సత్యమని నమ్మవలసి వస్తుంది. పాలకుల చర్యలను సమర్థించే భజన బృందాలుంటాయే తప్ప భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడానికి సాహసించరు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న సౌలభ్యం– ప్రజాభిప్రాయాన్ని నిర్భయంగా వెల్లడించే వేదికలుంటాయి. ప్రతిపక్ష పార్టీలు, పత్రికలు, స్వచ్ఛంద సంస్థలు ఇట్లా అనేక మార్గాలలో పాలకులకు వాస్తవాలు చేరే అవకాశం ఉంటుంది. ప్రజాభిప్రాయం తీవ్ర వ్యతిరేకంగా ఉన్నప్పుడు, వారి ఆగ్రహాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేసే వెసులుబాటు ఉండాలె. ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అసంతృప్తిని వ్యక్తంచేసే మార్గం లేనప్పుడే ఎక్కడైనా ఉద్యమాలు, ఆందోళనలు పెల్లుబుకుతాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించడంలో తీవ్ర జాప్యం జరుగవచ్చు. ఈలోగా పరిస్థితి చేజారిపోవచ్చు. అందుకే ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారపక్షం వారు కూడా తమకు నచ్చినా నచ్చకపోయినా తమను విమర్శించే పత్రికలను కూడా చదువుతారు. తమ పార్టీ సభ్యుల ద్వారానే కాకుండా ఇతర మార్గాలలో సమాచార సేకరణ జరిపి వాస్తవాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. తమ భజన బృందం లేదా సైన్యం చెప్పే కథనాలనే నమ్ముకున్న ప్రభుత్వాలు మనుగడ సాగించలేవు. పత్రికలు పాలకులకు నచ్చని వాస్తవాలను కూడా ప్రచురిస్తాయి. దేశ ప్రయోజనాలు నెరవేరుతాయని భావించి ఈ వాస్తవాలను ప్రచురిస్తాయే తప్ప, దేశద్రోహం చేద్దామని కాదు. పత్రికా స్వేచ్ఛ, దేశ ప్రయోజనాలు పరస్పర విరుద్ధమైనవి కాదు.

మన దేశం డెబ్బయేండ్లకు పైగా స్వాతంత్ర్య చరిత్రలో అనేక ఉద్యమాలను చవిచూసింది. సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించడం వల్ల ఆ ఉద్యమాలు సమసిపోయాయి. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజాస్వామ్య పరిష్కారం ద్వారానే ఉపశమించింది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయిందీ అంటే అది అక్కడి నిరంకుశ ప్రభుత్వ బలహీనత. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా ఉన్నదీ అంటే అది మన ప్రజాస్వామ్య వ్యవస్థకున్న బలం. 1992 జనవరి 26న శ్రీనగర్‌లో జెండా ఎగురవేస్తానని బీజేపీ నేత మురళీ మనోహర్ జోషి ప్రకటించినప్పుడు, ప్రధాని పీవీ నరసింహారావు వాయుమార్గంలో ఆయనను తీసుకుపోయి, సైనిక బలగాల రక్షణలో పతాకావిష్కరణ చేసే ఏర్పాట్లు చేశారు. పీవీ చర్య వల్ల కశ్మీర్ అదుపులోనే ఉందనే సంకేతం ఇతర దేశాలకు వెళ్ళింది. ఇప్పుడు ప్రతిపక్ష ప్రముఖుడు సీపీఎం నేత సీతారామ్ ఏచూరి కశ్మీర్ వెళ్ళి అనారోగ్యంతో ఉన్న మిత్రుడిని పరామర్శించడానికి సుప్రీంకోర్టు తలుపు తట్టవలసి వచ్చింది. సైన్యం పహారాలో జైలులోని ఖైదీతో ములాఖత్ ఏర్పాటు చేసినట్టుగా సాగింది ఆయన పరామర్శ. కశ్మీర్‌కు ప్రతిపక్ష నాయకులు వెళ్ళలేరు, పత్రికలు వార్తలు రాయలేవు. ఈ పరిస్థితి ఇతర దేశాలకు ఎటువంటి అభిప్రాయాన్ని కలుగచేస్తుంది? నాడు ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రతిపక్షాలు వ్యతిరేకించడం దేశ ద్రోహం కాదు. నేడు పత్రికా స్వేచ్ఛను కోరడమంటే దేశ సమగ్రతకు వ్యతిరేకం కాదు. ప్రజాస్వామిక పద్ధతులను కాపాడుకొని దేశాన్ని బలోపేతం చేయడమే.

**జనగళం**

## విడ్డూరంగా ఉన్నది

రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే ప్రతిపక్ష నేతలు ఉండటం దురదృష్టకరం. రాష్ట్ర రైతాంగానికి కరెంటు కష్టాలు తీర్చడానికి ప్రభుత్వంతో పాటు విద్యుత్ సిబ్బంది అహోరాత్రులు కృషి చేసింది. దాని ఫలితంగా తొలుత తొమ్మిది గంటలు ఇప్పుడు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటును అందిస్తున్నది. కానీ కొంతమంది నేతలకు ఇది మింగుడు పడటం లేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వంపై ఏ విమర్శలు చేయాలో పాలుపోక విద్యుత్ అంశాన్ని తెరమీదికి తెచ్చి దానిమీద అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారు. దీనికి సంబంధిత శాఖ అధికారులు వివరణ ఇచ్చిన తర్వాత కూడా ఇంకా కొంతమంది పనిగట్టుకుని ఈ విషయాన్ని తెరమీదికి తెచ్చి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నం చేయబూనడం క్షమార్హం కాదు. రైతుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు ప్రకటించింది. అయినా ఎన్నడూ రైతు సంక్షేమం పట్టని వారు తాజాగా రైతుల గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉన్నది.

**– బి. రామాంజనేయులు, నాగార్జునసాగర్**

## భరోసా ఇచ్చిన ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నది. సాగు నీటి సౌకర్యం ఉంటే రైతులు బాగుపడుతారు. అట్లనే వ్యవసాయ అనుబంధ వృత్తులకు కూడా మేలు జరుగుతుందని ప్రభుత్వం భావించింది. అందుకే అనేక వివాదాల్లో ఉన్న ప్రాజెక్టులను నేర్పుతో పరిష్కారం చేసుకుంటూ పూర్తిచేస్తున్నది. దీంతోపాటు చెరువుల పునరుద్ధరణ కూడా చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగంపై తీసుకుంటున్న చర్యల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తమ కలలు నిజమౌతున్నాయని అంటున్నారు. ఇవ్వాల వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ వృత్తుల వారికి కూడా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక భరోసా లభిస్తున్నది. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకుపోతుండటం కొందరికి నచ్చడం లేదు. ఏదో విధంగా రంధ్రాన్వేషణతో తప్పులు వెదుకుతూ రాజకీయ పబ్బం గడుపుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజల శ్రేయస్సు పరమావధిగా అందరూ ఆలోచిస్తే రాష్ట్రానికి మేలు.

**– మంగళారపు సుభాష్‌రెడ్డి, గొల్నేపల్లి, వలిగొండ.**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

జాతీయం



**నళిన్ వర్మ**

# జేడీయూ, బీజేపీ పొత్తుకు బీటలు

**కేంద్రంలో బీజేపీకి చాలినంత మెజారిటీ వచ్చిన తర్వాత జేడీ (యూ) వర్గాలకు సంఖ్యాబలం ఆధారంగా నిష్పత్తి ప్రకారం మంత్రివర్గంలో చోటు దక్కలేదు. దీనిపై తీవ్రంగా స్పందించిన నితీశ్‌కుమార్ తగు విధం గా స్పందిస్తూనే తదనుగుణంగా ఎత్తులు వేస్తున్నారు. బీజేపీతో నేరుగా తలపడకుండానే తనదైన పద్ధతితో జేడీ (యూ) అస్తిత్వాన్ని చాటేందుకు ప్రయత్నిస్తున్నారు.**

వచ్చే ఏడాది 2020 నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ వేళ బీజేపీ, జేడీ(యూ) సోపతి ముగిసినట్లేనా అన్న దానికి ఔననే సమాధానం వస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ మంత్రివర్గంలో నామమాత్రపు ప్రాతినిధ్యానికి జేడీ (యూ) దూరంగా ఉన్నది. ప్రస్తుత పార్లమెంటులో ఎంపీల సంఖ్యతో నిమిత్తం లేకుండా మంత్రివర్గంలో ఒకరికి మాత్రమే చోటివ్వటానికి బీజేపీ సిద్ధపడింది. దీంతో జేడీ (యూ) దాన్ని తిరస్కరించి, ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా మాత్రం కొనసాగుతామని ప్రకటించటం గమనార్హం.

దెబ్బకు దెబ్బ అన్నట్లుగా బీహార్‌లో నితీశ్‌కుమార్ తన మంత్రివర్గాన్ని విస్తరించి ఎనిమిది మందిని జేడీ (యూ) సభ్యులనే తీసుకున్నారు. ఈ ఏడాది మే 30న మోదీ ప్రభుత్వం కేంద్రంలో ఒక మంత్రి పదవిని మాత్రమే ఖాళీగా ఉంచి, తగిన వ్యక్తితో తర్వాత భర్తీ చేస్తామని ప్రకటించారు. బీహార్‌లో, కేంద్రంలో బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న జేడీ (యూ)కు కేంద్ర మంత్రివర్గంలో సరైన రీతిలో ప్రాతినిధ్యం దక్కలేదు. దానికి ప్రతిచర్యగా బీహార్‌లో నితీశ్‌కుమార్ అదే రీతిలో వ్యవహరిస్తున్నారు. మొత్తంగా చూస్తే.. మరికొన్ని నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఈ సమయంలో బీహార్‌లో బీజేపీ, జేడీ(యూ)లు కలిసి పోటీ చేసే పరిస్థితులు కనిపించటం లేదు. మరోవైపు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బీజేపీతో మిత్రత్వం ఉంటుందని చెబుతూనే.. అంటీముట్టనట్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎన్డీఏతో మా సంబంధాలు బాగానే ఉన్నాయి. మేం ఎన్డీఏలో భాగస్వామ్యపక్షంగానే ఉన్నామని ప్రకటిస్తున్నారు. జనతాదళ్(యు) ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి మాత్రం కేంద్ర మంత్రివర్గంలో మాకు సముచిత స్థానం దక్కుతుందని ఆశించాం. కానీ మోదీ మాకు ఒక మంత్రి పదవి మాత్రమే ఇవ్వజూపారు. దాన్ని మేం ఒప్పుకోలేదు. అయినా మేం ఇప్పటికీ ఎన్డీఏలో భాగస్వామ్య పక్షంగానే కొనసాగుతున్నామని ప్రకటించారు.

గత వృత్తాంతాలు చూస్తే నితీశ్‌కుమార్ రాజకీయ విధానాలు ఆశ్చర్యం కలిగించటం లేదు. కూటమి రాజకీయాలకు ఎప్పుడు ఏ రీతిన చెల్లుచీటి చెబుతారో అంతుచిక్కని విధంగా ఆయన గతంలో నిర్ణయాలు తీసుకున్నారు. 2013లో మూడురోజుల ముందుదాకా తాము ఎన్డీఏ భాగస్వామ్యపక్షంగానే ఉన్నామని ప్రకటించారు. కానీ అసెంబ్లీలో మాత్రం ఈరోజు మాత్రం మేం ఎన్డీఏ మిత్రపక్షంగా ఉన్నాం. రేపు ఏమవుతుందో చెప్పలేం అని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపర్చారు. అదే విధంగా 2017లో కూడా వ్యవహరించారు. ఆర్జేడీతో జతకలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఆయన దాన్నుంచి దూరమై ఎన్డీఏలో చేరిన ఉదంతం ఉండనే ఉన్నది. ఈ నేపథ్యంలోఎన్డీఏతో తమ సంబంధాలు మంచిగానే ఉన్నాయన్న జేడీ (యూ) వర్గాల మాటల అంతరార్థం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అవుతున్నది.

కేంద్రంలో బీజేపీకి చాలినంత మెజారిటీ వచ్చిన తర్వాత జేడీ (యూ) వర్గాలకు సంఖ్యాబలం ఆధారంగా నిష్పత్తి ప్రకారం మంత్రివర్గంలో చోటు దక్కలేదు. దీనిపై తీవ్రంగా స్పందించిన నితీశ్‌కుమార్ తగు విధంగా స్పందిస్తూనే తదనుగుణంగా ఎత్తులు వేస్తున్నారు. బీజేపీతో నేరుగా తలపడకుండానే తనదైన పద్ధతితో జేడీ (యూ) అస్తిత్వాన్ని చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే క్రమంలో నితీశ్ తనదైన మౌలిక రాజకీయ, సైద్ధాంతిక విధానాలను వదులుకోకుండానే నిష్పత్తి ప్రకారం రాజకీయ సంఖ్యబలాన్ని నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించి గత ఎన్నికల్లో 17:17 సీట్లను బీజేపీ, జేడీ (యూ) ఎంపీ సీట్లలో పోటీచేశాయి. అయితే బీజేపీ 17 స్థానాలు గెల్చుకోగా, జేడీ (యూ) మాత్రం ఒక సీటు కోల్పోయి 16 స్థానాలు గెల్చుకున్నది. ఈ క్రమంలోనే నితీశ్‌కుమార్ తనదైన మార్క్‌తో రాజకీయాల్లో పెద్దన్న పాత్రను అంగీకరించటానికి సిద్ధంగా లేరు. అలాగే తాము ఒకరికి లొంగి ఉండే స్థితిని కూడా సమ్మతించటం లేదు. గత లోక్‌సభ ఎన్నికల ప్రచార సందర్భంలో కూడా బీజేపీ తనదైన శైలిలో తాము పెద్దన్న పాత్ర పోషిస్తామని చెప్పుకున్నది. అయితే నితీష్‌కుమార్ మాత్రం ఆ విషయాలపై ఏమీ మాట్లాడకుండానే తన పని తాను కానిచ్చేశారు. అలాగే బీజేపీ జాతీయస్థాయి నేతలు ఎన్నికల్లో అనేకవిధాలైన నినాదాలు ఇచ్చినా వాటి జోలికి నితీశ్ పోకుండా మసలుకున్నారు. ఒక ప్రాంతీయపార్టీగా రాజకీయంగా తనదైన అస్తిత్వాన్ని నిలుపుకుంటూనే బీజేపీ మిత్రపక్షంగా నేర్పుగా వ్యవహరించారు. ఉదాహరణకు బీహార్ ఎన్నికల సందర్భంలోనే బీజేపీ, లోక్‌జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) పార్టీలు ఉమ్మడిగా వందేమాతరం కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆర్టికల్ 370ని రద్దుచేస్తామని, అయోధ్యలో రామాలయాన్ని నిర్మిస్తా మని, ఉమ్మడి పౌరసత్వ బిల్లును తెస్తామని ప్రకటించారు. వీటన్నింటి పట్ల నితీశ్ కుమార్ ఎక్కడా ప్రతిస్పందించ లేదు. తమవైన రాజకీయ సైద్ధాంతిక పునాదితో వాటిని ఖండించలేదు. కానీ బీజేపీ మిత్రపక్షంగా కనీస ఉమ్మడి కార్యక్రమం అమలుచేస్తామని మాత్రం చెప్పుకున్నారు.

> **వచ్చే ఎన్నికల నాటికి నితీశ్ మరో కొత్త భాగస్వామ్యపక్షంతో జతకట్టి ఎన్నికల్లో గెలువాలని చూస్తున్నారు. మరోవైపు బీజేపీ కూడా తనదైన ప్రచార బలంతో, ప్రత్యామ్నాయంగా తమ కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థిని తెరమీదికి తెచ్చి మెజారిటీ సాధించాలని పట్టుదలతో ఉన్నది. ఇప్పుడే బీహార్‌లో బీజేపీయేతర రాజకీయపక్షాలన్నీ ఏకమై నితీశ్‌కుమార్‌తో చేతులు కలుపుతారని అనుకోవటం తొందరపాటు అవుతుంది. బీజేపీ తన శక్తియుక్తులన్నీ ప్రయోగించి నితీశ్ శకానికి చెక్ పెట్టడానికి ప్రయత్నిస్తున్నది.**

కానీ ఇప్పుడు బీజేపీలో చాలా మార్పు వచ్చింది. అటల్ బిహారీ వాజపేయి–అద్వానీ హయానికి, మోదీ–షా కాలానికి చాలా తేడా ఉన్నది. అటల్–అద్వానీ శకంలో మిత్రపక్షాల అభిప్రాయాలను గౌరవిస్తూ, వారికి సముచిత స్థానం, గౌరవం ఇచ్చారు. ఉమ్మడి అంగీకారంతో ముందుకు పోయారు. అనేక విషయాల్లో రాజీ పడ్డారు. ఇప్పుడు బీజేపీకి లోక్‌సభలో అవసరమైన మెజారిటీ ఉన్నది. ఆ బలంతో తాజాగా మోదీ, షా ద్వయం దూకుడుగా ముందుకుపోతున్న తీరు స్పష్టంగా కనిపిస్తున్నది. తామనుకున్న వాటిని ఎవరేమనుకున్నా, భాగస్వామ్యపక్షాలను సంప్రదించకుండానే, కనీసం చర్చించకుండానే విధాన నిర్ణయాలు తీసుకుంటున్నతీరు కనిపిస్తున్నది.

బీజేపీతో మౌలిక విషయాల్లో విభేదాలున్నా నితీశ్‌కుమార్ బీహార్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రమంతటా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ క్రమంలోనే బీజేపీ అభ్యర్థులు ఎంపీలుగా పోటీ చేస్తున్న 17నియోజకవర్గాల్లో, ఎల్‌జేపీ పోటీ చేస్తున్న ఆరు నియోజకవర్గాల్లో కూడా నితీశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ క్రమంలో ఆయన ప్రజల జీవన ప్రమాణాలు పెరుగటానికి కేంద్రం తగు రీతిన నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి కోసం 50వేల కోట్లను విడుదల చేయటంపై మోదీని ప్రశంసించారు. ఈ క్రమంలో బీజేపీ, జేడీ (యూ), ఎల్‌జేపీల మధ్య ఉన్న సిద్ధాంతపరమైన విషయాలతో వైరుధ్యాలు రాకుండా జాగ్రత్త వహించారు.

ఇప్పుడు మోదీ, షా ద్వయం తిరుగులేని మెజారిటీ సాధించారు. ఆ క్రమంలో వారి విధానాలకు దేశ ప్రజలందరి సమ్మతి, చట్టబద్ధత ఉంటుందనే విశ్వాసం మాత్రమే కాదు, తమ చర్యలకు, విధానాలకు సంపూర్ణమద్దతు ఉంటుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో వారు ఈ దేశంలో తరతరాలుగా కొనసాగుతున్న బహుళ సాంస్కృతిక జీవన విధానాలను ఏకత్వ, మెజారిటీవాదంతో తృణీకరిస్తున్నారు. జాతి నిర్మాతల భిన్నత్వంలో ఏకత్వమనే విధానానికి తూట్లు పొడుస్తున్నారు.

మోదీ–షా ద్వయం తీవ్ర హిందుత్వ, జాతీయవాదంతో ముందుకుపోతున్న తీరుకు నితీశ్‌కుమార్ ఆటంకంగా మారే పరిస్థితి ఉన్నదనే కారణంతోనే నామమాత్ర ప్రాతినిధ్యాన్ని ఇవ్వజూపారని అర్థమవుతుంది. ఈ క్రమంలో వారు నితీశ్ రాజకీయ విధానాలను పరీక్షకు పెట్టాలనుకున్నారని అనిపిస్తున్నది. కానీ నితీశ్ మాత్రం బీజేపీ అనుసరిస్తున్న హిందుత్వ అతివాద ధోరణిని తీవ్రంగా వ్యతిరేకించే పరిస్థితి ఉంటుందని ప్రముఖ సోషలిస్టు నేత, ఆర్జేడీ ఉపాధ్యక్షుడు శివానంద్ తివారీ వ్యక్తం చేశారు. నితీష్ రాజకీయ జీవితం, అతని ఎదుగుదల తెలిసిన వారెవరూ బీజేపీ విధానాలను నితీశ్ నెత్తిన మోయరని అంటున్నారు.

నితీశ్‌కుమార్ నరేంద్రమోదీని దేశానికి ప్రధానిగా ఆమోదిస్తారు. కానీ అతనికి కాదు. నితీష్ తన ఆదర్శ, అనుసరణీయ నేతలుగా రామ్‌మనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్‌లను పరిగణిస్తారు. వారు చెప్పిన భిన్నత్వంలో ఏకత్వాన్ని అనుసరిస్తారు. తద్వారా సామాజిక సఖ్యతను, ఐకమత్యాన్ని కోరుకుంటారు. ఈ నేపథ్యంలో బీజేపీ, జేడీ (యూ)ల మధ్య ఏర్పడిన అగాథం మరింత పెరిగే సూచనలే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీతన్ రామ్ మాంఝీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు నితీశ్ హాజరయ్యారు కానీ, బీజేపీ నిర్వహించిన దానికి హాజరుకాలేదు. అలాగే నితీశ్ నిర్వహించిన ఇఫ్తార్ విందుకు బీజేపీ నేతలెవరూ పోకపోవటం గమనార్హం.

నితీశ్ పాలనా విధానాలకు రాష్ట్రప్రజల మద్దతు క్రమంగా పెరుగుతున్న తీరే కనిపిస్తున్నది. జేడీ(యూ)కు 2014లో 16.04శాతం ఓట్లు వస్తే, తాజా ఎన్నికల్లో అది 21.8శాతానికి పెరిగింది. అదే క్రమంలో బీజేపీకి 29.40 ఓట్ల శాతం నుంచి 23.58శాతానికి పడిపోయాయి. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు నితీశ్‌కుమార్ మోదీ గాలితో ఓట్ల శాతాన్ని పెంచుకున్నారని చెప్పుకొస్తున్నారు. అదే క్రమంలో వివిధ సామాజికవర్గాలను తనకు అనుకూలంగా మల్చుకోవటంలో సఫలమయ్యాడని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికల నాటికి నితీశ్ మరో కొత్త భాగస్వామ్యపక్షంతో జతకట్టి ఎన్నికల్లో గెలువాలని చూస్తున్నారు. మరోవైపు బీజేపీ కూడా తనదైన ప్రచార బలంతో, ప్రత్యామ్నాయంగా తమ కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థిని తెరమీదికి తెచ్చి మెజారిటీ సాధించాలని పట్టుదలతో ఉన్నది. ఇప్పుడే బీహార్‌లో బీజేపీయేతర రాజకీయపక్షాలన్నీ ఏకమై నితీశ్‌కుమార్‌తో చేతులు కలుపుతారని అనుకోవటం తొందరపాటు అవుతుంది. బీజేపీ తన శక్తియుక్తులన్నీ ప్రయోగించి నితీశ్ శకానికి చెక్ పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. రాజకీయ కూటములకు, రాత్రికి రాత్రి పరిణామాలకు పెట్టింది పేరైన బీహార్ రాజకీయాలకు కాలమే సమాధానం చెబుతుంది.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు), (ది వైర్ సౌజన్యంతో)**

# పచ్చదనంతోనే మన మనుగడ

హరితహారం



**కోలేటి దామోదర్**

చెట్లే సర్వజీవుల మనుగడకు ఆధారం. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ 'హరితహారం' ద్వారా తెలంగాణ తల్లికి పచ్చలహారాన్ని వేయాలనే దృఢ దీక్షను చేపట్టారు. ఎప్పుడో అశోక చక్రవర్తి తన రాజ్యమంతటా విస్తృతంగా చెట్లు నాటించాడని చదువుకున్నాం. మళ్లీ ఆ రకంగా ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన నాయకుడు కేసీఆర్. ముఖ్యమంత్రి ఆగస్టు 15న గోల్కొండ కోటలో జాతీయపతాకాన్ని ఎగురవేసిన సందర్భంగా సందేశం ఇస్తూ.. రాష్ట్రంలో మొక్కలను నాటాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో హరితహారం 60 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి పట్టణం, గ్రామం తమకు అవసరమైన నర్సరీలను స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకోవాలి. జిల్లా హరితకమిటీ అందించే సూచనలను పాటించాలి. పట్టణ, గ్రామ బడ్జెట్లో పది శాతం నిధులను పచ్చదనాన్ని పెంచే పనులకు కేటాయించాలి. గ్రామాల్లో ప్రతి ఇంటికీ ప్రజలు కోరుకునే ఆరు మొక్కలను సరఫరా చేయాలి. ప్రజలు వాటిని నాటి, సంరక్షించి పెద్ద చేసేలా ప్రేరణ కలిగించాలి. ఆకుపచ్చని పర్యావరణాన్ని వారసత్వంగా అందించడమే మన నిజమైన కర్తవ్యం కావాలని సీఎం కేసీఆర్ ఆకాంక్ష.

సమస్త జీవజాతుల మనుగడకు చెట్లు అవసరం. విచక్షణారహితంగా అడవులను నరికివేయడం వల్ల ఎదురవుతున్న దుష్పరిణామాలు మనం చూస్తున్నాం. అడవులను నరికివేయడం వల్ల మూగజీవాలు దిక్కుతోచని స్థితిలో అవి సమీప గ్రామాలపై పడుతున్నాయి. ఇటీవల కాలంలో ఏనుగులు, పులులు గ్రామాలపై దాడి చేసి, పంటలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు ఎక్కువయ్యాయి. ఎన్నోరకాల పక్షిజాతులు నేల రాలిపోతున్నాయి. అడవులు అంతరిస్తుండటం వల్ల వాటికి నీరు, ఆహారం దొరకక పోవడమే దీనికి కారణం. ఈ పరిస్థితికి బాధ్యుడు మనిషే. ఈ భూమి పై జీవించే హక్కు ఒక్క మనిషికే లేదు. సమస్త జీవరాశులు భూమాత బిడ్డలే. కాబట్టి పర్యావరణ పరిరక్షణ, జీవ సమతుల్యత అడవుల వల్లనే సాధ్యమౌతాయి. ఈ సత్యాన్ని గ్రహించి అడవులను పెంపొందించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది.

ముఖ్యమంత్రి గారు ఎన్నో సందర్భాల్లో 'వానలు రావాలె–కోతులు వాపస్ పోవాలె' అన్న నినాదాన్ని మనకు అందించారు. దీనిలోని పరమార్థాన్ని మనం గ్రహించాలి. అరణ్యాలు పచ్చగా ఉండి అక్కడ నీళ్లు, ఆహారం సమృద్ధిగా ఉంటే కోతులకు మన ఇండ్లపైకి రావాల్సిన అవసరం ఉండదు. వాటికి మన ఇండ్ల మీద పడక తప్పని, గత్యంతరం లేని పరిస్థితిని మనమే కల్పిస్తున్నాం. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి ఉద్బోధించిన మహాయజ్ఞం వంటి ఈ పవిత్ర కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో జయప్రదం చేయాలి. ప్రజలంతా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తే రాష్ట్రం హరిత తెలంగాణగా మారుతుంది. రాష్ట్రంలో పోలీస్ కార్యాలయ సముదాయాల్లో, నివాస సముదాయాల ప్రాంగణాల్లోనూ ఉన్నతాధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు విస్తృతంగా మొక్క లు నాటడం ముదావహం. జైళ్లలో ఖైదీలు కూడా ఎంతో ఉత్సాహంగా హరితహారం కార్యక్రమంలో పాల్గొంటుండటం ముదావహం.

ఈ మధ్య జపాన్ ప్రభుత్వం ఒక చికిత్స విధానాన్ని బాగా ప్రచారంలోకి తెస్తున్నది. దాని పేరు 'ఫారెస్ట్ థెరపీ'. నగరవాసుల్లో ఉండే ఒత్తిడి, ఆందోళనలకు చికిత్స ప్రకృతే అన్నది ఈ థెరపీ సిద్ధాంతం. మనసు చికాకుగా ఉన్నప్పుడు పచ్చని పరిసరాల్లో నడిస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. అడవులలో తిరుగడం, ధ్యానం చేయడంతో పాటు చెట్టును గట్టిగా చుట్టుకుని కొద్దిసేపు ఉంటే శరీరం, మనస్సు ఎంతో ఉపశమనం కలుగుతుందని వారు గుర్తించారు. ఈ ప్రక్రియ మనలో ఉన్న ప్రతికూల భావావేశాలను తొలిగించి, ప్రశాంతతను కలుగజేస్తుందని, మనిషిలోని నెగెటివ్ ఆలోచనలను రూపుమాపి ఒక తోవలోకి తేవడానికి ఈ విధమైన మెడిటేషన్ ఉపయోగపడుతుందని జపాన్ ప్రకృతి ప్రేమికులు అంటున్నారు. దీనిపై జపాన్‌లో ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి.

చెట్లకు ఇంతటి మహత్తరమైన శక్తి ఉందని మన పూర్వీకులు ఎప్పుడో గ్రహించారు. చెట్లను దేవతలతో సమానంగా పూజించే సంప్రదాయం మన దేశంలోనే ఉన్నది. కాబట్టి మనం నేడు నాటే మొక్కలు పెద్దవి అయి మన భావితరాలకు ఒక భరోసా ఇస్తాయి. అందుకే నీడనిచ్చే దృఢత్వం కలిగిన వేప, రావి, చింత వంటి మొక్కలతో పాటు, ఫల వృక్షాలు, ఔషధ మొక్కలను విరివిగా నాటాలి. గ్రామాలు మొదలు నగరాల దాకా రోడ్లకు ఇరువైపులా, మైదానాల్లో విధిగా పండ్ల చెట్లను పెంచాలి. దీనివల్ల పచ్చదనంతో పాటు మనుషులకు వన్యజీవులకు ఆహారం సమృద్ధిగా దొరుకుతుంది. అయితే మొక్కలను నాటడంతోనే మన బాధ్యత తీరిపోదు. వాటిని సంరక్షించే బాధ్యత కూడా మనమే చేపట్టాలి. వాటిని ప్రాణప్రదంగా పెంచాలి. అప్పుడే మనం చేసిన పనికి సార్థకత ఏర్పడుతుంది. అప్పుడే పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలుగుతాం. ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించగలం.

> **అయితే మొక్కలను నాటడంతోనే మన బాధ్యత తీరిపోదు. వాటిని సంరక్షించే బాధ్యత కూడా మనమే చేపట్టాలి. వాటిని ప్రాణప్రదంగా పెంచాలి. అప్పుడే మనం చేసిన పనికి సార్థకత ఏర్పడుతుంది. అప్పుడే పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలుగుతాం. ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించగలం.**

**(వ్యాసకర్త: రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్ ఛైర్మన్)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# హైకోర్టులో అవినీతి బహిరంగ రహస్యమే!

- పాట్నా హైకోర్టు సీనియర్ జడ్జి సంచలన వ్యాఖ్యలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రధాన న్యాయమూర్తి
- జడ్జి దగ్గరున్న కేసులు, న్యాయపరమైన విధులను ఉపసంహరిస్తున్నట్టు వెల్లడి

**పాట్నా, ఆగస్టు 29:** పాట్నా హైకోర్టులో అవినీతి బహిరంగ రహస్యమంటూ ఆ కోర్టు సీనియర్ జడ్జి రాకేశ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేయడం దుమారం రేపుతున్నది. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహించిన పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. జస్టిస్ రాకేశ్ దగ్గరున్న కేసులు, న్యాయపరమైన విధుల్ని ఉపసంహరిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేశారు. 'చీఫ్ జస్టిస్‌ను సీనియర్ జడ్జీలు ఎందుకు పొగుడుతారో జడ్జి అయిన కొత్తలో నాకేమీ అర్థమయ్యేది కాదు. తమకు అనుకూలమైన వాళ్లను న్యాయమూర్తులుగా తీసుకురావడానికో, తమ కులానికో, వర్గానికో మేలు చేయడానికో అలా చేస్తారని ఆ తర్వాత తెలిసింది' అని జస్టిస్ రాకేశ్ అన్నారు. హైకోర్టులోని నలుగురు న్యాయాధికారులపై పలు ఫిర్యాదులు ఉన్నప్పటికీ, వాళ్లు ఇంకా ఆయా స్థానాల్లో కొనసాగుతున్నారని.. ఇవన్నీ తెలిసి కూడా తాను ప్రేక్షకుడి పాత్రను పోషించాల్సి వస్తున్నదని.. తనను తాను ఎప్పటికీ క్షమించుకోలేనని అన్నారు. దాణా కుంభకోణం కేసు నడుస్తున్నప్పుడు అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ సీనియర్ జడ్జి భార్యకు రాజ్యసభ



సభ్యత్వం లభించిందని.. హైకోర్టులో అవినీతి బహిరంగ రహస్యమేనని ఆయన వ్యాఖ్యానించారు. జస్టిస్ రాకేశ్ కుమార్ వ్యాఖ్యలు కలకలం రేపడంతో పాట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏపీ సాహి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వద్ద ఉన్న కేసులు, పనులు అన్ని ఉపసంహరిస్తున్నట్టు ప్రకటించారు. తదుపరి ఆదేశాల వరకు చాంబర్‌లో నిరీక్షించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## 'చిన్మయానంద్' కేసుపై స్పందించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** యూపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి స్వామి చిన్మయానంద్‌పై ఫిర్యాదు చేసి అదృశ్యమైన విద్యార్థిని కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. దీనిపై జస్టిస్‌లు బానుమతి, బొప్పన్నతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరుపనున్నది. చిన్మయానంద్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపించి న విద్యార్థిని(19) మూడు రోజుల కిందట అదృశ్యమయ్యారు.

## 'వార్ అండ్ పీస్' ఓ క్లాసిక్!

- నా వ్యాఖ్య మరో పుస్తకంపై.. బాంబే హైకోర్టు జడ్జి వివరణ

**ముంబై, ఆగస్టు 29:** ప్రఖ్యాత రచయిత లియో టాల్‌స్టాయ్ రాసిన ప్రసిద్ధ నవల 'వార్ అండ్ పీస్'పై బాంబే హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతున్న నేపథ్యంలో తన వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చారు. లియో టాల్‌స్టాయ్ రాసిన 'వార్ అండ్ పీస్' అనేది సాహిత్యంలో గొప్ప క్లాసిక్ అని, అయితే తాను ఆ పుస్తకాన్ని ఉదహరించలేదని, బిశ్వజిత్ రాయ్ రాసిన 'వార్ అండ్ పీస్ ఇన్ జంగల్ మహల్' గురించి ప్రస్తావించామని పేర్కొన్నారు. భీమా కోరేగాం కేసుకు సంబంధించి ఓ బెయిల్ పిటిషన్‌పై బుధవారం విచారించే సమయంలో.. మావోయిస్టులతో సంబంధాలున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వెర్నన్ గంజాల్వేస్‌ను జస్టిస్ సారంగ్ కొత్వాల్ ప్రశ్నించారు. ఈ క్రమంలో.. 'వార్ అండ్ పీస్' వంటి అనుమతిలేని పుస్తకాలను నీ ఇంట్లో ఎలా పెట్టుకున్నావని నిందితున్ని అడిగారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లివెత్తాయి. 'కొత్త భారతానికి స్వాగతం' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

# గుర్తింపు ఆగమాగం



ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ ప్రారంభోత్సవం అనంతరం మాజీ క్రీడాకారులతో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

## ఫిట్‌నెస్.. జీవన విధానం కావాలి

- విజయానికి, దృఢత్వానికి అవినాభావ సంబంధం
- నయా పైసా పెట్టుబడి లేకుండా 'ఫిట్‌నెస్'తో అనంత లాభాలు
- యువతలో జీవనశైలి వ్యాధుల పెరుగుదల ఆందోళనకరం
- 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఫిట్‌నెస్ మన ఆరోగ్యానికి ఎంతో అవసరమని, అది మన జీవన విధానం కావాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. శారీరక దృఢత్వం ఉంటే వ్యాధులు మన దరి చేరవన్నారు. శారీరక దృఢత్వానికి, విజయానికి అవినాభావ సంబంధం ఉన్నదని చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఢిల్లీలో 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నయాపైసా పెట్టుబడి లేకుండా ఫిట్‌నెస్‌తో అనంత లాభాలను పొందవచ్చునన్నారు. 'ఫిట్‌నెస్ మన సంస్కృతిలో అంతర్భాగం. కానీ నేడు దృఢత్వం పట్ల మనం ఉదాసీనత ప్రదర్శిస్తున్నాం. కొన్ని దశాబ్దాల క్రితం ఒక వ్యక్తి రోజుకు 8-10 కి.మీ. నడిచేవారు. కానీ ఇప్పుడు టెక్నాలజీ వచ్చిన తర్వాత భౌతిక శ్రమ తగ్గింది. మనం తక్కువ దూరం నడుస్తున్నాం. మనం సరిపడినంత దూరం నడవడం లేదని ఇదే టెక్నాలజీ చెబుతుంది' అని ప్రధాని పేర్కొన్నారు. తాము చేపట్టిన ఫిట్ ఇండియా మూవ్‌మెంట్.. ఆరోగ్యకర భవిష్యత్ దిశగా దేశం ముందుకెళ్లేందుకు దోహదపడుతుందన్నారు. రోజువారీ జీవితంలో భౌతిక శ్రమతోపాటు క్రీడలకు, వ్యాయామానికి ప్రాధాన్యం ఇచ్చేలా ప్రజలను ప్రోత్సహించడమే తమ లక్ష్యం అని చెప్పారు. 'దృఢత్వం (ఫిట్‌నెస్) కేవలం ఒక పదం కాదు. ఆరోగ్యకరమైన సంపూర్ణ జీవితానికి ముందస్తు షరతు వంటిది. ఫిట్‌నెస్ ఒక విప్లవం కావాలి' తెలిపారు. యువతలో మధుమేహం, రక్తపోటు తదితర జీవన శైలి వ్యాధులు పెరుగుతున్నాయని ఇది ఆందోళనకరమన్నారు. హాకీ ప్రముఖుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని సహచర భారతీయుల సహకారంతో నూతన శిఖరాలకు తీసుకెళతామన్నారు. ఆ తర్వాత, జాతీయ క్రీడా అవార్డు విజేతలను ప్రధాని మోదీ అభినందించారు.

## అసోంలో రేపటితో ముగియనున్న ఎన్ఆర్సీ గడువు

- 41 లక్షల మంది 'భారతీయత' అగమ్యగోచరం
- పౌరసత్వం నిరూపించుకోవాలంటే కోర్టులను ఆశ్రయించాల్సిందే

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** మరో రెండు రోజుల్లో అసోంలోని 41 లక్షల మంది 'విదేశీయులు' కానున్నారు. వారి భారతీయ పౌరసత్వం అగమ్యగోచరంగా మారనున్నది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసోం ప్రభుత్వం చేపట్టిన 'జాతీయ పౌరసత్వ రిజిస్టర్' (ఎన్ఆర్సీ) కార్యక్రమం ఈ నెల 31తో ముగియనున్నది. అదే రోజు తుదిజాబితా ప్రకటించనున్నారు. అసోంలో నివసిస్తూ.. ఆ జాబితాలో పేరు లేని వారిని ఇకపై విదేశీయులుగా పరిగణిస్తారు. నిర్బంధ కేంద్రాలకు తరలిస్తారు. ఒకవేళ వారు భారతీయులే అయితే.. విదేశీ ట్రిబ్యునళ్లను ఆశ్రయించి తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవచ్చు. ఈ నేపథ్యంలో అసోంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. సున్నిత ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను విధించారు.

**ఇప్పుడు ఎందుకంటే..**

1951లో రూపొందించిన ఎన్ఆర్సీని జన గణనతోపాటే అప్‌డేట్ చేయాలని రాష్ట్రప్రభుత్వం సంకల్పించింది. కానీ అది ఆచరణలోకి రాలేదు. అప్పటి నుంచి క్రమంగా బంగ్లాదేశ్ ప్రాంతం నుంచి భారత్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. సరిహద్దులో సమస్యలు ఎక్కువైపోయాయి. దీంతో స్థానికవాదం తెరపైకి వచ్చింది. విదేశీయులను గుర్తించి తిరిగి పంపేయాలనే డిమాండ్లు మొదలయ్యాయి. అది ఉద్యమ రూపం దాల్చింది. కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో 2005లో అప్పటి అసోం రాష్ట్ర ప్రభుత్వం 1951 ఎన్ఆర్సీ రికార్డులను అప్‌డేట్ చేస్తామని ప్రకటించింది. నమోదు ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏడాది ఆగస్టు 31లోగా పూర్తిచేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసోంలోని ప్రజలందరి నుంచి వివరాలను సేకరించింది.

**నిబంధనలు ఏంటి..?**

తాజా ఎన్ఆర్సీ గణనలో 1951 నాటి రిజిస్టర్‌లో పేరు ఉన్నవారిని, 1971 మార్చి 24కు ముందు (ఇండో-పాక్ యుద్ధం మొదలవడానికి ఒకరోజు ముందు) ఓటర్ జాబితాలో నమోదైనవారిని ప్రామాణికంగా తీసుకున్నారు. వారితోపాటు అదే ఇంటిపేర్లతో ఉన్న వారి వంశస్థులను భారతీయులుగా గుర్తించాలని నిర్ణయించారు. వీరు జనన ధ్రువీకరణ పత్రం, శరణార్థుల ధ్రువీకరణ పత్రం, భూ రికార్డులు, పౌరసత్వ ధ్రువపత్రం, శాశ్వత చిరునామా పత్రం, పాస్‌పోర్ట్, లైసెన్స్, ఎల్ఐసీ పాలసీ, బ్యాంక్ పాస్‌బుక్ వంటి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

**విదేశీయుల కోసం కేంద్రాలు**

విదేశీయులుగా గుర్తించినవారిపై ఇప్పటికిప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోబోమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్నాయి. ఎన్ఆర్సీ జాబితాతోపాటు న్యాయ ప్రక్రియల అనంతరం విదేశీయులుగా గుర్తించిన వారి కోసం ప్రత్యేకంగా నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. వారు అందులో నివాసం ఉండాల్సి ఉంటుంది. ఎన్ఆర్సీ పూర్తిస్థాయిలో సిద్ధమైన తర్వాత విదేశీయులను ఏం చేయాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధారిస్తాయి.

**తప్పుల తడకగా జాబితా!**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ప్రాథమిక జాబితా తప్పుల తడకగా ఉన్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొదటి ఎన్ఆర్సీలో ఉన్నవారు, 1970కి ముందు నుంచీ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు, వారి వంశస్థుల పేర్లు జాబితాలో రాలేదని ఆరోపిస్తున్నారు.



ఎన్ఆర్సీలో నమోదు కోసం ప్రజలు సమర్పించిన పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

### ఏమిటీ ఎన్ఆర్సీ ?

భారతీయులను, విదేశీయులను వేరుచేసేందుకు చేపట్టిన కార్యక్రమమే ఎన్ఆర్సీ. స్వాతంత్ర్యం అనంతరం తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) నుంచి ప్రజలు ఈశాన్య రాష్ట్రాల్లోకి భారీగా వలసలు వచ్చేవారు. వారిని నియంత్రించడంతోపాటు అప్పటికే పాగావేసిన వారిని గుర్తించేందుకు 1950లో కేంద్ర ప్రభుత్వం 'జాతీయ పౌరసత్వ రిజిస్టర్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. సొంతంగా ఎన్నార్సీని రూపొందించుకోవాలని అసోం, మణిపూర్, త్రిపుర ప్రభుత్వాలను ఆదేశించింది. వీటిలో అసోం మాత్రమే ఎన్నార్సీని రూపొందించుకున్నది. భారత మొదటి గణతంత్ర దినోత్సవమైన 1950 జనవరి 26కు ముందు భారత్‌లో స్థిరపడినవారు, కనీసం ఐదేండ్లుగా దేశంలో నివసిస్తున్నవారు, 1950కి ముందు పుట్టినవారు, భారత్‌లో తల్లిదండ్రులు ఉన్నవారిని భారతీయులుగా నమోదుచేశారు. ఈ వివరాలతో 1951లో అసోం ప్రభుత్వం ఎన్ఆర్సీని విడుదల చేసింది. 1960 వరకు ఈ రికార్డులను డివిజన్ స్థాయి పోలీస్, రెవెన్యూ అధికారుల వద్ద అందుబాటులో ఉంచేవారు.

### పేరు లేకుంటే ట్రిబ్యునల్‌కు..

మొదటి ఎన్ఆర్సీ, 1971 నాటి ఓటర్ లిస్ట్‌లో పేరున్నవారు, వారి వంశస్థులు ధ్రువపత్రాలు సమర్పిస్తే భారతీయులుగా నమోదవుతారు. లేదంటే వారిని విదేశీయులుగా పరిగణిస్తారు. జూన్ 26న విడుదలైన ఎన్ఆర్సీ జాబితా ప్రకారం మొత్తం 3.29 కోట్ల దరఖాస్తులు రాగా 2.9 కోట్ల మందిని ఎన్ఆర్సీలో నమోదుచేశారు. మిగతా 41 లక్షల మందిని 'విదేశీయుల' క్యాటగిరీలో చేర్చారు. జాబితాలో పేరులేనంత మాత్రాన విదేశీయులు కారని, అధైర్యపడొద్దని సీఎం సర్బానంద సోనోవాల్ చెప్తున్నారు. బాధితుల సహాయార్థం 'విదేశీ ట్రిబ్యునళ్ల'ను ఏర్పాటు చేశామన్నారు. బాధితులు సరైన ధ్రువపత్రాలను తీసుకొని ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే వాటిని పరిశీలించి తీర్పునిస్తారు. అక్కడ న్యాయం దక్కకుంటే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. రాష్ట్రంలో మొత్తం వెయ్యి ట్రిబ్యునళ్లు ఏర్పాటుచేశారు.



గౌహతీలోని ఎన్ఆర్సీ ఆఫీస్ వద్ద జవాన్లు, పోలీసుల పహారా

# కశ్మీర్ ఎన్నడూ మీదికాదు



లేహ్‌లో జరిగిన కిసాన్-జవాన్-విజ్ఞాన్ మేళాలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్ సింగ్

- పీవోకే భారత్‌లో భాగమే
- దాని కోసం ఏడ్వడం ఎందుకు?
- పాక్‌ను ప్రశ్నించిన రాజ్‌నాథ్

**లేహ్, ఆగస్టు 29:** కశ్మీర్ ఎన్నడూ పాకిస్థాన్‌లో భాగంగా లేదు, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) కూడా భారత్‌లో భాగమేనని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కశ్మీర్‌పై జోక్యం చేసుకునే అధికారం పాక్‌కు ఎప్పుడూ లేదన్న ఆయన, దాని కోసం ఏడ్వడం ఎందుకని ప్రశ్నించారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం విభజించిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ తొలిసారి లఢక్‌లో పర్యటించారు. గురువారం లేహ్‌లో జరిగిన 26వ కిసాన్-జవాన్ విజ్ఞాన్ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. 'పాకిస్థాన్‌ను నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. కశ్మీర్ ఎన్నడూ మీది కాదు, ఎప్పటికీ మీది కాబోదు. అయినా దాని కోసం ఎప్పుడూ ఏడ్వడం ఎందుకు?' అని ఎద్దేవా చేశారు. దేశ విభజనతో ఏర్పడిన పాకిస్థాన్ ఉనికిని తాము గౌరవిస్తున్నామని, అయితే కశ్మీర్ అంశంతో పాక్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజనపై భారత్ తీసుకున్న నిర్ణయాలను అంతర్జాతీయం చేసేందుకు పాక్ ప్రయత్నించినా ఏ దేశం కూడా మద్దతు తెలుపలేదని గుర్తుచేశారు. అమెరికా రక్షణ మంత్రి మార్క్ ఎస్పర్ తనతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు ఆర్టికల్ 370 రద్దు భారత అంతర్గత అంశమని పేర్కొన్నారన్నారు. 'పాకిస్థాన్‌ను నేను ఒకటి అడుగదలుచుకున్నాను. కశ్మీర్ మీకు ఎలా చెందుతుంది? పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)తో సహా అది ఎప్పటికీ భారత్‌లో భాగమే' అని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పీవోకేలో జరుగుతున్న దురాగతాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పాక్ దృష్టిసారించాలని ఆయన కోరారు. ఉగ్రవాదంతో భారత్‌ను అస్థిరపరిచేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్న పాకిస్థాన్‌తో ఎలా చర్చలు జరుపాలని రాజ్‌నాథ్ ప్రశ్నించారు.

**ఇమ్రాన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం**

పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని భారత విదేశాంగ కార్యదర్శి రవీశ్ కుమార్ విమర్శించారు. ఇటీవల ఆయన రెచ్చగొట్టేలా మాట్లాడటం, జిహాద్‌తోపాటు హింసాత్మక చర్యలకు పిలుపునివ్వడాన్ని భారత్ ఖండించింది. 'భారత అంతర్గత అంశంపై పాక్ ప్రధాని ఇమ్రాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన వ్యాఖ్యలు బాధ్యతా రహితమైనవి' అని రవీశ్ కుమార్ గురువారం మీడియాతో అన్నారు. ఐరాసకు పాక్ లేఖపై స్పందిస్తూ.. 'కాగితానికి ఉన్న విలువ కూడా ఆ లేఖకు లేదు. దానిపై స్పందించి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. పాక్‌కు చెందిన కొందరు కమాండోలు భారత్‌లోకి ప్రవేశించవచ్చన్న నిఘా వర్గాల సమాచారంపై మాట్లాడుతూ.. 'వారు(పాకిస్థాన్) ఇప్పటికైనా సాధారణ పొరుగు దేశంగా ఉండేలా చర్యలు ప్రారంభించడం ఎంతో ముఖ్యం. సాధారణ పొరుగు దేశాలు పక్క దేశంలోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయవు. అన్ని అంశాలపై మాట్లాడుకుంటాయి. కలిసికట్టుగా వ్యాపారం చేసుకుంటాయి. పాకిస్థాన్ నుంచి ఇలా జరుగడం లేదు' అని రవీశ్ వ్యాఖ్యానించారు.

### మా విదేశాంగ ఎజెండాలో కశ్మీర్ అత్యున్నతాంశం

ఐరాస తీర్మానం ప్రకారమే సమస్యకు పరిష్కారం: పాక్

**ఇస్లామాబాద్, ఆగస్టు 29:** తమ విదేశాంగ విధాన ఎజెండాలో కశ్మీర్ అత్యున్నత అంశమని పాకిస్థాన్ తెలిపింది. ఐరాస తీర్మానం ప్రకారమే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొంది. గురువారం నిర్వహించిన వారాంతపు మీడియా సమావేశంలో పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి మహ్మద్ ఫైసల్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2016లో పటాన్‌కోట్ వాయుసేన కేంద్రంపై ఉగ్రదాడి అనంతరం పాక్‌తో చర్చలను భారత్ నిలిపివేసింది. ఉగ్రవాదాన్ని పాక్ ప్రోత్సహిస్తున్నంత కాలం ఆ దేశంతో చర్చలు సాధ్యంకాదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ఫైసల్ దీనిపై మాట్లాడుతూ.. ద్వైపాక్షిక చర్చలకు తమ దేశం ఎల్లవేళలా మద్దతిచ్చిందని, కానీ భారత నాయకత్వం దానికి సిద్ధంగా లేదన్నారు. జెనీవాలో జరుగనున్న ఐరాస మానవహక్కుల మండలి సమావేశానికి విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషి హాజరవుతారని, ఈ సందర్భంగా కశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతారని ఆయన చెప్పారు.

# గుజరాత్ రేవుల్లో హైఅలర్ట్

- సముద్రమార్గాన దేశంలోకి పాక్ కమాండోలు చొరబడే అవకాశమున్నట్టు నిఘావర్గాల హెచ్చరిక
- కాండ్లా, ముంద్రా రేవుల్లో భద్రత మరింత కట్టుదిట్టం



గురువారం అహ్మదాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**భువనేశ్వర్, ఆగస్టు 29:** శిక్షణ పొందిన పాకిస్థాన్ కమాండోలు సముద్రమార్గాన దేశంలోకి చొరబడే ముప్పు ఉన్నట్టు నిఘావర్గాల హెచ్చరికలతో గుజరాత్ తీరప్రాంతాల్లో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. గల్ఫ్ ఆఫ్ కచ్, సర్ క్రీక్ ప్రాంతం నుంచి పాక్ స్పెషల్ సర్వీసెస్ గ్రూప్ కమాండోలు లేదా ఉగ్రవాదులు చిన్న పడవల ద్వారా భారత భూభాగంలోకి ప్రయత్నిస్తున్నట్టు గుజరాత్ తీరప్రాంత సిబ్బందికి ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందించింది. గుజరాత్‌సహా ప్రధాన నగరాల్లో ఉగ్రదాడులు జరిపి విధ్వంసం సృష్టించాలని కుట్ర చేస్తున్నట్టు హెచ్చరికలు వచ్చాయి. భారత నౌకాదళానికి చెందిన నౌకలపై దాడులు జరిపేందుకు వీరికి శిక్షణ ఇచ్చినట్టు సమాచారం. దీంతో సరిహద్దు భద్రతా సిబ్బంది, తీరప్రాంత సిబ్బంది అప్రమత్తమయ్యారు. కచ్ జిల్లాలోని కాండ్లా, ముంద్రా రేవుల్లో భద్రతను మరింత కట్టుదిట్టంచేశారు. పాక్ కమాండోలు కచ్‌లోని హరామినాలా గుండా దేశంలోకి ప్రవేశిస్తారని నిఘావర్గాల నుంచి సమాచారం అందినట్టు పోర్టు ట్రస్ట్‌వర్గాలు తెలిపాయి. గుజరాత్ తీరంలో ఏవైనా ప్రతికూల పరిస్థితులు ఎదురైతే వాటిని నివారించేందుకు భద్రతాచర్యలు కట్టుదిట్టంచేయాలని సూచించాయి. నిత్యం అప్రమత్తంగా ఉండి, ఉగ్రవాద నివారణ చర్యలు చేపట్టాలని, దీన్‌దయాల్ పోర్టు ట్రస్ట్ (డీపీటీ) వద్ద ఉన్న అన్ని నౌకలు అత్యంత భద్రతాచర్యలు తీసుకోవాలని హెచ్చరించాయి. ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే సమీప కోస్ట్‌గార్డ్ స్టేషన్‌లో, సముద్ర సంబంధిత పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సిబ్బందికి డీపీటీ సిగ్నల్ సూపరింటెండెంట్ సూచించారు. సముద్ర మార్గం నుంచి కూడా ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని భారత నౌకాదళం హెచ్చరికలు చేసిన కొద్దిరోజులకే తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ముంద్రా రేవును అదాని గ్రూప్ నిర్వహిస్తున్నది. దేశంలోని పెద్దరేవుల్లో ఇది ఒకటి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కాండ్లా పోర్టు కొనసాగుతున్నది. పెద్దమొత్తంలో సరుకులు రవాణా అయ్యే రేవుల్లో గతేడాది ఇవి మంచిర్యాంకులు సాధించాయి. ఈ రెండు రేవులు కూడా అరేబియా సముద్రంలో గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో పాకిస్థాన్‌కు దగ్గరగా ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ శుద్ధి కర్మాగారాన్ని రిలయన్స్ నిర్వహిస్తున్నది. ఇలాంటి మరో పరిశ్రమను వడినార్‌లో రష్యా కంపెనీ రోస్‌నెఫ్ట్ కొనసాగిస్తున్నది.

## నవీ ముంబైలో నకిలీ సర్టిఫికెట్ల దందా!

- విచారణకు కమిటీని ఏర్పాటు చేయనున్న యూజీసీ

**ముంబై, ఆగస్టు 29:** మీకు ఇంజినీరింగ్ డిగ్రీ సర్టిఫికేట్ కావాలా.. అయితే రూ.75,000 చెల్లిస్తే సరిపోతుంది. న్యాయవిద్యకు సంబంధించిన పట్టా కావాలంటే రూ.2 లక్షలు చెల్లించాలి. కాలేజీకి వెళ్లాల్సిన అవసరం లేదు.. పరీక్షలు రాయనక్కరలేదు. ఇది మార్కెట్‌లో నడుస్తున్న దందా. నవీ ముంబైలో నకిలీ సర్టిఫికేట్ల దందా నడుస్తున్నదన్న సమాచారం మేరకు ఓ టీవీచానెల్ స్టింగ్ ఆపరేషన్ చేపట్టింది. ఓ కన్సల్టెన్సీకి ఏజెంట్‌గా చెప్పుకునే ఓ వ్యక్తిని టీవీ చానెల్ బృందం సంప్రదించింది. తమకు డిగ్రీ సర్టిఫికేట్ కావాలని కోరింది. దీంతో ఆ వ్యక్తి సర్టిఫికేట్ చేతికి అందడానికి 45 రోజులు పడుతుందని తెలిపాడు. యూజీసీ, ఏఐసీటీఈ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచే సర్టిఫికేట్ అందిస్తామని, వర్సిటీ రికార్డుల్లోనూ ఈ సర్టిఫికేట్ నమోదు అవుతుందన్నాడు. ఇలా వీరి మధ్య జరిగిన సంభాషణ బయటపడటంతో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ స్పందించింది. నిజనిజాలు వెల్లడవ్వడానికి ఉన్నతస్థాయి కమిటీని నియమించాలనియూ జీసీనిఆ దేశించింది.

# వడ్డనకు వేళాయె!

- లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేలు, డ్రంకెన్ డ్రైవింగ్‌కి 10 వేలు..
- అంబులెన్స్‌కు దారివ్వకపోయినా జరిమానా చెల్లించాల్సిందే
- మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే 25 ఏండ్లు నిండే వరకు నో లైసెన్స్
- రవాణాచట్టంలో భారీ మార్పులు, జరిమానాలు
- ఈ ఆదివారం నుంచే అమలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల భద్రత, అవినీతిని అరికట్టడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల(సవరణ) బిల్లు - 2019 ఈ ఆదివారం నుంచి అమల్లోకి రానున్నది. ఈ బిల్లును మూజువాణి ఓటుతో జులై 23వ తేదీన లోక్‌సభ, జూలై 31న రాజ్యసభ ఆమోదించడం తెలిసిందే. దీంతో ట్రాఫిక్ నిబంధనలు సెప్టెంబర్ 1 నుంచి మరింత కట్టుదిట్టం కానున్నాయి. జరిమానాలు, శిక్షలు పెరుగనున్నాయి. మనుషుల ప్రాణాలు కాపాడటమే ఏకైక లక్ష్యంగా 30 ఏండ్ల క్రితంనాటి మోటారు వాహనాల చట్టం 1989లో సవరణలు చేసి మోటారు వాహనాల(సవరణ) బిల్లు - 2019ను రూపొందించారు. ఈ బిల్లు ఆమోదంతో గతంలో ఉన్న జరిమానాలు అన్ని భారీగా పెరిగిపోయాయి. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడుపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నది. వాహనాలు నడిపిన మైనర్లతోపాటు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేసింది. వాహన తయారీ సంస్థలపై కూడా ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రమాణాలను పాటించని వాహన తయారీదారులకు రూ.100 కోట్లతో పాటు ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష విధించే విధంగా బిల్లులో సవరణలు చేసింది. డ్రైవింగ్ లైసెన్సుల నిబంధనలను ఉల్లంఘించే అగ్రిగేటర్స్ (టాక్సీ, ఆటోల వేదికలు)లకు రూ. లక్ష వరకూ జరిమానా విధించనున్నారు.

| ఉల్లంఘన | ప్రస్తుత జరిమానా రూ.ల్లో / శిక్ష | పెరిగిన జరిమానా రూ.ల్లో / శిక్ష |
|---|---|---|
| మైనర్లు వాహనం నడిపితే | లేదు | సంరక్షకుడు లేదా వాహన యజమానికి రూ.25 వేల జరిమానాతో పాటు మూడేండ్ల జైలుశిక్ష. వాహన రిజిస్ట్రేషన్ రద్దు. 25 ఏండ్లు నిండేవరకు లైసెన్సు నిరాకరణ |
| సాధారణ ఉల్లంఘన | 100 | 500 |
| టికెట్ లేకుండా ప్రయాణిస్తే | 200 | 500 |
| అధికారుల ఆదేశాలు పాటించకపోతే | 500 | 2,000 |
| లైసెన్సు లేకుండా వాహనం నడిపితే | 500 | 5,000 |
| అతివేగం | 400 | (ఎల్ఎంవీ)1,000 (మీడియం ప్యాసింజర్)2,000 |
| ప్రమాదకర డ్రైవింగ్ | 1,000 | 5,000 |
| డ్రంకెన్ డ్రైవింగ్ | 2,000 | 10,000 |
| సీటు బెల్టు పెట్టుకోకుంటే.. | 100 | 1000 |
| హెల్మెట్ లేకుంటే.. | 100 | 1000/ మూడుసార్లు దొరికితే లైసెన్సు రద్దు |
| ఇన్సూరెన్స్ లేకుంటే.. | 1000 | 2,000 |
| అంబులెన్స్, ఫైర్ సర్వీస్‌కు దారి ఇవ్వకుంటే.. | లేదు | 10,000 |
| రేసింగ్ | 500 | 5,000 |
| బైక్‌పై పరిమితికి మించి ప్రయాణిస్తే | 100 | 2,000/ మూడునెలలు లైసెన్స్ రద్దు |
| ఓవర్‌లోడింగ్ | 2,000 అదనపు టన్నుకు వెయ్యి | 20,000 అదనపు టన్నుకు 2,000 |

## చిదంబరం పిటిషన్లపై 5న తీర్పు

- సుప్రీంకోర్టు వెల్లడి
- వచ్చే గురువారం వరకు అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ
- చిదంబరం అరెస్ట్ శుభవార్తన్న ఇంద్రాణి ముఖర్జీ

**న్యూఢిల్లీ/ ముంబై:** ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదుచేసిన కేసును సవాల్ చేస్తూ కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌పై సెప్టెంబర్ ఐదో తేదీన తీర్పు వెలువరిస్తామని సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. వచ్చే గురువారం వరకు ఆయన్ను ఈడీ అరెస్ట్ చేయకుండా తాత్కాలిక రక్షణ కల్పిస్తూ జస్టిస్‌లు ఆర్ భానుమతి, ఏఎస్ బొపన్నలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. తాను సోమవారం వరకు సీబీఐ కస్టడీలోనే ఉంటానని చిదంబరం కోర్టుకు నివేదించారు. ఆయనకు రిమాండ్ పొడిగించే విషయాన్ని సీబీఐ కోర్టు నిర్ణయిస్తుందని ఈడీ తరపున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొనడంతో చిదంబరం ప్రతిపాదనపై స్పందించేందుకు ధర్మాసనం తిరస్కరించిం ది. ఈ కేసులో ఏదైనా సమాచారం ఇవ్వదలుచుకుంటే సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఈడీని ఆదేశించింది. అంతకుముందు తుషా ర్ మెహతా వాదిస్తూ సమాజానికి, దేశానికి వ్యతిరేకంగా మనీ లాండరింగ్ జరిగిందని, కుట్రను వెలికితీసేందుకు చిదంబరాన్ని ఈడీ కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నద న్నారు. తప్పించుకునేందుకు ఆయన 'బాధితుడి'ననే నాటకం ఆడుతున్నారని చెప్పారు.

**చిదంబరం అరెస్ట్ సంతోషకరం: ఇంద్రాణి**



ఐఎన్ఎక్స్ కేసులో చిదంబరం అరెస్ట్ కావడం శుభవార్త అని, తనకు సంతోషంగా ఉన్నదని ఈ కేసులో సహ నిందితురాలు, షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలు ఇంద్రాణి ముఖర్జీ పేర్కొన్నారు. ఆయనపై అన్నివైపుల నుంచి దాడి జరుగుతున్నదన్నారు. షీనాబోరా కేసులో కోర్టు విచారణకు హాజరైన ఇంద్రాణి.. మీడియాతో మాట్లాడుతూ చిదంబరం కొడుకు కార్తీకి ఇచ్చిన బెయిల్ కూడా రద్దు చేయాలన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆమె అప్రూవర్‌గా మారి, ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే చిదంబరంపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

# లే అవుట్లకు పాస్‌పుస్తకం

## ప్లాట్లను మళ్లీ వ్యవసాయ భూమిగా మార్చిన అధికారులు

- పదిహేడేండ్ల తర్వాత కబ్జాదారుడి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకం జారీ
- వరంగల్‌లో ఓ తాసిల్దార్ నిర్వాకం
- ఆందోళనలో ప్లాట్లు కొనుగోలుచేసిన ఉద్యోగులు


అధికారులు పాస్‌పుస్తకం జారీచేసిన భూమి, (ఇన్‌సెట్)1992లో కుడా లేఅవుట్ చేసిన మ్యాప్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం (పూర్వం హన్మకొండ మండలం) మడికొండ శివారులో తౌటిరెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆయన వారసులు టీ గోపాలరెడ్డి, పీ విజయలక్ష్మి, భార్య సౌందర్యదేవికి సర్వే నంబర్లు 1054, 1060, 1061, 1062లలో 14.36 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకొని యూనివర్సల్ ఎంప్లాయీస్ కాలనీ, విశాల్ ఎంప్లాయీస్ కాలనీగా 1992లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ద్వారా రెండు విడుతలుగా లే అవుట్ (నంబర్ 25/92, 36/92) చేసి ప్లాట్లను విక్రయించారు. 1953-54 ఖాస్రా పహాణీ సహా రెవెన్యూ రికార్డులన్నింటినీ పరిశీలించాక అప్పటి ఉద్యోగులు కొంతమంది ఈ లే అవుట్లలో ప్లాట్లను కొన్నారు. 1954 నుంచి 2009 వరకు అన్ని రెవెన్యూ రికార్డుల్లో తౌటిరెడ్డి పురుషోత్తంరెడ్డి, వారసుల పేరిటే రికార్డులు స్పష్టంగా ఉన్నాయి. కానీ, 2009లో శాయంపేట శ్రీనివాస్ అలియాస్ పస్కుల శ్రీనివాస్ సర్వే నంబర్ 1060లోని 2.11 ఎకరాల భూమి తనదేనంటూ ఒక్కసారిగా తెరమీదకొచ్చారు. సాదాబైనామా కింద తాను కొనుగోలుచేశానంటూ పట్టాదారు పాస్‌పుస్తకం చూపిస్తూ.. ఉద్యోగులే తమ భూమిని కబ్జాచేశారంటూ ప్లాట్ల హద్దురాళ్లను దౌర్జన్యంగా తొలగించారు. ఉద్యోగులు (ఇప్పుడు దాదాపు అందరూ రిటైర్ అయ్యారు) మాత్రం అన్నీ సక్రమంగా ఉన్న తర్వాతే కుడా.. లే అవుట్‌కు అనుమతిచ్చిందని, వాటినే తాము కొన్నామని.. ఉన్నట్టుండి లే అవుట్ ప్లాట్లకు పట్టాదారు పాస్‌పుస్తకం ఎలా జారీఅయ్యిందో తెలియడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ భూమి.. వ్యవసాయేతర భూమిగా మారి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థతో అధికారికంగా లే అవుట్ అయిన ప్లాట్లు తిరిగి వ్యవసాయ భూమిగా ఎలా మారిందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల కింద కుడా లేఅవుట్ అయిన స్థలాన్ని వ్యవసాయ భూమిగా మార్చి పట్టాదారు పాస్‌పుస్తకం జారీ కావడంపై సమగ్ర విచారణ జరిపించాలని రిటైర్డ్ ఉద్యోగులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు.

**అసలు కథ ఇక్కడే**

తౌటిరెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆయన వారసులకు చెందిన సర్వే నంబర్లు 1054, 1060, 1061, 1062 లలోని మొత్తం భూమిని 1992 లోనే యూనివర్సల్ ఎంప్లాయీస్ కాలనీ, విశాల్‌హౌసింగ్ కాలనీగా కుడా (డెవలప్‌మెంట్ ప్లాన్ 36/1992 ఇన్‌ఫైల్ సీ1/987/91 తేదీ 13-10-92, డీపీ 25/1992 ఫైల్ నంబర్ సీ1/788/91 తేదీ 9-11-91 ) ద్వారా ప్లాట్లుచేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆ ప్లాట్లు అన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఈ స్థితిని గమనించిన శాయంపేట శ్రీనివాస్ సర్వే నంబర్ 1060లోని 2.11 ఎకరాల భూమి తనదేనంటూ పట్టాదారు పాస్‌పుస్తకం చూపుతూ రంగంలోకి దిగారు. తౌటిరెడ్డి పురుషోత్తంరెడ్డి తండ్రి తౌటిరెడ్డి రాంచంద్రారెడ్డి వద్ద తన తండ్రి శాయంపేట రామస్వామి 1960లో కొన్నట్టు సాదాబైనామా సృష్టించాడని రిటైర్డ్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. రామస్వామి 1960లోనే భూమిని కొనుగోలు చేస్తే.. దాదాపు నలభై ఏండ్లకుపైగా ఎందుకు పట్టించుకోలేదని, పురుషోత్తంరెడ్డి లే అవుట్లు చేస్తుంటే తనకు పట్టనట్టు ఎందుకు ఊరుకొన్నారని ప్రశ్నిస్తున్నారు. ప్లాట్లు చేశాక కూడా పదిహేడేండ్ల తర్వాత పట్టాదారు పాస్‌పుస్తకం ఎలా వచ్చిందని నిలదీస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో 1953-1954 ఖాస్రా మొదలుకొని ఆ తదుపరి కూడా తౌటిరెడ్డి పురుషోత్తంరెడ్డి వారసులు మాత్రమే పట్టాదారుగా ఉన్నారని, ఆయన వారసులు 2005 వరకూ కాస్తుదారుడిగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నారని చెప్తున్నారు. సాదాబైనామాతో ఎలాంటి వెరిఫికేషన్ చేయకుండానే అప్పటి హన్మకొండ తాసిల్దార్ పట్టాదారు పాస్‌పుస్తకాన్ని జారీచేశారు. వ్యవసాయేతర భూమికి వ్యవసాయ భూమిగా పాస్‌పుస్తకాన్ని ఎలా జారీచేశారని 2011లో అక్కడ ప్లాట్లు కొన్న కొంతమంది ఉద్యోగులు సమాచార హక్కుచట్టం కింద దరఖాస్తు చేసుకుంటే.. తమవద్ద ఉన్న రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 1060లోని భూమికి శాయంపేట శ్రీనివాస్‌కు ఎటువంటి ఆర్వోఆర్ పట్టా జారీచేయలేదని పేర్కొనడం గమనార్హం. కాగా, ఎస్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి తప్పుడు పాస్‌పుస్తకం పొంది ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, తమకు న్యాయంచేయాలని బాధితులు విజ్ఞప్తిచేస్తున్నారు.

## భూకబ్జాపై దంపతుల ఆత్మహత్యాయత్నం

- మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఘటన


ఆత్మహత్యకు యత్నించిన బాపు, లక్ష్మి

**మంచిర్యాల రూరల్:** తమ వ్యవసాయ భూమిని కబ్జా చేశారని, న్యాయంచేయాలని కోరుతూ దంపతులు పురుగులమందు తాగేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్న ఘటన గురువారం మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట చోటుచేసుకున్నది. బాధితుడు గోపతి బాపు, లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం శివారులోని సర్వే నంబర్ 194/34, 134/35లలో ఎనిమిది ఎకరాల భూమిని 20 ఏండ్ల కింద ఈదులపల్లి సత్యవతి, అరుంధతి వద్ద లావుణీ పట్టాను గోపతి బాపు కొనుగోలు చేశారు. 15 ఏండ్లుగా భూమిని సాగుచేసుకొంటూనే గట్టుపై దాదాపు 200 టేకు చెట్లను నాటారు. గతేడాది భూరికార్డుల ప్రక్షాళనలో రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఇచ్చింది. ఆ తర్వాత తమ పేరును ఆన్‌లైన్ నుంచి తొలగించారని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై సంబంధిత జైపూర్ తాసిల్దార్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. అధికారులను ఎప్పుడు కలిసినా రేపు, మాపు అంటూ తిప్పించుకొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి తోడు కొద్ది రోజుల కింద సందీప్‌రావు అనే వ్యక్తి గట్టున ఉన్న చెట్లను నరికివేసి భూమిని కబ్జా చేశాడని, న్యాయం చేయాలని ఇటీవల రామగుండం పోలీస్ కమిషనర్‌కు, జైపూర్ ఏసీపీ కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. రెవెన్యూ అధికారులతో సందీప్‌రావు కుమ్మక్కై ఆన్‌లైన్‌లో తన పేరు లేకుండాచేశారని, న్యాయంచేయాలని వేడుకొన్నారు. పురుగులమందు తాగేందుకు యత్నించిన దంపతులను పోలీసులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## నిలదీసిన మహిళను తోసేసిన వీఆర్వో

- స్పృహ తప్పడంతో దవాఖానకు తీసుకెళ్లిన డిప్యూటీ తాసిల్దార్
- సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి తాసిల్ కార్యాలయం ఆవరణలో ఘటన


వీఆర్వోను నిలదీస్తున్న బాధితురాలు పోచమ్మ, తోసేయడంతో స్పృహతప్పి పడిపోయిన మహిళ

పోచమ్మను 108లో దవాఖానకు తరలిస్తున్న డిప్యూటీ తాసిల్దార్ అశోక్

**వట్‌పల్లి:** ఏడాదిగా తిరుగుతున్నా భూసమస్యను పరిష్కరించడంలేదంటూ ఓ మహిళ వీఆర్వో కాలర్ పట్టి లాగగా, ఆగ్రహించిన వీఆర్వో ఆమెను తోసేయడంతో స్పృహతప్పి పడిపోయారు. డిప్యూటీ తాసిల్దార్ ఆమెను దవాఖానకు తరలించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి తాసిల్ కార్యాలయంలో గురువారం జరిగింది. మండలంలోని మేడుకుంద గ్రామానికి చెందిన ఖాదీరాబాద్ బీరు గొండకు సర్వే నంబర్లు 210, 11లో 2.34 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. బీరు గొండ చనిపోవడంతో భూరికార్డుల ప్రక్షాళన సమయంలో మొదటి భార్య ఇద్దరు కుమారులతోపాటు రెండో భార్య పోచమ్మ కుమారుడి పేరిట భూమిని అధికారులు పట్టాచేశారు. ఈ విషయం బతికున్న పోచమ్మకు తెలియకుండానే జరిగిపోయింది. విషయం తెలుసుకొన్న ఆమె తనకు న్యాయంచేయాలని అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఏడాదిగా వీఆర్వో రామలింగంను కలుస్తున్నా ఆయన రేపు మాపు అంటూ కాలంవెల్లదీస్తున్నారు. గురువారం సైతం తాసిల్‌కు వచ్చిన పోచమ్మ భూసమస్యపై వీఆర్వోను నిలదీశారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో బాధితురాలు అతడి కాలర్ పట్టుకొని బయటనుంచి తాసిల్ వరకు లాక్కొచ్చారు. కోపోద్రిక్తుడైన వీఆర్వో ఆమెను తోసివేయగా మెట్లపైనుంచి కిందపడి స్పృహ కోల్పోయారు. స్పందించిన డిప్యూటీ తాసిల్దార్ అశోక్ 108 వాహనంలో మహిళను దవాఖానకు తీసుకెళ్లి చికిత్సచేయించి ఇంటికి పంపించారు. ఈ విషయమై వీఆర్వో మాట్లాడుతూ.. విడిపించుకొనే ప్రయత్నంలోనే ఆమె కిందపడిపోయారని, తోసేయలేదని చెప్పారు.

## పాస్‌పుస్తకం ఇస్తలేరు


బాధితుడు సురేశ్

**రెంజల్:** నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన బేగారి లక్ష్మి, పెంటయ్య దంపతులకు ఎస్సీ కార్పొరేషన్ 2000లో ఎకరం ఎన్‌ఎస్‌ఎఫ్ భూమిని కేటాయించింది. పెంటయ్య, లక్ష్మి 2010లో చనిపోయారు. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. లక్ష్మి పేరిట ఉన్న సర్వే నంబర్లు 1234/4లో 4 గుంటలు, 1236/పీలోని 36 గుంటల భూమిని 2015లో ఇద్దరు కుమారులు నరేశ్, సురేశ్ పేరిట అధికారులు పట్టాచేశారు. నరేశ్, సురేశ్ ఉంటున్న ఇల్లు కూలిపోవడంతో గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నారు. నిరుడు నరేశ్ పేరిట రైతుబీమా పత్రాన్ని కూడా అందజేశారు. అందులో నామినీగా సురేశ్ పేరును నమోదుచేశారు. కానీ కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేయలేదు. దీనికోసం ఏడాదిన్నరగా తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని బాధితుడు సురేశ్ వాపోయారు. తాసిల్దార్ అసదుల్లాఖాన్‌ను వివరణ కోరగా.. న్యాయంచేస్తామని చెప్పారు.

## భూమిని పట్టా చేయండి సారూ..

- నాగర్‌కర్నూల్ జిల్లా బ్రాహ్మణపల్లి బాధితుల వేడుకోలు


బాధిత రైతులు లాల్య, సంగ్య

**అచ్చంపేట రూరల్:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎడ్ల లింగయ్య.. సర్వే నంబర్ 42లో ఉన్న తన రెండెకరాల భూమిని 1982లో గ్రామానికే చెందిన కాట్రావత్ లాల్య, ముడావత్ సంగ్యకు చెరో ఎకరం రూ.700 చొప్పున సాదాబైనామా ద్వారా విక్రయించారు. భూమిని కొన్న రైతులు సాదాబైనామా కింద తమకు పట్టాచేయాలని 2016 డిసెంబర్ 14న దరఖాస్తు చేసుకొన్నారు. వీఆర్వో పంచనామా నిర్వహించి సాగులో లాల్య, సంగ్య ఉన్నట్టు ధ్రువీకరించారు. గ్రామస్థులు కూడా ఇదే విషయాన్ని నిర్ధారించారు. కానీ ఎడ్ల లింగయ్య వారసులు అభ్యంతరం పెట్టడంతో రెవెన్యూ అధికారులు వీరికి పట్టాచేయకుండా పెండింగ్‌లో ఉంచారు. గత ఏడాది వానకాలంలో వీరు కంది పంట సాగుచేయగా.. ఎడ్ల లింగయ్య భార్య లింగమ్మ, కుమారులు భూమి మీదకు వెళ్లి పంటను ధ్వంసంచేశారు. బాధిత రైతుల ఫిర్యాదుతో.. సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు ఆ భూమిని పడావు ఉంచారు. ఇరువర్గాలు కోర్టుకు వెళ్లడంతో రెవెన్యూ అధికారులు భూమిని పట్టాచేయకుండా పెండింగ్‌లో ఉంచారు. ఇప్పటికైనా తమకు భూమిని పట్టాచేసి న్యాయంచేయాలని బాధిత రైతులు లాల్య, సంగ్య విజ్ఞప్తిచేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీదే విజయం

మొదటిపేజీ తరువాయి...

చూపించేందుకు కొన్ని వార్తాపత్రికలు, చానళ్లు, ఒకవర్గం సోషల్‌మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను పార్టీలో చేరిననాటినుంచి నేటివరకు గులాబీ సైనికుడినే అని.. మా నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆరేనని స్పష్టంచేశారు. ఇటీవలికాలంలో కొన్ని వార్తాపత్రికలు, సోషల్‌మీడియాలో టీఆర్‌ఎస్ అంటే గిట్టనివాళ్లు, తన ఎదుగుదలను ఓర్వలేనివాళ్లు తప్పుడు ప్రచా రం చేస్తున్నారని మండిపడ్డారు. తన చరిత్ర తె లుసుకోవాలని హితవుపలికారు. ఈ సందర్భంగా ఈటల ఏమన్నారో ఆయన మాటల్లోనే..

### సీఎం చెప్తేనే కమలాపూర్‌కు వెళ్లా

'గజ్వేల్‌లో ఆనాటి ఉద్యమనాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాను నేను. గజ్వేల్‌లో ఏముంది.. ఇది రిజర్వుడు నియోజకవర్గం. ఇంత డబ్బు కథ ఖార్ఛనా పెట్టుకొని నువ్వు పోరాదు అటు మొఖాన.. అని కమలాపూర్‌కు వెళ్లమని అన్నరు. 'నేను కమలాపూర్‌లో పరిచయం లేను. నేను ఈటల మల్లన్న కొడుకుగా లేదా ఈటల సమ్మన్న తమ్ముడిగా లేదా ఈటల భద్రయ్య అన్నగా చెప్పుకోవాలి తప్ప.. నాకు ఇక్కడ చరిత్రలేదు సర్' అని నేను కేసీఆర్‌గారికి ఆనాడు చెప్పిన. 'అట్లకాదు నువ్వు పో.. నీకు పక్కా మంచిగుంటది' అని చెప్తే.. అప్పుడు కమలాపూర్‌ల అడుగుపెట్టిన. అడుగు పెట్టంగనే 20 మంది ఉండే. అరేయ్ మొత్తం పైసల సంచితో వస్తున్నడు.. కోట్లకుకోట్లు ఉన్నయ్ ఈటల రాజేందర్‌కు అన్నరు.. కోట్ల రూపాయలు ఇచ్చి టికెట్ తెచ్చుకుంటడు ఈ పిల్లగాడు అన్నరు. కానీ అలాకాదు. నా ముఖంల నిజాయితీ చూడాలిగాని. నేను ఎప్పుడూ నవ్వుకునేది. ఆనాడు కమలాపూర్ ఎమ్మెల్యేగా నేను పోటీ చేసినప్పుడు, నా ఆస్తి అంతస్తులు ప్రకటించినపుడు.. గీ పిల్లగాడికి గింత ఉన్నదా! అని అన్నరు. తప్పుడు ప్రచారం చేశారు. అక్రమ ఆస్తి అన్నరు. వార్తలు రాశారు. అప్పుడే నేను భయపడలేదు. చిల్లరగాళ్లు ఉంటరు. నామీద అలాంటి వార్తలు రాయకుండా, చిల్లర ప్రచారం చేయకుండా వాడు బతుకలేడు కాబట్టే.. వాడు అట్లనే సావాలె తప్ప ప్రత్యామ్నాయం లేదు. చాలామందికి హుజూరాబాద్ తెలియదు. నాది కమలాపూర్ అనే తెలుసు. నేను గెలువగలిగే సత్తా ఉన్నోడిని, అమ్ముడుపోకుండా ఉన్నోడిని నా భుజాల మీదమోసే ప్రయత్నం చేస్త. నేను మాట్లాడితే గంటలు మాట్లాడుత. కానీ నాకు కూడా బాధ ఉన్నది. తప్పకుండా నా నోటి నుంచే కాదు.. ఏనాడో ఒకనాడు బయటికి వస్తయ్. ఎవడుద్రోహో.. ఎవడు హీరోనో తెలిసే రోజులు తప్పకుండా వస్తయనే ఆశతో బతికేవాడిని. ఈటల రాజేందర్ అనేటోడు ఎప్పుడూ వెలిగే దీపమే తప్ప.. తెలంగాణ గడ్డ మీద ఆత్మగౌరవంతో బతికేవాడే తప్ప.. ఈ చిల్లరమల్లర వార్తలతోటి భయపడే ప్రసక్తే లేదని తెలియజేస్తున్న. ఈరోజు టీఆర్‌ఎస్‌లో చేరిన మీ అందరికీ శుభాకాంక్షలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నా.


హుజూరాబాద్‌లో గురువారం టీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

### వక్రీకరణ వార్తలు నమ్మకండి..

సీఎం కేసీఆరే తమ నాయకుడని, తాను గులాబీ సైనికుడినని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తన ప్రసంగాన్ని కొన్ని మీడియా చానళ్లతోపాటు సోషల్‌మీడియాలో వక్రీకరించారని, ఇది సరికాదని అన్నారు. కొన్ని టీవీ చానళ్లలో, సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై గురువారం సాయంత్రం మంత్రి ఈటల స్పందించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది ముమ్మాటికి గులాబీ జెండానే అని పునరుద్ఘాటించారు. తనపై చిల్లర వార్తలు రాయవద్దని పత్రికలకు హితవు చెప్పారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమయ్యే నాటికి తాను పది లక్షల కోళ్లఫారానికి యజమానినని అన్నారు. కమలాపూర్ (ప్రస్తుత హుజురాబాద్) నియోజకవర్గానికి తనను పింపించి, ఇక్కడ పోటీ చేయించి, గెలిపించింది తమ నాయకుడు కేసీఆరేనని, ఇదే విషయాన్ని కూడా తాను సభలో చెప్పానని తెలిపారు. తానో గులాబీ సైనికుడినని చెప్పానన్నారు. రాజకీయాల్లో సంపాదించుకోవడానికి రాలేదని, నేను పార్టీలో, ఉద్యమంలో చేరేనాటికే పారిశ్రామికవేత్తనని చెప్పానని తెలిపారు. ఓ పార్టీ నాయకుడు ఇటీవల ఒక పత్రికలో వచ్చిన కథనంపై స్పందించాలని వేదికపై కోరడంతో ఆ పత్రికపై తానుచేసిన వ్యాఖ్యలను పట్టుకుని రంధ్రాన్వేషణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్‌లో మోసాలకు అవకాశం లేదని, అలాంటివారికి స్థానం లేదని చెప్పానని అన్నారు. పార్టీకి ద్రోహం చేయవద్దని చెప్పానని తెలిపారు. ఆనాడు పార్టీ మారాలని వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనేకరకాలుగా ఒత్తిడి తెచ్చినా లొంగని వ్యక్తినని చెప్పారు. తెలంగాణ ఉద్యమం పుణ్యానే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని అన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్రం సాధించుకున్నామని, ఆయన ఆధ్వర్యంలోనే బంగారు తెలంగాణ నిర్మించుకుంటున్నామని పేర్కొన్నారు. నిరాధారమైన వార్తలను మీడియా ప్రసారం చేయడం ఆపాలని, సోషల్ మీడియా సంయమనంతో ఉండాలని ఆయన హితవుపలికారు.

## డీపీఆర్ లేకుండా అనుమతులెలా వస్తాయి?

హోదా అడుగలేదనడం జీవన్‌రెడ్డి అజ్ఞానానికి నిదర్శనం

టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఫైర్



గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించలేదని కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డి అబద్ధమాడుతున్నారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. డీపీఆర్ లేకుండా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు ఎలా వస్తాయో మంత్రిగా పనిచేసిన జీవన్‌రెడ్డికి తెలియదా? అని నిలదీశారు. డీపీఆర్ లేకుండా ప్రాజెక్టుకు ఆర్థిక సంస్థలు, బ్యాంకులు రుణాలెలా ఇస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌పై జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం తెలంగాణభవన్‌లో కర్నె ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయితే ఆ ఘనత కేసీఆర్‌కు దక్కుతుందనే దుర్బుద్ధితో, తెలంగాణ అంతా పచ్చగామారితే తమ కాళ్లకిందికి నీళ్లొస్తాయనే అసూయతో కాంగ్రెస్ నేతలు కాళేశ్వరంపై చెప్పిన అబద్ధాలనే మళ్లీ చెప్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంపై వినోద్‌కుమార్ నిజాలు చెప్తే జీవన్‌రెడ్డి ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ హోదా అడుగలేదని జీవన్‌రెడ్డి అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ హోదా ఇవ్వాలని ఎన్నోసార్లు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోరామని చెప్పారు. జాతీయ హోదాకోసం 2018 డిసెంబర్ 26న ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసి వినతి పత్రం ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. రైతులకు నీళ్లు అందించాలనే కేసీఆర్ లక్ష్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని ఎంత ప్రయత్నించినా కాంగ్రెస్ నేతలు సఫలంకాలేరని ఆయన స్పష్టంచేశారు. కాంగ్రెస్ నేతల మాటలను ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద అందుబాటులో ఉన్న జలాలను తెలంగాణ బీడు భూములకు ఎలా మళ్లించాలో కేసీఆర్‌కు తెలుసునని పేర్కొన్నారు.

# ప్రభుత్వం ప్రజల పక్షం.. మాది ప్రభుత్వ పక్షం

ఉజ్వల ప్రస్థానం, బంగారుబాట పుస్తకాల ఆవిష్కరణ సభలో మేధావులు


సీఎం పీఆర్వో, రచయిత గటిక విజయ్‌కుమార్ రాసిన 'ఉజ్వల ప్రస్థానం', 'బంగారుబాట' పుస్తకాలను గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న రాజీవ్‌శర్మ, ప్రభాకర్‌రావు, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, అయాచితం శ్రీధర్, దేశపతి శ్రీనివాస్, దేవీప్రసాద్, జూలూరు గౌరీశంకర్, 'నమస్తే తెలంగాణ' ఎడిటర్ కట్టాశేఖర్‌రెడ్డి, మామిడి హరికృష్ణ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ప్రభుత్వం ప్రజల పక్షం ఉన్నంతకాలం ప్రభుత్వ పక్షానే ఉంటాం. సీఎం కేసీఆర్ అందరి దారిలో నడువలేదు. తెలంగాణ దేనికోసం పోరాడిందో ఆ ఎజెండాను అమలుచేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తిచేశారు. టీఎస్‌పీఎస్సీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చింది. నిరంతర విద్యుత్ సరఫరా అవుతున్నది. ప్రతిపక్షాలు రాజకీయాలు మాట్లాడొచ్చు. కానీ సంస్థల గురించి మాట్లాడటం సరికాదు. ఏమీ జరుగడం లేదని మాట్లాడకూడదు. రాష్ట్రంలో నిప్పు లేకుండానే పొగరాజేసే పరిస్థితి కనిపిస్తున్నది. పొగ ఎక్కువకాలం ఉండదు. పొగలు తొలిగిపోతాయి. పట్టించుకోవాల్సిన అవసరం లేదు'అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహాల్‌లో తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి ఉద్యమాలు, స్వరాష్ట్రంలో పరిపాలనా విధానంతోపాటు ఇతర ముఖ్య పరిణామాలపై సీఎం పీఆర్వో, రచయిత గటిక విజయ్‌కుమార్ రాసిన గ్రంథం 'ఉజ్వల ప్రస్థానం', 'బంగారు బాట' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు మేధావులు మాట్లాడారు. రానున్న తరాలకు ఈ పుస్తకం రెఫరెన్స్ గైడ్‌లా ఉపయోగపడుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అన్నారు. ప్రత్యేక రాష్ట్ర పాలనను పుస్తక రూపంలో సామాన్యులకు అందుబాటులో తెచ్చారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తూ శాంతియుత వాతావరణం కల్పించేలా పోలీస్ వ్యవస్థ అహర్నిషలు పనిచేస్తున్నదని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. విద్యుత్ వెలుగుల వెనుక ఈ శాఖ ఉద్యోగుల శ్రమ ఉంటే.. దానిని వెలుగులోకి తీసుకువచ్చింది విజయ్‌కుమారేనని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అన్నారు.

**గన్నుల ప్రమేయం లేకుండా పనిచేస్తున్నాం**

తెలంగాణ వచ్చాక గన్నుల ప్రమేయం లేకుండా పనిచేస్తున్నామని ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం వచ్చాక మేధావులు మౌనంగా లేరని.. కొందరు పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ గట్టి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో మేధావులు రాజకీయ నాయకుల్లా ఆలోచిస్తుంటే రాజకీయ నాయకులు మేధావుల్లా ఆలోచిస్తున్నారని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల పక్షం ఉన్నంతకాలం.. ప్రభుత్వపక్షంలో ఉంటామన్నారు. విజయ్ ఉద్యమకాలంలో యాక్టివ్ జర్నలిస్టుగా ఉన్నారని, ప్రజలు ఏమి కోరుకున్నారో దానికోసం క్రియాశీలక పాత్ర పో షించారని 'నమస్తే తెలంగాణ'ఎడిటర్ కట్టాశేఖర్‌రెడ్డి అన్నారు. సీఎం సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు, గ్రంథాలయ పరిషత్‌చైర్మన్ శ్రీధర్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, సీఎం ఓఎస్డీ దేశపతి, బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్,బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, నటుడు ఆర్ నారాయణమూర్తి, కవి జయరాజ్ హాజరైన సభకు సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# రాష్ట్రానికి 3,110 కోట్ల కంపా నిధులు

మొదటిపేజీ తరువాయి...

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పెద్ద మొత్తంలో కంపా నిధులు విడుదలయ్యాయని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రత్యామ్నాయ అడవుల సృష్టికి సీఎం కేసీఆర్ సారథ్యంలోని తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికి కంపా నిధులను సమర్థంగా ఉపయోగించడంతోనే కేంద్రం ఈసారి భారీగా నిధులు విడుదలచేసిందని చెప్పారు. వివిధ ప్రాజెక్టుల కింద తీసుకున్న అటవీభూమికి ప్రత్యామ్నాయంగా అడవుల పెంపకానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కంపా నిధులను రాష్ట్రంలో అడవుల పెంపకానికి ఉపయోగిస్తామని స్పష్టంచేశారు.

### 113 కోట్ల మొక్కలు నాటాం

తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 230 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, నాలుగు విడుతల్లో 113.58 కోట్ల మొక్కలు నాటామని మంత్రి వివరించారు. ఐదోవిడుతలో ఈ ఏడాది 83 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యం ఉన్నదని, ఇప్పటివరకు 30 కోట్ల మొక్కలు నాటామని తెలిపారు. సీఎం కేసీఆర్ కొత్తగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల్లో కూడా మొక్కల సంరక్షణకు పెద్దపీట వేశారని తెలిపారు. నాటినవాటిలో 85% మొక్కలను కాపాడేలా చర్యలు చేపట్టారన్నారు. ప్రస్తుతం ఉన్న అడవులను రానున్న నాలుగేండ్లలో రెట్టింపుచేసే లక్ష్యంగా పథకాలు సాగాలని కేంద్రం నిర్వహించిన సమావేశంలో చర్చ జరిగిందని తెలిపారు. హరితహారం కార్యక్రమానికి నిధులు కేటాయించాలని కోరామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రం నుంచి మంత్రితోపాటు అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ శోభ పాల్గొన్నారు.



తెలంగాణ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి గురువారం ఢిల్లీలో కంపా నిధుల మంజూరుపత్రాన్ని అందజేస్తున్న కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్. చిత్రంలో రాజేశ్వర్ తివారి, శోభ ఉన్నారు.



తెలంగాణలోనే అత్యంత భారీ వినాయకుడిగా ప్రసిద్ధిగాంచిన ఖైరతాబాద్ గణేశుడికి భారీ చేనేత శాలువా సిద్ధమైంది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో 4 ఫీట్ల వెడల్పు, 86 ఫీట్ల పొడవు కాషాయపు వర్ణంలో హ్యాండ్లూమ్ పార్కు కార్మికుడు బేతి మధు మగ్గంపై నేశారు. వినాయక చవితి రోజు ద్వాదశాథిత్య మహా గణపయ్యకు సమర్పించనున్నట్టు సంస్థ డైరెక్టర్లు భారత లవకుమార్, సీత దామోదర్, గోవర్ధన్, అంజయ్య తెలిపారు.
- భూదాన్‌పోచంపల్లి

## రెండు జిల్లాల్లో ఓ మోస్తరు వాన

ఆసిఫాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు రైతు మృతి

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ జిల్లాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం కురవగా, హైదరాబాద్ నగరంలో జల్లులు పడ్డాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటుకలపహాడ్ గ్రామంలో పిడుగుపడటంతో పత్తి చేనులో పనిచేస్తున్న లక్ష్మణ్(50) అనే రైతు అక్కడికక్కడే మరణించాడు. నల్లగొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గంటపాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. కాగా సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని కొన్నిచోట్ల చిరుజల్లులు పడ్డాయి.

## రామన్న పెద్దమనస్సు..

- సామాన్యుడి ట్వీట్‌కు స్పందించిన కేటీఆర్
- కోమాలోకి వెళ్లిన వ్యక్తి చికిత్సకు రూ.1.50లక్షలు
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఔదార్యంపై ప్రశంసలు



కేటీఆర్ చేసిన ట్వీట్

**నల్లగొండ, నమస్తేతెలంగాణ:** చావుబతుకుల మధ్య దవాఖానలో పోరాడుతున్న నిరుపేద వైద్యానికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వం తరపున ఆర్థిక తోడ్పాటునందించారు. నల్లగొండ జిల్లా మేళ్ల దుప్పలపల్లికి చెందిన నర్సింహ రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లాడు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోని ఓ దవాఖానలో చికిత్స జరుగుతుండగా.. 'నిరుపేద నర్సింహ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ అతడి సన్నిహితులు వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ పెట్టారు. దీంతో కనగల్ మండలం బాలసాయిగూడెం గ్రామానికి చెందిన చిన్నాల రాంబాబు ఈ విషయాన్ని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలియజేశాడు. వెంటనే స్పందించిన కేటీఆర్ రూ.1.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్వోసీ మంజూరు చేయించారు. కేటీఆర్ ఔదార్యంపై పలువురు ప్రశంసలు కురిపించారు.





యునెస్కో గుర్తింపు కోసం రామప్పను అందంగా తీర్చిదిద్దుతామని పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ స్మితకుమారి అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్పలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. వచ్చే నెలలో రానున్న యునెస్కో బృందం రామప్పను చూసి మంత్రముగ్ధులయ్యేలా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు ఉన్నారు.
- వెంకటాపూర్(ములుగు)



సాగుబడిలో తనకు చేదోడువాదోడుగా ఉన్న ఎద్దు అకాల మరణంతో ఆ అన్నదాత కుటుంబం కన్నీరుమున్నీరైంది. పదేండ్లుగా తమ కుటుంబంలో ఒకరిగా ఉన్న ఆ ఎద్దుకు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జాడి మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు రాచన్న, ఎంకమ్మ దంపతులు. దాదాపు రూ.20 వేల ఖర్చు చేసి డప్పు చప్పుళ్లు, బాణసంచా కాలుస్తూ తన పొలం వరకు అంతిమయాత్ర నిర్వహించి ఖననం చేశారు.
- సంగారెడ్డి, నమస్తేతెలంగాణ ప్రధానప్రతినిధి



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో మక్తల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గవినోళ్ల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 1200 మంది విద్యార్థులు 83 మీటర్ల భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. - మక్తల్ రూరల్

# ప్రాణం తీసిన ఫేస్‌బుక్

బాలికను ట్రాప్‌చేసి లైంగికదాడికి యత్నం
ప్రతిఘటించడంతో దారుణంగా హత్య చేసిన యువకుడు
మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన


నిందితుడు నవీన్‌రెడ్డి


సిరిహర్షిణి (ఫైల్)



నేతాజీ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

**జడ్చర్ల రూరల్ :** ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకొని.. ప్రేమ పేరుతో ట్రాప్ చేసిన యువకుడు ఓ బాలికను దారుణంగా హతమార్చిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరాయపల్లి తండా సమీపంలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జడ్చర్ల హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సురేఖ, రవిశంకర్ దంపతులకు ఇద్దరు కూతుర్లు. పెద్దమ్మాయి సిరిహర్షిణి(14) ఏనుగొండ కేంద్రీయ విద్యాలయంలో పదోతరగతి చదువుతున్నది. ఇటీవల ఫేస్‌బుక్‌లో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కోహెడకు చెందిన ఏనుగు నవీన్‌రెడ్డి (28)తో పరిచయం ఏర్పడింది. తాను డిగ్రీ చేశానని మాయమాటలు చెప్పి నిత్యం సిరిహర్షిణితో ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈనెల 27న సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన సిరిహర్షిణి సాయంత్రం 5:30 గంటలకు సమీపంలోని దుకాణానికి వెళ్లింది. అదే సమయంలో నవీన్‌రెడ్డి అక్కడికి వచ్చి ఆ బాలికను కారులో ఎక్కించుకొని శంకరాయపల్లి సమీపంలోని గుట్టల వైపు తీసుకెళ్లాడు. అక్కడ కొద్దిసేపు ఇద్దరు మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో నవీన్‌రెడ్డి లైంగిక దాడికి యత్నించగా బాలిక కేకలు వేసింది. ఎవరైనా వస్తే తన వ్యవహారం బయటపడుతుందని బాలికను కిందకు తోసేసి ఆమె తలపై బండరాయి వేసి పరారయ్యాడు. ఇంటినుంచి వెళ్లిన తమ కూతురు ఎంతకూ రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంటి సమీపంలో రోడ్డుపై సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా యువకుడితో కలిసి కారులో వెళ్లిన విషయాన్ని గుర్తించారు. కారు నంబర్ ఆధారంగా బుధవారం యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వారిని శంకరాయపల్లి సమీపంలోని గుట్టల ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ సిరిహర్షిణి విగతజీవిగా కనిపించింది. బాలిక మృతదేహాన్ని బాదేపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సిరిహర్షిణి హత్య కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు, కుల సంఘాల వారు ప్రధాన రహదారిపై బైఠాయించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితుడికి వరంగల్ తరహా శిక్ష పడేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కేసులో నిందితుడి తరపున న్యాయవాదులు వాదించకూడదని జడ్చర్ల బార్ అసోసియేషన్ నిర్ణయించిందని ఆ సంఘం అధ్యక్షుడు మాలిక్‌షాకీర్ తెలిపారు.

# కార్పొరేట్ తరహా వరంగల్ ఎంజీఎం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
ఎంజీఎంలో ఆకస్మిక పర్యటన


వరంగల్‌లో నిర్వహించిన తీజ్ వేడుకలో నృత్యం చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎంపీ మాలోత్ కవిత

**వరంగల్,నమస్తేతెలంగాణ:**

ఎంజీఎం దవాఖానలో కార్పొరేట్ తరహాలో వైద్యం అందించా లన్న సంకల్పంతో ప్రభుత్వం ముందు కెళ్తున్నదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం వరంగల్ అర్బన్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో కలిసి మంత్రి ఎంజీఎం దవాఖానలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ 5 వేల మంది రోగులు వచ్చే ఓపీలో సీనియర్ డాక్టర్లు లేకపోవడాన్ని గమనించి మంత్రి సూపరింటెండెంట్‌ను పిలిచి మాట్లాడారు. ఓపీలో డ్యూటీ డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకొని, అక్కడి నుంచే వారికి ఫోన్ చేసి విధులకు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ విభాగంలో సీనియర్ కార్డియాలజిస్ట్ లేకపోవడంపై మంత్రి సూపరింటెండెంట్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఎంజీఎం దవాఖాన అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదనీ, ఇటీవల రూ.5.5 కోట్ల నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. విధులకు డుమ్మా కొట్టిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు.

**తీజ్ వేడుకల్లో ఆడిపాడిన మంత్రి**

**భీమారం(వరంగల్ అర్బన్):** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 58వ డివిజన్ గుండ్లసింగారం సంత్ సేవాలాల్ మహరాజ్ మైదానంలో గురువారం రాత్రి తీజ్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, అరూరి రమేశ్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ తదితరులు ఆడిపాడి సందడి చేశారు.

## పింఛన్ డబ్బుల కోసం తల్లిని తోసేసిన కొడుకు

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

**నాగారం:** ఆసరా పింఛన్ డబ్బులు ఇవ్వాలని కొడుకు తన తల్లిపై దాడికి దిగడంతో మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలం డి.కొత్తపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బక్కమ్మ(70)కు ముగ్గురు కొడుకులు. భర్త చనిపోవడం, కొడుకులు వేరుగా ఉండటం, సొంతిల్లు లేకపోవడంతో బక్కమ్మ ఇల్లు అద్దెకు తీసుకొని కూలి పనిచేసుకుంటూ ఆసరా పింఛన్‌తో జీవనం సాగిస్తున్నది. రెండో కొడుకు చంద్రయ్య ఈనెల 25న మద్యం తాగి తల్లి వద్దకు వచ్చి పెన్షన్ డబ్బులు ఇవ్వాలని దాడికి పాల్పడ్డాడు. గాయపడిన ఆమెను సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించారు. ఈనెల 28న బక్కమ్మను ఇంటికి తీసుకురాగా.. అదే రాత్రి మంచం పైనుంచి పడి మృతి చెందింది.

# శ్రీరాజరాజేశ్వర @ 14 టీఎంసీలు


రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లింక్-2లో ఎత్తిపోతలు నిరంతరాయంగా సాగుతుండటంతో శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయం క్రమంగా నిండుతున్నది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, గురువారం రాత్రి 8 గంటలకు నీటినిల్వ 14.062 టీఎంసీలకు చేరింది. బ్యాక్‌వాటర్ 19 కిలోమీటర్ల మేర విస్తరించింది. ధర్మారం మండలం నంది పంప్‌హౌస్‌లో 2, 3, 5 మోటర్లు ఎత్తిపోసిన నీరు నంది రిజర్వాయర్‌కు, అక్కడినుంచి 6 గేట్ల ద్వారా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలివస్తున్నాయి. ఇక్కడ 1, 4, 5 మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్న నీరు.. గ్రావిటీ కెనాల్ గుండా వరదకాల్వలో కలిసి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి చేరుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో గాయత్రి పంప్‌హౌస్‌లో ఆరు లేదా ఏడో నంబర్ మోటర్‌కు వెట్ ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉన్నదని ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌కు సేవాలాల్ సెగ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను సేవాలాల్ సేన జిల్లా నాయకులు అడ్డుకున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణ అమరువీరుల స్తూపానికి లక్ష్మణ్ పూలమాల వేసే క్రమంలో అక్కడికి చేరుకున్న సేవాలాల్ సేన సభ్యులు లక్ష్మణ్ కారును అడ్డుకున్నారు. లంబాడా గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వేదికపై ఎంపీ సోయం లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారనీ.. అది వ్యక్తిగత నిర్ణయమా..? పార్టీ నిర్ణయమా..? చెప్పాలని లక్ష్మణ్‌ను నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే భవిష్యత్తులో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్ హెచ్చరించారు. ఆందోళనలో సేవాలాల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్, ప్రేంచంద్ నాయక్, శివ నాయక్, కాన్షీరాం నాయక్, చందర్ నాయక్, యోగి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వ్యర్థాలతో నీటి వికర్షక నిర్మాణాలు

పరిశోధనల్లో ఉపయోగించిన
హైదరాబాద్ ఐఐటీయన్లు


ఐఐటీ హైదరాబాద్‌లో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ ముద్రిక ఖండేల్వాల్, డాక్టర్ అతుల్ సురేశ్ దేశ్‌పాండే

**సంగారెడ్డిచౌరస్తా:** పారిశ్రామిక రంగంలో వ్యర్థాలుగా మిగిలే బూడిద వంటి పదార్థాలను ఉపయోగించి నీటి వికర్షక నిర్మాణాలను అభివృద్ధి చేయవచ్చని ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు నిరూపించారు. నీటి వికర్షక నిర్మాణాలను అభివృద్ధి చేసేందుకు పారిశ్రామిక వ్యర్థ ఉత్పత్తులైన బూడిదను ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేశారు. గురువారం వారు పరిశోధన వివరాలను వెల్లడించారు. సాధారణంగా ఉపయోగించే యాంటి ఫౌలింగ్ పేయింట్స్, యాంటెన్నా ఉపరితలంపై ఉపయోగించే యాంటి స్టిక్కింగ్, ఆటోమొబైల్స్‌కు సంబంధించి స్వయంగా శుభ్రపరిచే పూతలు, స్టేయిన్ రెసిస్టెంట్ టెక్స్‌టైల్స్, యాంటి సాయిలింగ్ ఆర్కిటెక్చరల్ పూతలు వంటి వాటి కోసం గతంలో అవలంబించిన ఖరీదైన నీటి వికర్షక నిర్మాణాలతో పోలిస్తే పారిశ్రామిక బూడిద ద్వారా చౌకగా నీటి వికర్షక నిర్మాణాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. పరిశోధనల్లో ఐఐటీ హైదరాబాద్ మెటీరియల్ సైన్సెస్ అండ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్ శాస్త్రవేత్తలు డాక్టర్ ముద్రిక ఖండేల్వాల్, డాక్టర్ అతుల్ సురేశ్ దేశ్‌పాండే సంయుక్తంగా పాల్గొన్నారు.

## బ్యాటరీతో నడిచే ఎలక్ట్రిక్ బైక్ తయారీ

బాసర ట్రిపుల్
ఐటీ విద్యార్థుల ప్రతిభ


తయారు చేసిన బైక్‌తో
ట్రిపుల్ ఐటీ విద్యార్థులు మహేశ్, విశాల్

**బాసర:** నూతన ఆవిష్కరణలతో ప్రతిభ చాటుతున్నారు నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులు. కళాశాలలో మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ నాల్గో సంవత్సరం చదువుతున్న జీ విశాల్, జే మహేశ్ అనే విద్యార్థులు ఎలక్ట్రికల్ బైక్‌ను తయారు చేసి అందరినీ అబ్బురపరిచారు. పెట్రోల్, డీజిల్ లేకుండా కేవలం విద్యుత్ చార్జింగ్‌తో పనిచేసే ఈ బైక్ తయారీకి రూ.40 వేలు వెచ్చించారు. నెల రోజులకుపైగా కష్టపడి తయారు చేసిన ఈ బైకు.. గంట చార్జింగ్‌తో 50 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయనున్నదని విద్యార్థులు తెలిపారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ఈ బైకును తయారు చేసినట్టు చెప్పారు.

## రేణుకాచౌదరికి నాన్‌బెయిలబుల్ వారెంట్

**ఖమ్మం లీగల్:** కేంద్ర మాజీ మంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ గారపాటి రేణుకాచౌదరికి ఖమ్మం కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. భూక్యా కళావతిని మోసం చేసి, కులం పేరుతో దూషించారని నమోదైన కేసులో ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు జడ్జి జయమ్మ గురువారం ఎన్‌బీడబ్ల్యూ జారీ చేశారు. ఈ కేసులో పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడం, పార్టీ ఆఫీస్‌కు జారీ చేసిన నోటీసును తిరస్కరించిన కారణంగా ఎన్‌బీడబ్ల్యూ జారీ చేశారు.

## సూర్యాపేట లేబర్ ఆఫీసర్ సస్పెన్షన్

**సూర్యాపేట, నమస్తేతెలంగాణ:** ఓ మహిళ నుంచి సూర్యాపేట లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ బి వాల్య లంచం అడుగుతున్నట్టు వీడియో బయటికి రావడంతో విచారణ జరిపిన కలెక్టర్ అమయ్‌కుమార్ అతడిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 28న పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన మహిళ నుంచి రూ.వేయి లంచం తీసుకుంటుండగా బాధితులు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు.

## వాగేశ్వరి శ్రీచైతన్య పాఠశాల సీజ్

**వేములవాడ, నమస్తేతెలంగాణ:** రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ సమీపంలోని తిప్పాపూర్‌లో స్కూల్ వ్యాన్ బోల్తా పడ్డ ఘటనలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వేములవాడలోని వాగేశ్వరి శ్రీచైతన్య పాఠశాల వాగేశ్వరి పాఠశాల స్థానిక వాసుదేవా కాంప్లెక్స్‌లోని మొదటి, రెండు, మూడో అంతస్థుల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు కొనసాగుతుండగా, ఈ విద్యా సంవత్సరంలోనే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఐదేళ్లకు పైగా వాగేశ్వరి పాఠశాల వాసుదేవా టవర్స్‌లో వాగేశ్వరి శ్రీచైతన్య పాఠశాలగా కొనసాగుతున్నది. కాగా, చెక్కపల్లి రహదారిలో ఉన్న వాగేశ్వరి పాఠశాలకు మాత్రమే అనుమతి ఉందని, వాసుదేవా టవర్స్‌లో కొనసాగుతున్న పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవంటూ జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మండల విద్యాధికారి కోయల్‌కార్ సురేశ్ పాఠశాలను సీజ్ చేశారు.

## భద్రాద్రి జిల్లాలో పేలిన మందుపాతర

- చర్ల మండలం తిప్పాపూర్‌లో ఘటన
- ఉపాధ్యాయులకు త్రుటిలో తప్పిన ప్రమాదం


తిప్పావరం రోడ్డు మధ్యలో మందుపాతర పేలగా ధ్వంసమైన రహదారి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల రూరల్ మండలం తిప్పాపురం సమీపంలో గురువారం సాయంత్రం మావోయిస్టులు మందుపాతర పేల్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తున్నది. గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజీవ్ డివైస్ (ఐఈడీ) అమర్చి పేల్చినట్టు సమాచారం. అదే సమయంలో పామేడు నుంచి చర్లకు వస్తున్న ఉపాధ్యాయుల బృందం ఈ ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడింది. పాఠశాల ముగించుకొని ద్విచక్రవాహనాలపై బయల్దేరిన ఉపాధ్యాయులు ఘటనా స్థలాన్ని దాటిన కొద్దిసేపటికే పేలుడు సంభవించింది. గత కొంతకాలంగా మావోయిస్టులకు, పోలీసులకు మధ్య యుద్ధవాతావరణం నెలకొన్నది. ఈ క్రమంలోనే మావోయిస్టులు భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ ఈ మందుపాతర అమర్చినట్టుగా తెలుస్తున్నది. ఈ ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ఉన్నది. భద్రాచలం ఏఎస్పీ రాజేశ్‌చంద్ర మందుపాతర పేలిన విషయాన్ని ధ్రువీకరించారు.

## మహిళా కానిస్టేబుల్‌కు బలవంతంగా తాళికట్టిన యువకుడు

**మంచిర్యాల టౌన్, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల కలెక్టరేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్‌కు ఓ యువకుడు గురువారం బలవంతంగా తాళికట్టాడు. ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన చింతల కుమారస్వామి అనే యువకుడు తనకు వరసకు మరదలు అయ్యే మహిళా కానిస్టేబుల్ వద్దకు చేరుకొని ఆమెకు బలవంతంగా తాళి కట్టాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

## విదేశంలో ఉంటూ స్వదేశంలో కొలువు

- 20 ఏండ్లుగా వీఆర్ఏ నిర్వాకం
- బినామీ ద్వారా జీతం పొందుతున్న వైనం
- సోదరుని ఫిర్యాదుతో వెలుగులోకి.

**ఎలిగేడు(జూలపల్లి):** దుబాయ్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉపాధి పొందుతూనే స్వదేశంలో బినామీతో ఉద్యోగం చేయిస్తూ జీతం పొందుతున్న వీఆర్ఏ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంతకాలం గుట్టుగా సాగిన ఈ వ్యవహారం అన్నదమ్ముల మధ్య విభేదాలతో బయటపడింది. తన అన్న విదేశాల్లో ఉంటూ ఇక్కడ వీఆర్ఏ ఉద్యోగం చేస్తున్నాడంటూ గురువారం తాసిల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు నివ్వెరపోయారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన బలంతుల దుర్గయ్య గ్రామ వీఆర్ఏ పట్టాదారుగా పనిచేశాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు ఎల్లప్ప, లక్ష్మణ్. ఇరువై ఏండ్ల కింద సర్వీసులో ఉండగానే దుర్గయ్య మృతి చెందాడు. ఈ క్రమంలో పెద్దకొడుకు ఎల్లప్ప దుబాయ్‌లో ఉంటూనే గుట్టుచప్పుడు కాకుండా వీఆర్ఏ పట్టాదారుడిగా తన పేరును రెవెన్యూ కార్యాలయంలో మార్పిడి చేయించుకున్నాడు. దాదాపు ఇరువై ఏండ్లుగా విదేశాల్లోనే ఉంటూ ఎలిగేడులో ఓ బినామీని ఏర్పాటు చేసుకుని వీఆర్ఏ ఉద్యోగం కాపాడుకుంటున్నాడు. తానే స్వయంగా వీఆర్ఏగా పని చేస్తున్నట్టు రెవెన్యూ రికార్డుల్లో చూపిస్తూ జీతం పొందుతున్నాడనీ, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ అతని తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదు చేశాడు. కాగా, ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తాసిల్దార్ జయంత్ తెలిపారు.

# భారతరత్న కోసం యాచించం

## ధ్యాన్‌చంద్ కుమారుడు అశోక్ కుమార్



అశోక్ కుమార్

**న్యూఢిల్లీ :** భారత దేశం గర్వించదగ్గ క్రీడాకారుల్లో ప్రథముడు ధ్యాన్‌చంద్. హాకీ స్టిక్‌తో మాయాజాలం చేసి వరుసగా ఒలింపిక్స్‌లో దేశానికి మూడు స్వర్ణాలు సాధించిపెట్టిన గొప్ప క్రీడాకారుడు. అలాంటి వ్యక్తికి ఇంతవరకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వకపోవడంపై ఎప్పటి నుంచో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ విషయంపై ఆయన కుమారుడు అశోక్ కుమార్ మాట్లాడారు. భారతరత్న పురస్కారానికి నామినేట్ చేయడంలో రాజకీయాలు అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందుకే తన తండ్రికి ఇంత వరకు దేశ అత్యున్నత పురస్కారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాం లో జరిగిన ఓ విషయాన్ని చెప్పారు. 'దాదా(ధ్యాన్‌చంద్)కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తూ ప్రధాని మన్మోహన్ సింగ్ ఫైల్‌పై సంతకం చేసి అప్పటి క్రీడాశాఖ మంత్రికి పంపారు. కానీ తర్వాత ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వం మమ్మల్ని కాదు... దేశ ప్రతిష్ఠను పెంచిన గొప్ప ఐకాన్‌ను అవమానించినట్టు. అవార్డులను కోరకూడదు. అడగకూడదు. యాచించకూడదు. అవి స్వీకరించే అర్హత ఉన్న వారికి ప్రభుత్వమే అందించాలి. మరి ప్రభుత్వమే నిర్ణయించాలి.. ధ్యాన్‌చంద్ భారతరత్నకు అర్హుడో.. కాదో' అని అశోక్ కుమార్ అన్నారు. బ్రిటీష్ నిబంధలను ఎదురించి 1936 ఒలింపిక్స్‌కు వెళ్లేటప్పుడు సూట్‌కేస్‌లో ధ్యాన్‌చంద్ త్రివర్ణ పతాకాన్ని వెంట తీసుకెళ్లారని ఆయన వెల్లడించారు. ధ్యాన్‌చంద్ 16వ ఏటనే సైన్యంలో చేరి దేశానికి సేవ చేసి... ఆ తర్వాత హాకీ స్టిక్‌ను పట్టి 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో భారత జట్టుకు సారథ్యం వహించి స్వర్ణ పతకాలు సాధించిపెట్టారు.

# ప్రతిభకు పట్టం

**ఖేల్‌రత్న స్వీకరించిన దీపా మాలిక్.. అర్జున అందుకున్న సాయి ప్రణీత్.. గగన్ నారంగ్ కృషికి గుర్తింపు**







గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న అవార్డు స్వీకరిస్తున్న పారా అథ్లెట్ దీపా మాలిక్, అర్జున అందుకుంటున్న షట్లర్ సాయి ప్రణీత్, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డు తీసుకుంటున్న షూటర్ గగన్ నారంగ్



స్వప్నా బర్మన్

**న్యూఢిల్లీ:** క్రీడా అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పలు క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులతో పట్టం కట్టారు. రాష్ట్రపతి భవన్ వేదికగా ప్రముఖుల సమక్షంలో అవార్డుల కార్యక్రమం జరిగింది. వైకల్యాన్ని జయిస్తూ రియో(2016) పారాలింపిక్స్‌లో రజత పతకంతో మెరిసిన దీపా మాలిక్..ప్రతిష్ఠాత్మక రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా మాలిక్ అందుకుంది. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం అందుకున్న తొలి మహిళ పారా అథ్లెట్‌గా దీప నిలిచింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఈ అవార్డుతో అంగ వైకల్యం కల్గిన క్రీడాకారుల పట్ల వైఖరి మారుతుంది. దీంతో పాటు తాము ఎవరికీ తీసిపోమనేది ప్రతి ఒక్క పారా అథ్లెట్‌గా గుర్తించాలి. ఈ అవార్డు వైకల్యం కల్గిన మహిళా అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలుస్తుంది. పారాలింపిక్స్‌లో పతకం సాధించేందుకు స్వతంత్ర భారత్‌కు 70 ఏండ్ల సమయం పట్టింది' అని మాలిక్ అంది. మరోవైపు రెజ్లింగ్‌లో తనదైన జోరుతో పతకాలు కొల్లగొడుతున్న బజ్‌రంగ్ పూనియా శిక్షణ కోసం ప్రస్తుతం రష్యాలో ఉన్న కారణంగా అవార్డుల కార్యక్రమానికి స్వయంగా హాజరు కాలేకపోయాడు. ఇటీవల బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిసిన తెలుగు యువ షట్లర్ సాయి ప్రణీత్‌కు అర్జున పురస్కారం దక్కింది. రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రణీత్ అవార్డు స్వీకరించాడు. ఈ యువ షట్లర్‌తో సహా అజయ్ ఠాకూర్, పూజ దండా, ఫవాద్ మీర్జా, సిమ్రన్‌సింగ్, పూనమ్ యాదవ్, స్వప్నా బర్మన్ అర్జున అందుకున్నారు. ప్రస్తుతం వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ ఆడుతున్న కారణంగా టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ జడేజా గైర్హాజరయ్యాడు.

### గగన్ నారంగ్ కృషికి గుర్తింపు:

యువ షూటర్లను వెలికి తీసే ఉద్దేశంతో గగన్ నారంగ్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఫౌండేషన్(జీఎన్ఎస్‌పీఎఫ్) ద్వారా యువకులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందిస్తున్నారు. పవన్‌సింగ్‌తో కలిసి 2011లో స్థాపించిన అకాడమీ ద్వారా చాలా మంది యువ షూటర్లు వెలుగులోకి వచ్చారు. గత ఎనిమిదేండ్ల కాలంలో అకాడమీ షూటర్లు 165 అంతర్జాతీయ పతకాలు కొల్లగొట్టారు. నారంగ్ కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డుతో సత్కరించింది.



### నారంగ్‌కు కేటీఆర్ అభినందన

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డు అందుకున్న హైదరాబాద్ షూటర్ గగన్ నారంగ్‌ను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. గురువారం ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాన్ని పోస్ట్ చేశారు.

# సంజీవ్‌కు రజతం

**రియోడీ జెనీరో:** షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతున్నది. గురువారం జరిగిన పురుషుల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో సంజీవ్ రాజ్‌పుత్ రజతం పతకంతో మెరిశాడు. పతకంతో పాటు రానున్న టోక్యో(2020) ఒలింపిక్స్‌కు బెర్తు దక్కించకున్నాడు. దీంతో ఇప్పటి వరకు ఎనిమిది మంది భారత షూటర్లు టోక్యో విశ్వ క్రీడలకు అర్హత సాధించినట్లయ్యింది. ఎనిమిది మంది పోటీపడ్డ ఫైనల్లో సంజీవ్ 462.0 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. పీటర్ గోర్సా(462.2), జాంగ్ చాంగ్ హాంగ్‌కు వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

# ధోనీ లేకుండానే..

**దక్షిణాఫ్రికాతో టీ20సిరీస్‌కు భారత జట్టు ఎంపిక.. హార్దిక్ పాండ్యా పునరాగమనం**



**న్యూఢిల్లీ:** అనుకున్నట్టుగానే సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో మూడు టీ20లు ఆడనున్న టీమ్‌ఇండియాలో మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీకి చోటుదక్కలేదు. సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యే ఈ సిరీస్‌కు వెస్టిండీస్ పర్యటన ముగిశాక 4వ తేదీన జట్టును ప్రకటిస్తారని ముందు అందరూ అనుకున్నా... అనూహ్యంగా గురువారమే సెలెక్టర్లు 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. 15 రోజుల పాటు సైన్యానికి సేవలందించి, ప్రస్తుతం అమెరికా పర్యటనకు వెళ్లిన ధోనీకి ఈ సిరీస్‌లో చోటివ్వలేదు. అందుబాటులో ఉండే విషయం మహీతో ఏమైనా మాట్లాడారా అన్న విషయంపై సెలెక్టర్లు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. గాయం నుంచి కోలుకున్న హార్దిక్ పాండ్యా సఫారీలతో పొట్టి ఫార్మాట్ సిరీస్‌కు తిరిగి జట్టులోకి వచ్చాడు. ఎడతెరిపి తెరిపి లేకుండా మ్యాచ్‌లు ఆడుతున్న పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు సెలెక్టర్లు విశ్రాంతినిచ్చారు. ఈ రెండు మార్పులు మినహా వెస్టిండీస్‌ను 3-0తో చిత్తుచేసిన జట్టువైపే సెలెక్టర్లు మొగ్గుచూపారు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని పంత్‌తో పాటు మరో ఇద్దరు వికెట్ కీపింగ్ బ్యాట్స్‌మెన్‌కు చోటివ్వాలని సెలెక్టర్లు ముందుగా ఆలోచించినా... ఆ ప్రయోగాన్ని ప్రస్తుతానికి వాయిదా వేశారు. మూడు టీ20లు, మూడు టెస్టులు ఆడేందుకు దక్షిణాఫ్రికా జట్టు సెప్టెంబర్‌లో భారత పర్యటనకు రానుంది. 15, 18, 22 తేదీల్లో టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.

**సఫారీలతో టీ20లకు భారత జట్టు :**
విరాట్ కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, కృనాల్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, రాహుల్ చాహర్, ఖలీల్ అహ్మద్, దీపర్ చాహర్, నవ్‌దీప్ సైనీ

# ద్రవిడ్ స్థానంలో కోటక్, మాంబ్రె

**న్యూఢిల్లీ:** క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ స్థానంలో దక్షిణాఫ్రికా 'ఎ'తో సిరీస్‌కు భారత్ 'ఎ', అండర్-19 జట్లకు ప్రధాన కోచ్‌లుగా సితాంశు కోటక్, పారస్ మాంబ్రె వ్యవహరించనున్నారు. జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) ఆపరేషన్స్ హెడ్‌గా ద్రవిడ్ ఇటీవలే నియమితుడైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్‌సీఏలో ఎక్కువ సమయం గడుపాల్సిన అవసరం ఉండటంతో యువ జట్లకు కొత్త కోచ్‌లను నియమించాల్సి వచ్చింది. దీనికి తోడు ప్రస్తుతమున్న కోచింగ్ పద్ధతులను మార్చడంతో పాటు భారత్ 'ఎ', అండర్-19 పర్యటనలకు అవసరమైనప్పుడు ద్రవిడ్ వెళ్లాల్సిన నేపథ్యంలో ఈ నియామకాలు జరిగాయి. అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోయినా..వీరందరు కూడా ఎన్‌సీఏ సిబ్బందిలో భాగమని బీసీసీఐ ప్రతినిధి గురువారం పేర్కొన్నారు. భారత 'ఎ' బౌలింగ్ కోచ్‌గా మాంబ్రె స్థానంలో మాజీ స్పిన్నర్ రమేశ్ పొవార్‌తో భర్తీ చేయగా, ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ వ్యవహరించనున్నాడు.

# క్లీన్‌స్వీప్‌పై కన్ను

## నేటి నుంచి భారత్-విండీస్ రెండో టెస్టు

**భీకర ఫామ్‌లో టీమ్‌ఇండియా పేసర్లు.. పుంజుకునేందుకు విండీస్ ఆరాటం**

**విండీస్‌పై తొలిటెస్టులో భారీ విజయం సాధించిన భారత్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. తొలి పోరులో అదరగొట్టి మంచి జోరుమీదున్న ఆటగాళ్లు రెండో మ్యాచ్‌లోనూ సత్తాచాటాలని పట్టుదలగా ఉన్నారు. భీకరఫామ్‌లో ఉన్న పేసర్లు మరోసారి నిప్పులు చెరగాలని వేచిచూస్తుంటే... బ్యాటింగ్‌లో అదరగొట్టి తదుపరి సిరీస్‌లకు స్థానాలను పదిలం చేసుకోవాలని రహానే, విహారి పట్టుదలగా ఉన్నారు. మరోవైపు వరుస వైఫల్యాలతో వెనుకబడ్డ పంత్‌పైనే అందరి దృష్టి ఉండనుంది. ఈ మ్యాచ్ గెలిస్తే విండీస్ పర్యటనలో అన్ని సిరీస్‌లను క్లీన్‌స్వీప్ చేసిన ఘనత కోహ్లీసేనకు దక్కుతుంది. మరోవైపు సొంతగడ్డపై ఘోర పరాభవాన్ని తప్పించుకునేందుకు సమిష్టిగా రాణించాలని హోల్డర్ సేన ప్రణాళికలు రచిస్తున్నది.**



**1**
ఈ మ్యాచ్ భారత్ గెలిస్తే అత్యధిక టెస్టు విజయాలు సాధించిన జట్టుకు సారథ్యం వహించిన కెప్టెన్‌గా ధోనీ(27)ని వెనక్కినెట్టి విరాట్ కోహ్లీ(27) అగ్రస్థానానికి చేరుతాడు.

రాత్రి 8.00 నుంచి సోనీ టెన్-1లో

**కింగ్‌స్టన్(జమైకా) :** పర్యటనలో చివరిదైన రెండో టెస్టును గెలిచి వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేయాలన్న కసితో టీమ్‌ఇండియా సిద్ధమైంది. కరీబియన్ గడ్డపై ఆతిథ్య జట్టును టీ20 సిరీస్‌లో 3-0తో, వన్డే సిరీస్‌లో 2-0తో క్లీన్‌స్వీప్ చేసిన రీతిగానే టెస్టుల్లోనూ ఆ ఫలితాన్నే పునరావృతం చేయాలని కోహ్లీసేన పట్టుదలగా ఉంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇక్కడి సబీనాపార్క్ మైదానంలో ఇరు జట్ల మధ్య ఆఖరి టెస్టు శుక్రవారం ప్రారంభం కానుంది. పేసర్ల విజృంభణతో తొలి టెస్టులో ఏకంగా 318 పరుగులతో గెలిచిన భారత్... ఈ మ్యాచ్‌నూ కైవసం చేసుకొని ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలి సిరీస్‌ను ఘనంగా ముగించాలని పట్టుదలగా ఉంది. అధిక టెస్టు విజయాలు సాధించిన కెప్టెన్‌గా ధోనీని అధిగమించాలని కోహ్లీ తహతహలాడుతున్నాడు. తొలి టెస్టులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టీమ్‌ఇండియా అదరగొట్టినా.. వికెట్ కీపర్ పంత్ ఫామ్ లేమి ఆందోళన కలిగిస్తున్నది. తదుపరి సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో సుదీర్ఘ ఫార్మాట్ ఆడాల్సి ఉన్న నేపథ్యంలో ఆ సిరీస్‌కు ఎంపికయ్యేందుకు కొందరు ఆటగాళ్లకు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. వెస్టిండీస్ మాత్రం పేసర్లు గాబ్రియెల్, కీమర్ రోచ్ మీదే పూర్తి నమ్మకాలు పెట్టుకుంది. తొలి టెస్టులో విఫలమైన హెట్మైర్, హోప్ సత్తా చాటుతారని ఆశిస్తున్నది.

### పంత్‌పైనే అందరి కండ్లు

తొలి టెస్టులో భారీ విజయం సాధించడంతో దాదాపు అదే జట్టుతోనే ఈ మ్యాచ్‌లోనూ టీమ్‌ఇండియా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. వరుసగా విఫలమవుతున్న వికెట్ కీపర్ పంత్ స్థానంలో.. సీనియర్ వృద్ధిమాన్ సాహను తీసుకోవాలని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే మేనేజ్‌మెంట్ మాత్రం రిషభ్‌కే ఓటేసే అవకాశముంది. విండీస్ పర్యటనలో వరుసగా 0,4,65నాటౌట్, 20, 0, 24, 7 స్కోర్లు చేసిన పంత్ ఒత్తిడిలో ఉన్నాడు. అతడు తక్కువ పరుగులే చేశాడన్న అసంతృప్తి కన్నా, ఔటవుతున్న తీరే అందరికీ చిరాకు తెప్పిస్తున్నది. అనవసరమైన షాట్లకు పోయి పంత్ వెనుదిగుతుండడంపై మాజీలు సైతం పెదవివిరుస్తున్నారు.



### మయాంక్‌కు కీలకం

ఎన్నో అంచనాలు పెట్టుకున్న ఓపెనర్ మయాంక్ అగర్వాల్(5,16) తొలి టెస్టులో విఫలమయ్యాడు. అతడు ఈ మ్యాచ్‌లో రాణించకపోతే తదుపరి సిరీస్‌లకు టీమ్‌ఇండియాలో చోటు కష్టమవుతుంది. దక్షిణాఫ్రికా సిరీస్ సొంతగడ్డపై జరుగనుండడంతో అగర్వాల్ విఫలమైతే సెలెక్టర్లు రోహిత్‌శర్మ వైపు చూసే అవకాశముంది. ఇక తొలి టెస్టులో అజింక్యా రహానే(81, 102), తెలుగు ఆటగాడు హనుమ విహారి(32, 93) అంచనాలకు మించి రాణించడంతో వారి స్థానం ఖాయం. ఆల్‌రౌండర్‌గా బంతి, బ్యాటుతో రాణించిన జడేజా జట్టులో ఉంటాడు.

### పేసర్ల ఫుల్ స్వింగ్

పేస్, బౌన్స్, స్వింగ్‌తో భారత పేసర్లు భీకర ఫామ్‌లో ఉన్నారు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఇషాంత్ శర్మ ఐదు వికెట్లతో రాణిస్తే.. రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా ఏడు పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి విశ్వరూపమే ప్రదర్శించాడు. ఔట్‌స్వింగర్లతో విండీస్ ఆటగాళ్లను బెంబేలెత్తించాడు. షమీ షార్ట్‌పిచ్ బంతులతో ప్రభావం చూపితే.. ఆల్‌రౌండర్ జడేజా స్పిన్‌తో తన స్థానానికి న్యాయం చేశాడు.

### విండీస్ దిగాలు

తొలి టెస్టులో వెస్టిండీస్ ఆటగాళ్లు అన్ని విభాగాల్లో పేలవ ప్రదర్శన చేశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న హెట్మైర్, హోప్ బ్యాటింగ్‌లో బోల్తా పడ్డారు. పేసర్ రోచ్, చేజ్ ఒక్కో ఇన్నింగ్స్‌లో రాణించినా బౌలర్ల సమిష్టి ప్రదర్శన లోపించడంతో విండీస్ భారీ ఓటమి మూటగట్టుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 100పరుగులకే ఆలౌటై ఆ జట్టు ఆత్మస్థైర్యాన్ని కోల్పోయింది. అయితే, ఈ మ్యాచ్‌లోనైనా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించి సొంత గడ్డపై భారీ వైట్‌వాష్‌ను తప్పించుకోవాలని విండీస్ ఆటగాళ్లు ఆశిస్తున్నారు. అయితే, భీకర ఫామ్‌లో ఉన్న టీమ్‌ఇండియాను వారు ఏ మాత్రం అడ్డుకోగలరో చూడాలి.

**జట్లు (అంచనా)**

**భారత్ :** మయాంక్ అగర్వాల్, కేఎల్ రాహుల్, పుజార, కోహ్లీ(కెప్టెన్), రహానే, విహారి, పంత్(వికెట్ కీపర్), జడేజా, ఇషాంత్, షమీ / అశ్విన్, బుమ్రా
**వెస్టిండీస్ :** హోల్డర్(కెప్టెన్), క్రైగ్ బ్రాత్‌వైట్, కాంప్‌బెల్, డారీన్ బ్రావో, చేజ్, హోప్(వికెట్ కీపర్), హెట్మైర్, కార్న్‌వాల్, కీమో పాల్, రోచ్, గాబ్రియెల్

# రాయుడు రీఎంట్రీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తెలుగు స్టార్ క్రికెటర్ అంబటి రాయుడు రిటైర్మెంట్‌పై తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. ఇటీవలి ప్రపంచకప్ టోర్నీకి తనను ఎంపిక చేయకపోవడంపై ఒకింత మనస్థాపానికి గురైన రాయుడు అనూహ్యంగా క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. అయితే గడ్డుకాలంలో సీఎస్‌కే యాజమాన్యం, వీవీఎస్ లక్ష్మణ్, నోయల్ డేవిడ్ అండగా నిలువడంతో రాయుడు పునరాగమనానికి సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో రానున్న సీజన్‌లో హైదరాబాద్‌కు తాను అందుబాటులో ఉంటానంటూ హెచ్‌సీఏ సీఈవోకు గురువారం లేఖ రాశాడు.

# బెంగాల్ గెలుపు

**న్యూఢిల్లీ :** ప్రొకబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో బెంగాల్ వారియర్స్ జట్టు గెలుపుబాట పట్టింది. గురువారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ 35-26తో తమిళ్ తలైవాస్‌పై సునాయాస విజయం సాధించింది. రైడింగ్‌లో వారియర్స్ ఆటగాళ్లు ప్రపంజన్(10పాయింట్లు), మహీందర్ సింగ్(9పాయింట్లు) అదరగొట్టగా, రింకు నర్వాల్(5పాయింట్లు) ట్యాక్లింగ్‌లో రాణించాడు.



**క్రికెట్ కంటే ఒలింపిక్స్, కామన్వెల్త్**

# పెద్దవి: సెహ్వాగ్

**ముంబై:** క్రికెట్ టోర్నీలతో పోల్చుకుంటే ఒలింపిక్స్, కామన్వెల్త్ లాంటి క్రీడా ఈవెంట్లు చాలా పెద్దవని మాజీ ఓపెనర్ సెహ్వాగ్ అన్నాడు. గురువారం 'ఉమీద్ ఇండియా' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వీరూ మాట్లాడాడు. 'క్రికెటర్లతో పోల్చుకుంటే మిగతా క్రీడాకారులు పొందే సదుపాయాలు చాలా తక్కువ. సరైన రీతిలో ఆటగాళ్లకు శిక్షణ, పౌష్టికాహారం, ఫిజియో, ట్రైనర్లను అందుబాటులో ఉంచితే అద్భుతాలు సృష్టిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు' అని సెహ్వాగ్ అన్నాడు.

# నొవాక్, ఫెడ్ ముందడుగు




**న్యూయార్క్ :** యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో స్టార్ ప్లేయర్లు డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జకోవిచ్(సెర్బియా), స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, నిషికొరి(జపాన్) విజయం సాధించి ముందడుగేశారు. టాప్ సీడ్ జకోవిచ్ 6-4, 7-6(7/3), 6-1తో ఇగ్నాసియో లోన్‌డెరో(అర్జెంటీనా)పై గెలిచాడు. 2గంటల 15 నిమిషాల పాటు మ్యాచ్ సాగగా సెర్బియా వీరుడు ఏడు ఏస్‌లను, 35 విన్నర్లను సాధించాడు. అయితే, మ్యాచ్ ఆడుతున్న సమయంలో తనను భుజం నొప్పి చాలా బాధించిందని జొకో చెప్పాడు. మరోమ్యాచ్‌లో మూడో సీడ్ ఫెదరర్ 3-6, 6-2, 6-3, 6-4 తేడాతో 99వ ర్యాంకు డామిర్ జుమ్‌హర్(బోసానియా)పై విజయం సాధించాడు. మ్యాచ్ మొత్తమ్మీద 16 ఏస్‌లు సంధించాడు. ఏడో సీడ్ నిషికొరి(జపాన్) 6-2, 4-6, 6-3, 7-5 తేడాతో బ్రాడ్లీ క్లాన్(అమెరికా)ను ఓడించాడు.

### మూడో రౌండ్‌లో ఒసాకా, బార్టీ

మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ నవోమి ఒసాక(జపాన్) 6-2, 6-4తేడాతో లినెట్(పోలెండ్)పై సునాయాస విజయం సాధించి మూడో రౌండ్‌కు చేరింది. రెండో సీడ్, ఫ్రెంచ్ ఓపెన్ విజేత ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా) 6-2, 7-6(7/2) తేడాతో లారెన్ డేవిస్(అమెరికా)పై గెలుపొందింది. 2గంటల పాటు సాగిన పోరులో బార్టీ 35 విన్నర్లు, 8ఏస్‌లు సాధించి నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. మరో మ్యాచ్‌లో 23గ్రాండ్‌స్లామ్‌ల విజేత సెరెనా విలియమ్స్ 5-7, 6-3, 6-1తో 18ఏళ్ల మెక్‌నాలీ(అమెరికా)పై విజయం సాధించింది.

# వలరివాన్‌కు స్వర్ణం



**రియో డి జెనిరో(బ్రెజిల్) :** షూటింగ్ సీనియర్ ప్రపంచకప్ 10 మీటర్ల రైఫిల్ విభాగంలో భారత యువ షూటర్ ఎలావెనిల్ వలరివాన్ అద్భుత ప్రదర్శన చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అంజలీ భగవత్, అపూర్వి చండీలా తర్వాత ఈ ఘనత సాధించిన భారత మూడో షూటర్‌గా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో 251.7 పాయింట్లు సాధించిన ఎలావెనిల్ అగ్రస్థానంలో నిలువగా.. 250.6తో మాకింతోష్(బ్రిటన్) రజతాన్ని కైవసం చేసుకుంది. చైనీస్ తైపీ షూటర్ షిన్ లిన్ కాంస్యంతో సరిపెట్టుకుంది.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 37,069 | 10,948 |
| ↓ 383 | ↓ 98 |

ముడి చమురు (బ్రెంట్) ↑ 60.65 డాలర్లు

**బంగారం ధరలు**

న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 40,220 |
| 22 క్యారెట్లు | 40,050 |
| వెండి (కిలో) | 49,050 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 68.90 | 74.40 |
| యూరో | 76.20 | 82.70 |
| బహ్రెయిన్ దినార్ | 181.00 | 195.00 |
| కువైట్ దినార్ | 227.50 | 239.50 |
| సౌదీ రియాల్ | 18.00 | 19.80 |
| యూఏఈ దిర్హామ్ | 18.40 | 20.10 |

### స్టార్టప్‌ల కోసం 'టీ-ఏంజెల్'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పెట్టుబడి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం, టీ-హబ్ సంయుక్తంగా 'టీ-ఏంజెల్'ను రూపొందించనున్నట్టు టీ-హబ్ సీఈవో రవి నారాయణ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో టీ-ఏంజెల్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్టార్టప్‌లకు సహకరించడంలో భాగంగా టీ-ఏంజెల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. టీ-ఏంజెల్ నిర్వహణను టీ-హబ్ పర్యవేక్షిస్తోందన్నారు.

# భగ్గుమన్న బంగారం

- రూ.40 వేలు అధిగమించి రికార్డు స్థాయికి తులం ధర
- రూ.250 ఎగబాకి రూ.40,220 పలికిన పుత్తడి
- రూ.49 వేలు దాటిన వెండి



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** బంగారం ధరలు చుక్కలనంటుతున్నాయి. పెట్టుబడిదారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడం, అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం భయాలు చుట్టుముట్టడంతో రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న ధర గురువారం మరో చారిత్రక స్థాయికి చేరుకున్నది. బంగారం చరిత్రలో తొలిసారిగా రూ.40 వేలు దాటి పరుగులు పెట్టింది. వరుసగా రెండోరోజు రికార్డు బద్దలు కొడుతున్న 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.250 అందుకొని ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.40,220కి చేరుకున్నది. బుధవారం రూ.300 ఎగబాకి రూ.39,970కి చేరుకున్న విషయం తెలిసిందే. గడిచిన పక్షం రోజుల్లో ఏకంగా రూ.3 వేలకు పైగా పెరిగినట్లు అయింది. పసిడితోపాటు వెండి మరింత మెరిసింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో కిలో వెండి రూ.200 అధికమై రూ.49,050కి చేరుకున్నది. త్వరలో రూ.50 వేలకు చేరుకునే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ దేశాలపై ఆర్థిక మాంద్యం కోరలు చాచుతుండటం, అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యంపై జరుగుతున్న చర్చలు కొలిక్కి రాకపోవడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో గత నెల రోజులుగా ధరలు ఎగువముఖం పడుతున్నాయి. వీటికితోడు వచ్చేది పండుగ సీజన్‌కావడంతో ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో ధరలు అంతకంతకు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు తపన్ పటేల్ తెలిపారు. అమెరికా, జర్మనీ దేశాల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటంతో గ్లోబల్ మార్కెట్లో పసిడి ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. యూరోపియన్ దేశాల నుంచి బ్రెగ్జిట్ వైదొలుగుతుండటంతో నెలకొననున్న పరిస్థితులపై పెట్టుబడిదారులు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో 1,550 డాలర్లకు చేరుకున్న ఔన్స్ గోల్డ్ ధర చివరకు 1,539 డాలర్ల వద్ద ముగియగా, వెండి 18.63 డాలర్ల వద్ద నిలిచింది.

# 'డిజిటల్' హుళక్కేనా?

## చలామణిలో రూ.21.10 లక్షల కోట్లు

### 17శాతం పెరిగిన కరెన్సీ విలువ ■ వార్షిక నివేదికలో వెల్లడించిన ఆర్బీఐ



**ముంబై, ఆగస్టు 29:** దేశాన్ని డిజిటల్ బాట పట్టిస్తామని బీరాలు పలికిన మోదీ సర్కారు.. పాత పెద్ద నోట్ల రద్దు తర్వాత ద్రవ్య వ్యవస్థలోకి మరింత నగదును తెచ్చిపెట్టింది. ఈ ఏడాది మార్చి నాటికి చలామణిలో రూ.21.10 లక్షల కోట్ల విలువైన కరెన్సీ ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను గురువారం ఆర్బీఐ వార్షిక నివేదికను విడుదల చేసింది. 2016 నవంబర్ 8న రూ.500, 1,000 కరెన్సీ నోట్ల చలామణిని రద్దు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంచలనాత్మకంగా ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు వ్యవస్థలో మొత్తం రూ.15.41 లక్షల కోట్ల కరెన్సీ చలామణిలో ఉండగా, ఇందులో దాదాపు 99.3 శాతానికి సమానంగా ఉన్న రూ.15.30 లక్షల కోట్ల పెద్ద నోట్లను రద్దు చేసేసిన సంగతీ విదితమే. కొత్తగా రూ.500, 2,000 నోట్లను పరిచయం చేయగా, కరెన్సీ కొరత కారణంగా డిజిటల్ ఎకానమీ పల్లవిని కేంద్రం అందుకున్నది. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ లావాదేవీలకు ఊతమిచ్చే నిర్ణయాలనూ తీసుకున్నది. అయితే కాలం గడుస్తున్నకొద్దీ వ్యవస్థలోకి మళ్లీ కరెన్సీ పెద్ద ఎత్తున వచ్చి చేరింది. చివరకు నకిలీ నోట్ల ఏరివేత లక్ష్యం కూడా నెరవేరకుండానే పోయింది. రద్దైన నోట్లలో 99.8 శాతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకే వచ్చాయని ఆర్బీఐ ప్రకటించినదీ తెలిసిందే. ఈ నేపథ్యంలో డిజిటల్ ఎకానమీ ఆశలూ గల్లంతైనట్లు తాజా ఆర్బీఐ నివేదికతో బట్టబయలైంది. కరెన్సీ విలువ 17 శాతం, కరెన్సీ నోట్ల సంఖ్య 6.2 శాతం (1,08,759) పెరిగిందని ఆర్బీఐ తమ వార్షిక నివేదికలో స్పష్టం చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కరెన్సీలో రూ.500 నోట్ల విలువ 51 శాతమని పేర్కొన్నది. అంతేగాక రూ.500, 2,000 నోట్లు కలిసి మొత్తం కరెన్సీ విలువలో 82 శాతానికి సమానమని తెలిపింది. రూ.2,000 నోట్ల విలువ ఈ మార్చి నాటికి రూ.6.58 లక్షల కోట్లకు తగ్గినట్లు ఆర్బీఐ ఈ సందర్భంగా తెలియజేసింది. అలాగే 21 వేలకుపైగా రూ.500 నోట్లు, మరో 21 వేలకుపైగా 2,000 నోట్లను నకిలీవిగా గుర్తించినట్లు చెప్పింది. కాగా, త్వరలోనే ప్రయోగాత్మకంగా కొత్త రకం రూ.100 నోట్లను ప్రవేశపెడుతామన్న ఆర్బీఐ.. దివ్యాంగులు సులభంగా గుర్తించేలా వీటిని తీసుకురానున్నట్లు చెప్పింది. ఇక రిటైల్ ఎలక్ట్రానిక్ పేమెంట్ లావాదేవీలు 59 శాతం పెరిగి 23.3 బిలియన్లకు చేరాయని ఆర్బీఐ తాజా నివేదిక తెలిపింది.

#### దిగిన ఎన్‌పీఏలు

బ్యాంకుల్లో మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) తగ్గుముఖం పట్టాయని, గత ఆర్థిక సంవత్సరం స్థూల నిరర్థక రుణాల నిష్పత్తి 9.1 శాతం దిగిందని, అంతకుముందు 11.2 శాతంగా ఉందని ఆర్బీఐ ఈ సందర్భంగా తెలిపింది. ఎన్‌పీఏలను ముందుగా గుర్తించడం, తీర్మానించడం కలిసొచ్చిందని చెప్పింది. ఇదిలావుంటే త్వరలో కొత్త వేతన నిబంధనలను తెస్తామని ఆర్బీఐ ప్రకటించింది. ప్రైవేట్ రంగ, విదేశీ బ్యాంక్ అధిపతుల కోసం 2012లో వేతన మార్గదర్శకాలను ఆర్బీఐ తీసుకొచ్చింది. అయితే వాటిని సవరించనున్నట్లు తాజాగా చెప్పింది.

#### ఆర్థిక వ్యవస్థపై భయాలు వద్దు

దేశ ఆర్థిక వ్యవస్థపై అనవసరపు భయాలు వద్దని, ప్రస్తుత మందగమనం పరిణామక్రమంలో వచ్చే పతనమేనని వ్యాఖ్యానించింది. వినియోగ సామర్థ్యం, ప్రైవేట్ రంగ పెట్టుబడులు పెరిగితే పరిస్థితులు చక్కబడుతాయన్న ధీమాను వ్యక్తం చేసింది. కాగా, పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్)లపై నగదు ఉపసంహరణ సదుపాయాలను పొడిగించాలని బ్యాంకులను ఆర్బీఐ కోరింది.

#### 20 శాతం తగ్గిన కమర్షియల్ రుణాలు

ఐఎల్అండ్ఎఫ్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభం మొత్తం నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలను చుట్టుముట్టింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో రుణ వితరణ 20% తగ్గి రూ.9.34 లక్షల కోట్లకు పడిపోయాయని తెలిపింది. అంతక్రితం ఏడాది ఇది రూ.11.60 లక్షల కోట్లుగా ఉన్నాయి. రూ.99 వేల కోట్ల రుణాల తిరిగి చెల్లింపుల విషయంలో విఫలంకావడంతో ఐఎల్అండ్ఎఫ్ఎస్ దివాలాను ఎదుర్కొంటున్నది.

### రూ.1.96 లక్షల కోట్లకు తగ్గిన నిధి



**కేం**ద్రానికి ఆర్బీఐ కేటాయించిన రూ.1.76 లక్షల కోట్లతో సెంట్రల్ బ్యాంక్ అగంతుక నిధి రూ.1.96 లక్షల కోట్లకు పడిపోయింది. 2018-19కిగాను ప్రకటించిన ఈ రూ.1.76 లక్షల కోట్లలో రూ.52,000 కోట్లను అగంతుక నిధి నుంచి ఖజానాకు ఆర్బీఐ తరలిస్తున్న విషయం తెలిసిందే. దీంతో నిధి విలువ రూ.2,32,108 కోట్ల నుంచి రూ.1,96,344 కోట్లకు తగ్గిందని ఆర్బీఐ తాజా వార్షిక నివేదికలో వివరించింది. ఐదేండ్లకోసారి ఈ నిధిని సమీక్షించాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ కమిటీ రిజర్వ్ బ్యాంక్‌కు సూచించిన సంగతి విదితమే. ఆర్బీఐ పెట్టుబడులు నష్టాలకు లోనైనప్పుడు ద్రవ్య వ్యవస్థను ఆదుకునేందుకు ఈ నిధిని వినియోగిస్తారు.

### రూ.71 వేల కోట్ల బ్యాంక్ మోసాలు



**బ్యాం**కు మోసాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన మోసాలు 15 శాతం పెరుగగా, వీటి విలువ 73.8 శాతం అధికమైందని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2018-19లో 6,801 బ్యాంక్ మోసాలు జరుగగా, వీటి విలువ రూ.71,542.93 కోట్ల స్థాయిలో ఉన్నది. అంతక్రితం ఏడాది 5,916 మోసాలు జరుగగా, వీటి విలువ రూ.41,167.04 కోట్లని తెలిపింది. రుణ వితరణలో అగ్రస్థాయిలో ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులు మోసాల్లోనూ ముందు వరుసలో నిలిచాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రైవేట్, విదేశీ బ్యాంకులు ఉన్నాయి. గతేడాది ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 3,766 మోసాలు జరుగగా, వీటి విలువ రూ.64,609.43 కోట్లని పేర్కొంది. క్రితం ఏడాది 2,855 కేసులతో రూ.38,260.80 కోట్లు. సరాసరిగా రూ.100 కోట్ల కంటే అధికంగా జరిగిన మోసాల విలువ రూ.52,200 కోట్లని గుర్తించింది. వీటి కాలపరిమితి 55 నెలలు. బ్యాంక్ మోసాల్లో కార్డు/ఇంటర్నెట్‌కు సంబంధించి/ డిపాజిటరీ మోసాల ఆధారంగా రిజర్వు బ్యాంక్ లెక్కించింది. మొత్తం మోసాల్లో కార్డు/ఇంటర్నెట్, డిపాజిట్స్ వాటా 0.3 శాతంగా ఉన్నది.

# సెన్సెక్స్ 383 పాయింట్లు డౌన్

**ముంబై, ఆగస్టు 29:** స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లు భారీ అమ్మకాలకు లోనుకోవడం, ఆగస్టు నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 382.91 పాయింట్లు పతనం చెంది 37,068.93లకు జారుకోగా, నిఫ్టీ 97.80 పాయింట్లు క్షీణించి 10,948.30 వద్ద ముగిసింది. యూరోపియన్ ఈక్విటీల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మదుపరుల్లో ఆందోళనను పెంచాయి. యెస్ బ్యాంక్, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, కొటక్ బ్యాంక్, ఐటీసీ, రిలయన్స్, మహీంద్రా, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లు నాలుగు శాతం వరకు నష్టపోయాయి. కానీ, సన్‌ఫార్మా, వేదాంతా, ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌యూఎల్‌ల షేర్లు 5.30 శాతం వరకు బలపడ్డాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకెక్స్, ఫైనాన్స్, ఇంధనం, ఆటో, ఎఫ్ఎంసీజీ, ఇండస్ట్రియల్ 1.92 శాతం వరకు లాభపడగా, హెల్త్‌కేర్, మెటల్, రియల్టీ, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, యుటిలిటీ, టెలికం రంగ షేర్లు 1.50 శాతం నష్టపోయాయి.

# రూ.7500 కోట్ల టర్నోవర్ లక్ష్యం

### రామ్‌కో ఈడీ బాలాజీ కే మూర్తి



**హైదరాబాద్, ఆగస్టు 29:** చెన్నైకు చెందిన ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ రామ్‌కో సిమెంట్ లిమిటెడ్..ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,500 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 3.15 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ వచ్చే ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్నదని, దీంతో పూర్తి సామర్థ్యం 12.5 మిలియన్ టన్నులకు చేరుకోనున్నదని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్) బాలాజీ కే మూర్తి తెలిపారు. మార్కెట్లో రోజురోజుకు పెరుగుతున్న సిమెంట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్ కెపాసిటీని భవిష్యత్తులో 10 మిలియన్ టన్నులకు పెంచే ప్రతిపాదన కూడా ఉన్నదన్నారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.7,500 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదన్నారు. గతేడాది సంస్థ రూ.5,146 కోట్ల ఆదాయాన్ని గడించింది. ప్రీమియం సిమెంట్ మార్కెట్లో సుస్థిరమైన స్థానం సాధించడానికి సూపర్‌క్రెటా పేరుతో ప్రత్యేక బ్రాండ్‌ను ఆవిష్కరించింది.


తెలంగాణ ప్రభుత్వము
**పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, నల్గొండ**
**అనుబంధం-IV**
'e'ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన నం:PR/126, 150, 158/2018-2019 (సవరణ-IV), తేది: 26-08-2019. నల్గొండ & యాదాద్రి భువనగిరి జిల్లాలలోని వివిధ మండలాలలో (3) రోడ్ పనులు, రోడ్లపై BT ఏర్పాటు కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ECV: రూ. 476.00 లక్షలు. టెండర్ల డౌన్‌లోడ్‌ప్రారంభం & ముగింపు తేది: 04-09-2019 నుండి 11-09-2019. తదుపరి వివరాల కొరకు e ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in దర్శించండి. e మెయిల్: seprnlgd@gmail.com
DIPR RO No.1032-DP/CL/Advt/1/2019-20, Dt: 29/08/2019 సం/- ప్రాంతీయ అధికారి, ప్రాంతీయ కార్యాలయం, నల్గొండ

తెలంగాణ ప్రభుత్వం
**పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయం, PR సర్కిలు, ఖమ్మం**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
**టెండరు ప్రకటన NIT No.03/2019-20** **తేది: 26-08-2019**
I & CAD (Reforms) శాఖ G.O.Ms.No.66 తేది: 20-04-2015 ప్రకారంగా అర్హత) కలిగిన నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడినవి. **పనిపేరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట (ST) అసెంబ్లీ నియోజకవర్గం వద్ద గ్రీన్ ఫీల్డ్ స్టేడియా/ మినీస్టేడియాలు నిర్మించుట. **మొత్తం ECV.** 265.00 లక్షలు. షెడ్యూలు ప్రారంభ తేది: 04-09-2019. ముగింపు తేది: 13-09-2019. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in/login.htmlలో ఇ-మార్కెట్ ప్లేసు వద్ద చూడవచ్చును.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, P.R.సర్కిలు, ఖమ్మం.
**DIPR RO No. 1026-DP/CL/Advt/1/2019-20, Dt: 29/08/2019**

తెలంగాణ ప్రభుత్వం
**తెలంగాణ ప్రభుత్వ టెక్స్ట్ బుక్ ప్రెస్ కార్యాలయం, మింట్ కాంపౌండ్, ఖైరతాబాద్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
**RC No: 1746/P2/2019,** **తేది: 28.08.2019**
''ఆర్ ఇండియా బేసిస్'' పై 2020-21 విద్యా సం|| కొరకు రెండు బిడ్ల పద్ధతి కొరకు దిగువ సంతకందారుని నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. 1) ఇంటిగ్రేటెడ్ పల్ప్ మరియు పేపర్ మిల్స్ నుండి IS1848:2007 ప్రకారం టైప్ A పేపర్ నందు తయారు చెయ్యబడిన 70 GSM మ్యాప్ లితో పేపరిన్ రీల్స్ యొక్క సరఫరా. 2) పేరొందిన పేపర్ మిల్స్/ ఆథీకృత డీలర్ల నుండి 'వర్జిన్ పల్ప్' నుండి తయారు చెయ్యబడిన షీట్స్ నందు 200 GSM వైట్ ఆర్ట్ కార్డ్ యొక్క సరఫరా. తేది: 04.09.2019న ఉ. 11.00 గం|| నుండి www.tender.telangana.gov.inపై తదుపరి వివరాలు చూడవచ్చు మరియు నేరుగా ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేస్కోవచ్చు. ఆన్‌లైన్‌పై టెండరు ఫారం డౌన్‌లోడ్ చేస్కోనుటకు చివరి తేది మరియు సమయం: 23.09.2019న మ. 3.00 గం||. ఆన్‌లైన్ టెండర్ల దాఖలు కొరకు చివరి తేది మరియు సమయం: 23.09.2019న సా. 4.00 గం||. ఫోన్: 040-23234839
సం/- డైరెక్టర్, తెలంగాణ ప్రభుత్వ టెక్స్ట్ బుక్ ప్రెస్, హైదరాబాద్
DIPR RO. No. 1030-DP/CL/Advt/1/2019-20, Dt: 29/08/2019

అనుబంధం-I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
**8 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) వేలము 2027**

| | |
|---|---|
| మొత్తం | : రూ. **1500.00** కోట్లు |
| జారీ ధర | : ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : 8 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ కాలము | :మొత్తం చేకూరిన వెంటనే ప్రకటన లేకుండా **03-09-2019** వ్యాపార వేళల అనంతరం వెంటనే ముగియగలదు. |

పై రుణము కొరకు తెలంగాణ ప్రభుత్వము చందాలు అభ్యర్థిస్తున్నది. పూర్తి వివరములను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె. రామకృష్ణారావు
ముఖ్య ఆర్థిక కార్యదర్శి
ఆర్థిక శాఖ
DIPR R.O. No. 1022-DP/CL/Advt/1/2019-20, Dt: 29-08-2019


### సీబీడీటీ చైర్మన్ పదవికాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ ప్రమోద్ చంద్ర మోదీ పదవి కాలాన్ని ఏడాది పొడిగిస్తూ గురువారం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్(ఏసీసీ) సమావేశమై ఈ నిర్ణయానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 31న ఆయన పదవి విరమణ చేయాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 1982 ఇండియన్ రెవెన్యూ సర్వీస్(ఆదాయ పన్ను క్యాడర్) అధికారి అయిన మోదీ..ఈ ఏడాది ఫిబ్రవరిలో సీబీడీటీ చీఫ్‌గా నియమితులయ్యారు. అంతకు ముందు సీబీడీటీ చీఫ్‌గా వ్యవహరించిన సుశీల్ చంద్ర ఎలక్షన్ కమిషన్‌కు బదిలీకావడంతో ఆ స్థానంలో మోడీ ఎంపికయ్యారు. అలాగే ఐఆర్ఎస్ అధికారి ప్రభాశ్ శంకర్, పీకే డ్యాష్, అఖిలేష్ రంజన్, నీనా కుమార్‌లను సీబీడీటీ సభ్యులుగా నియమించుకున్నది. అయినప్పటికీ ఇంకా బోర్డులో మరో ఇద్దరికి చోటు ఉన్నది.

### సీజీ పవర్ చైర్మన్ గౌతమ్ తప్పర్‌పై వేటు

#### ఆర్థిక అవకతవకలే కారణం

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ గురువారం తమ వ్యవస్థాపకుడు గౌతమ్ తప్పర్‌ను చైర్మన్‌గా తొలగించింది. ఆర్థిక అవకతవకలు జరిగాయని ప్రకటించిన సంస్థ.. స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించడంతో అందులో కోట్లాది రూపాయల కుంభకోణం వెలుగుచూసింది. దీంతో తప్పర్‌ను తొలగిస్తూ సీజీ పవర్ బోర్డు నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 20న సంస్థలో ఆర్థికపరమైన అక్రమాలు జరిగాయని సీజీ పవర్ వెల్లడించిన విషయం తెలిసిందే. కాగా, అప్పటి నుంచి ఇప్పటిదాకా దీనిపై నోరు మెదపని తప్పర్.. తనపై వేటు నేపథ్యంలో ఎలాంటి మోసం జరుగలేదని, నిధుల గోల్‌మాల్‌కు అవకాశమే లేదని అంటున్నారు. ఈ క్రమంలోనే తనపై చర్యలను ఆయన ఖండించారు. మరోవైపు ఈ వ్యవహారంలో సంస్థ సీఈవో, ఎండీ కేఎన్ నీలకంఠ విచారణను ఇంకా ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇదిలావుంటే శుక్రవారం మరోసారి సమావేశం కానున్న సంస్థ బోర్డు.. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే వీలున్నది. స్వతంత్ర డైరెక్టర్లలో ఒకరు నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్నిక కావచ్చున్న అంచనాలు వినిపిస్తున్నాయి.



సంతానం లేనివారికి చికిత్సను అందించే దేశంలో అతిపెద్ద సంస్థ ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్..హైదరాబాద్‌లో మరో రెండు సెంటర్లను గురువారం ప్రారంభించింది.

# షీలా ఫోమ్ చేతికి స్పానిష్ కంపెనీ

**హైదరాబాద్, ఆగస్టు 29:** స్లీప్‌వెల్ పేరుతో పరుపులను విక్రయిస్తున్న షీలా ఫోమ్ మరో విదేశీ కంపెనీకి కొనుగోలు చేసింది. ఆస్ట్రేలియాకు చెందిన జోయస్ ఫోమ్‌ను కొనుగోలు చేసిన సంస్థ..తాజాగా స్పానిష్‌కు చెందిన ఇంటర్‌ప్లాస్ప్ ఎస్.ఎల్‌ను టేకోవర్ చేసింది. ఈ సంస్థ 11 వేల టన్నుల పాలిథాన్ ఫోమ్, ఫర్నిచర్‌లను తయారు చేస్తున్నది. ఇంటర్‌ప్లాస్ప్ తన ఉత్పత్తులను ఇతర యూరోపియన్, ఉత్తర ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నది. ఈ స్పానిష్ కంపెనీని కొనుగోలు చేయడంతో భారత్, ఆస్ట్రేలియా, స్పెయిన్‌ల నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి సరుకు కోసం కంపెనీ చెల్లింపులు తగ్గనున్నాయి. 42 మిలియన్ల యూరోలకు ఇంటర్‌ప్లాస్ప్‌ను కొనుగోలు చేసినట్లు కంపెనీ ఎండీ రాహుల్ గౌతమ్ తెలిపారు. ఈ నిధులను అంతర్గత వనరులు, బ్యాంకుల వద్ద రుణం తీసుకున్నట్లు చెప్పారు.

# మార్కెట్లోకి చేపల దాణా కొత్త ఉత్పత్తులు

### అన్మోల్ ఫీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశుగ్రాసాల ఉత్పత్తిలో ప్రసిద్ధిచెందిన అన్మోల్ ఫీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ష్రింప్ ఫీడ్, ఫ్లోటింగ్ ఫిష్ ఫీడ్ అనే రెండు ఉత్పత్తులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి తీసుకొస్తున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సరావోగీ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో అన్‌మోల్ ఫీడ్స్ నుంచి ఉత్పత్తయిన లాటిన్ గోల్డ్, మత్స్య బంధు ఉత్పత్తులను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ర్టాల్లో పెద్ద ఎత్తున చేపడుతున్న చేపల పెంపకం అభివృద్ధికి లాటిన్ గోల్డ్ ప్రొటీన్ ఫీడ్, ఫిష్ ఫీడ్ బ్రాండ్ మత్స్యబంధు ఉత్పత్తులు దోహదం చేస్తాయని చెప్పారు. ఈ నెల 30 నుంచి మూడురోజులపాటు జరిగే ఆక్వా అక్వేరియా ఇండియా- 2019 ప్రదర్శనలో అన్‌మోల్ ఫీడ్స్ స్టాల్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ, ఏపీలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రయోజనకరమైన 'నరిచర్' ద్వారా శ్రేష్ఠమైన నాణ్యత కలిగిన ఫీడ్‌తో రైతులకు అధిక లాభాలు అందించడమే తమ సంస్థ లక్ష్యమని స్పష్టంచేశారు.

# అబ్బో.. ఈ మాంద్యం పెద్దదే!

## 18 నెలలుగా కనిపిస్తున్న ప్రభావం

### 2006 నుంచి ఈ స్థాయిలో ఎక్కడా లేని మందగమనం

- 2008 అంతర్జాతీయ మాంద్యం కూడా చిన్నదే
- ప్రస్తుత దేశ ఆర్థిక వ్యవస్థపై గోల్డ్‌మన్ సాచ్స్ ఆందోళన




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ప్రస్తుత ఆర్థిక మందగమనం ఆందోళనకరంగానే ఉన్నది. గడిచిన పదమూడేండ్లలో ఎన్నడూ లేనంతగా దేశ ఆర్థిక వ్యవస్థ సుదీర్ఘకాలం ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. 2008 అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం ప్రభావం కూడా 8 నెలలే అవగా.. ఇప్పుడు తలెత్తినది మాత్రం 18 నెలలుగా కొనసాగుతున్నది. 2008 జూన్ నుంచి 2009 జనవరి వరకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ చిగురుటాకులా వణికిపోయింది. కానీ గతేడాది జనవరిలో మొదలైన ఈ ఆర్థిక మందగమన పరిస్థితులు.. చాప కింద నీరులా విస్తరిస్తూ, ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ గడ్డు పరిస్థితులకు అంతం ఎప్పుడన్నది తెలియకుండగా, ఇప్పట్లో మాత్రం భారత ఆర్థిక వ్యవస్థకు ఉపశమనం లభించబోదని దేశ, విదేశీ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతుండటం తాజా సంక్షోభం తీవ్రతకు అద్దం పడుతున్నది. 2008 మాంద్యం ప్రభావం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరో రెండు పర్యాయాలు కనిపించగా, 2011 ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు, 2012 ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్‌దాకా దాని దుష్పరిణామాలు ఉన్నాయి. చివరకు దేశ చరిత్రలోనే సంచలన ఆర్థిక సంస్కరణగా చెప్పుకుంటున్న పాత పెద్ద నోట్ల రద్దు నిర్ణయం కూడా నాలుగు నెలలే భారత ఆర్థిక వ్యవస్థను బాధించింది. కానీ ఇప్పుడున్న ఆర్థిక మందగమనం.. అన్ని రంగాలనూ కుదేలు చేస్తూ దేశ వృద్ధిరేటును మింగేస్తున్నదని ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ అంటున్నది. వినియోగ సామర్థ్యం తీవ్రంగా బలహీనపడిందని, దీనివల్ల ఆటో, నిర్మాణ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాలు దారుణంగా పడిపోయాయని చెబుతున్నది.

#### అతిగా ఊహిస్తున్నారా?

అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు, బ్రోకరేజీలు దేశ ఆర్థిక వ్యవస్థపై అతిగా ఆందోళన చెందుతున్నాయా?.. వాస్తవ పరిస్థితులు ఇంత భయంకరంగా లేవా?.. ప్రస్తుత ఆర్థిక మందగమనం కొన్ని కీలక రంగాల్లో కొనసాగుతున్న పరిణామమేనా?.. అంటే అవునని అంటున్నాయి కేంద్ర ప్రభుత్వ వర్గాలు. ఎస్బీఐ నివేదిక సైతం ఈ మాంద్యాన్ని దాదాపు అలాగే అభివర్ణిస్తుండటం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో దిగజారిన కొనుగోళ్ల శక్తి మందగమనానికి బలాన్నిస్తున్నదన్న ఎస్బీఐ.. ఆసియా-పసిఫిక్ దేశాల్లో ఆటో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవని, ఆ ప్రభావం భారత్‌పైనా పడి ఉండవచ్చని వ్యాఖ్యానిస్తున్నది. ఎఫ్ఎంసీజీ రంగంలో చోటుచేసుకున్న మందగమన ఛాయల్నీ.. అంతకుముందు ఎక్కువగా నమోదైన వృద్ధితో పోల్చడం వల్లేనని, చిన్నచిన్న సంస్థల ఉత్పత్తులకు వినియోగదారులు ప్రాధాన్యం ఇస్తుండటంతో భారీ సంస్థల ఆదాయం పడిపోయిందని చెప్పుకొచ్చింది. అయితే వృద్ధికి దోహదం చేసే 33 సూచీల్లో 17 బాగున్నాయని మార్చిలో కనిపిస్తే.. జూన్‌లో ఇవి 9కి తగ్గుముఖం పట్టాయని ఎస్బీఐ చెప్పడం గమనార్హం. ఇక కేంద్రానికి ప్రిన్సిపల్ ఎకనామిక్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్న సంజీవ్ సన్యాల్.. ఈ మందగమనాన్ని ఆర్థిక సంక్షోభంగా చూడవద్దని, 2008 లేమన్ బ్రదర్స్ సంక్షోభం స్థాయిది కాదని అన్నారు.

### దీనికి అంతం ఎప్పుడు?

**ఈ** ఆర్థిక మందగమనం.. వచ్చే ఏడాది మార్చికల్లా తగ్గే వీలుందని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. వాటి ప్రభావం తక్షణమే ఉండబోదంటున్న ఆర్థిక రంగ నిపుణులు.. నెమ్మదిగా వాటి ఫలాలు అందుతాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వినియోగదారుల్లో కొనుగోళ్ల సామర్థ్యం పెరిగినప్పుడే మాంద్యం ప్రభావం నుంచి బయటపడగలమని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు వచ్చే ఏడాది ఆఖర్లోగానీ, 2021 ఆరంభంలోగానీ ప్రపంచ ఆర్థిక మాంద్యం మొదలు కానుందని, దాని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపైనా పడుతుందని ఓ బ్రోకరేజీ సంస్థ చీఫ్ హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఇండియా రేటింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను దేశ జీడీపీ అంచనాను 7.3 శాతం నుంచి 6.7 శాతానికి కుదించింది. మూడీస్ కూడా 6.4 శాతానికి పరిమితం చేసింది. ఈ ఏప్రిల్-జూన్ వృద్ధిరేటూ ఐదేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 5.7 శాతంగానే ఉండొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.



పంచ నారసింహ దివ్యక్షేత్రమైన యాదాద్రి సాయం సంధ్య వేళ లో లేలేత గులాబీ వర్ణంలో ప్రకాశిస్తున్న అపూర్వ దృశ్యమిది. అప్పుడప్పుడే అస్తమిస్తున్న సూర్యుడు తన వెలుగురేఖలతో యాదాద్రి కొండను ఆవరించినట్లుగా కనిపిస్తున్నది. చూసినకొద్దీ చూడాలనిపిస్తున్న ఈ దృశ్యం గురువారం సాయంత్రం ఆవిష్కారమైంది.

## సెప్టెంబర్‌లో ప్రొస్టేట్ వ్యాధిపై అవగాహన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తరచూ మూత్రం రావడం ప్రొస్టేట్ వ్యాధికి సంకేతమని, పురుషుల్లోనే వచ్చే ఈ వ్యాధిపై సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) హైదరాబాద్ చైర్మన్ డాక్టర్ సీ మల్లికార్జునరావు, ప్రొఫెసర్ డాక్టర్ పీసీ రెడ్డి తెలిపారు. గురువారం సోమాజిగూడలో మీడియాతో మాట్లాడుతూ పురుషుల్లో మూత్రనాళం వద్ద ప్రొస్టేట్ గ్రంధి ఉంటుందని, ఇది వయస్సుతోపాటు పెరుగుతుందని తెలిపారు. దేశంలో ప్రతి ఐదుగురిలో ఇద్దరు ప్రొస్టాటిక్ హైపర్ ప్లాసియా (బీపీహెచ్) కారణంగా దిగువ మూత్రనాళ సమస్యతో బాధపడుతున్నట్టు తెలిపారు. 40 ఏండ్లలోపు వయసువారిలో ప్రొస్టేట్ గ్రంథి పెరుగుదల ప్రారంభమవుతుందని, 60 ఏండ్లలోపువారిలో 50శాతం పెరుగుతుందన్నారు. ఈ వ్యాధికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అవగాహన లేక అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు.

# నేటినుంచి ఆక్వా అక్వేరియా సదస్సు

- ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి
- హైటెక్స్‌లో మూడ్రోజులపాటు నిర్వహణ
- సముద్ర ఉత్పత్తుల వినియోగ ప్రోత్సాహానికి కేంద్రం చర్యలు: ఎంపీఈడీఏ చైర్మన్ కేఎస్ శ్రీనివాస్



హైటెక్స్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీఈడీఏ చైర్మన్ కేఎస్ శ్రీనివాస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సముద్ర తీరంలేని రాష్ట్రాల్లో సముద్ర ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపీఈడీఏ) చైర్మన్ కేఎస్ శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు హైదరాబాద్ హైటెక్స్ కేంద్రంగా ఎంపీఈడీఏ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు ఆక్వా అక్వేరియా ఇండియా - 2019 ప్రదర్శనను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రదర్శన ఏర్పాట్లపై గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రదర్శనను ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు శుక్రవారం ప్రారంభిస్తారని చెప్పారు. తెలంగాణలో మత్స్య సంపద అభివృద్ధికి, శిక్షణాకేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వంతో ఎంపీఈడీఏ హేచరీస్ ఒప్పందం చేసుకున్నదన్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీని ఏర్పాటుచేస్తామని శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం 'ఆర్టీమియా' అనే చేపల ఆహారాన్ని, మనదేశం దిగుమతి చేసుకుంటున్నదని, దీనిని రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్ అభివృద్ధి చేసిందని తెలిపారు. మూడ్రోజుల ప్రదర్శనకు వివిధ దేశాల నుంచి 5000 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. 200 స్టాళ్లలో ఆక్వాకల్చర్‌కు సంబంధించిన సాంకేతిక, ఇతర అంశాలుంటాయని చెప్పారు. చేపలు, రొయ్యలతోచేసిన వివిధ రకాల వంటకాలను 'సీ ఫుడ్ ఫెస్టివల్' పేరిట ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన వివరించారు. తెలంగాణ మత్స్యశాఖ కమిషనర్ డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ.. దాదాపు వెయ్యి హెక్టార్లలో తెలంగాణలో చేపల పెంపకాన్ని చేపడుతున్నామని, రిజర్వాయర్లలో, చెరువుల్లో కూడా చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఉచిత చేపపిల్లల పంపిణీతో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు.

# రేపు కీసరకు ఎంపీ సంతోష్ రాక

- రిజర్వ్‌ఫారెస్ట్‌లో హరితహారంపై కలెక్టర్ డాక్టర్ ఎంవీ రెడ్డి సమావేశం

**మేడ్చల్ కలెక్టరేట్:** కీసరగుట్ట రిజర్వ్‌ఫారెస్ట్‌లో మొక్కలు నాటేందుకు ఎంపీ సంతోష్‌కుమార్ ఈనెల 31 కీసరగుట్టకు రానున్నారు. హరితహారంలో భాగంగా 10వేల మొక్కలు నాటనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ ఎంవీ రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వ్ ఫారెస్ట్‌లో 10 వేల మొక్కలు నాటేందుకు 15 స్థలాలను గుర్తించినట్టు తెలిపారు. మొక్కలు నాటేందుకు తీసిన గుంతల్లో ఎర్రమట్టి, ఎరువులు కలిపి వేయాలని, మొక్కలు నాటిన వెంటనే నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అటవీప్రాంతానికి సంబంధించిన నక్షాను తయారుచేయాలని, ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. 15 కళాశాలల నుంచి వెయ్యి మంది, 8,9 తరగతుల విద్యార్థులు వెయ్యి మంది, ఐదువేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు, మరో వేయిమంది మహిళ గ్రూప్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, వారికి టోపీలు, ఆకుపచ్చ కండువాలు అందించనున్నట్టు తెలిపారు. అధికారులు బృందాలుగా ఉండి మొక్కలు నాటించాలని, విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలని సూచించారు.

# నేటినుంచి మెట్రోస్టేషన్లలో స్నాక్స్ ఫెస్టివల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్లలో శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు అంతర్జాతీయ స్నాక్స్ ఫెస్టివల్ నిర్వహించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్), తెలంగాణ టూరిజంశాఖ సిద్ధమైంది. ఉప్పల్, అమీర్‌పేట, హైటెక్ సిటీ, ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్లలో మధ్యాహ్నం మూడునుంచి రాత్రి 9 గంటల వరకు ఫెస్టివల్ ఉంటుంది. గత సంక్రాంతి సమయంలో నిర్వహించిన స్వీట్ ఫెస్టివల్ విజయవంతమైన స్ఫూర్తితో తొలిసారిగా మెట్రో స్టేషన్లలో అంతర్జాతీయ స్నాక్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ మెట్రో, ఎల్‌అండ్‌టీ, తెలంగాణ పర్యాటకశాఖ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. మహిళల వంటకాల ప్రదర్శనకు, విక్రయానికి ఇదొక చక్కని వేదికని, మహిళా సాధికారతకు మార్గమని పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## 3,500 మొక్కలు నాటిన టీఎస్‌టీడీసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) గురువారం శామీర్‌పేట లేక్‌వ్యూ రిసార్టు వద్ద హరితహారం నిర్వహించింది. టీఎస్‌టీడీసీ చైర్మన్ భూపతిరెడ్డి, ఎండీ మనోహర్ మొక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిబ్బంది, ఉద్యోగులు కలిసి 3,500 మొక్కలు నాటినట్టు సంస్థఒ కప్రక టనలోతెలి పింది.

## నేడు హైకోర్టులో హరితహారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో హైకోర్టులో శుక్రవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మేనేజ్‌మెంట్ రిజిస్ట్రార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ-బ్లాక్‌లో నిర్వహించే కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పాల్గొంటారని, న్యాయవాదులు, ఉద్యోగులకు మొక్కలు పంపిణీ చేస్తామనితె లిపారు.

## రుణం ఇస్తామంటూ రూ.4.75 లక్షలు హాంఫట్

- టీచర్‌ను మోసంచేసిన సైబర్ మాయగాళ్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద రూ.10లక్షల రుణం మంజూరుచేస్తామంటూ సైబర్ మాయగాళ్లు ఓ టీచర్‌ను మోసంచేశారు. ఐదునెలల్లో రూ.4.75 లక్షలు వసూలుచేశారు. 'పీఎంఈజీపీ కింద మీకు రూ.10లక్షల రుణం మంజూరైంది. కేవలం ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతానంబర్లు ఇస్తే సరిపోతుంది' అని రాచకొండ సైబర్ క్రైం పోలీసు కమిషనరేట్ పరిధిలో నివసిస్తున్న ఓ ఉపాధ్యాయురాలికి ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫోన్ వచ్చింది. తర్వాత రిజిస్ట్రేషన్ ఫీజు అని మొదలుపెట్టిన సైబర్‌మాయగాళ్లు.. మొత్తం పదిమంది వేర్వేరుగా మాట్లాడారు. పది ఖాతా నంబర్లు ఇచ్చి ఈనెల 16 వరకు రూ.4.75 లక్షలు వసూలుచేశారు. రుణం రాకపోవడం, మరింత డబ్బు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి సైబర్‌క్రైం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఉత్తరాదికి చెందిన ముఠా మోసానికి పాల్పడిఉ ంటుందనిఅ నుమానిస్తున్నారు.

## గవర్నర్ పరామర్శ



మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ సికింద్రాబాద్ సన్‌షైన్ దవాఖానలో కీలు మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సతీమణి సుప్రియా హరిచందన్‌ను గురువారం పరామర్శిస్తున్న తెలంగాణ గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ దంపతులు. -బేగం పేట

## పశుసంవర్ధకశాఖ సంచాలకుడిగా లక్ష్మారెడ్డి

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సంచాలకుడిగా డాక్టర్ వీ లక్ష్మారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గొర్రెలు-మేకల అభివృద్ధి ఫెడరేషన్ ఎండీగా ఉన్న ఆయన గురువారం పశుసంవర్ధకశాఖ కేంద్ర కార్యాలయంలో సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు.






# పిల్లల కోసం.. ఆర్గ్గానిక్!



పిల్లల బట్టలు మెత్తగా ఉండాలి.. గుచ్చుకొని ఉండే ఫ్యాబ్రిక్స్ కాకుండా.. కంఫర్ట్‌నిస్తూనే స్టైలిష్‌గా కనిపించాలి.. అందులో ఆర్గ్గానిక్ ఫ్యాబ్రిక్స్ అయితే.. పిల్లలు మరింత సంతోషంగా ఉంటారు.. ఆర్గ్గానిక్ కాటన్.. మెత్తగా ఉండే రాసిల్క్‌లతో.. హెవీ డిజైన్లు కాకుండా.. సింపుల్‌గా.. స్వీట్‌గా డిజైన్ చేసిన బట్టలివే..







**రితీషా సతీష్‌రెడ్డి**
ఈశా డిజైనర్ హౌస్
సుచిత్రా, హైదరాబాద్
ఫోన్ : 8500767476
https://www.facebook.com/eshadesignerworks/



**1** డిఫరెంట్‌గా ట్రై చేయాలనుకునేవాళ్లు ఈ డ్రెస్ ఎంచుకోండి. ప్యారెట్ గ్రీన్ కలర్ రాసిల్క్‌తో స్కర్ట్ కుట్టాం. బటర్ ఫ్లై ప్రింట్ వచ్చిన సీ బ్లూ కలర్ రాసిల్క్‌ని షర్ట్‌లా డిజైన్ చేశాం. మెగా స్లీవ్స్ దీని అందాన్ని రెట్టింపు చేసింది. షర్ట్‌కి స్కర్ట్ ఫ్యాబ్రిక్‌ని కాలర్‌గా అటాచ్ చేశాం. స్కర్ట్‌కి డోంగ్రే స్టైల్ బెల్ట్ అదనపు ఆకర్షణగా నిలుస్తున్నది.

**2** యెల్లో కలర్ రాసిల్క్ మీద మిర్రర్ వర్క్‌తో టాప్ కుట్టాం. మధ్యలో గెల్డ్ జరీ వర్క్‌తో నింపేశాం. బ్లూ కలర్ రాసిల్క్‌తో ధోతీ పైజామా డిజైన్ చేశాం. ఈ రెండింటికీ పూర్తి కాంట్రాస్ట్‌గా ఉండాలని స్కై బ్లూ కలర్ నెట్ ఫ్యాబ్రిక్‌ని కోట్‌లా కుట్టాం. దీని మీద ముత్యాలు, జరీతో అక్కడక్కడా బుటీస్ ఇవ్వడంతో సూపర్‌గా మెరిసిపోతున్నది.

**3** ఆర్గ్గానిక్ బ్లూ కాటన్ ఫ్యాబ్రిక్ ఇది. దీన్ని పొట్టి గౌనులాగా డిజైన్ చేశాం. 3/4 హ్యాండ్స్‌తో, గుబురుగా ఉండడానికి క్యాన్ క్యాన్ ఇచ్చాం. ఇక్కత్ కాటన్‌తో స్లీవ్ లెస్ ఓవర్ కోట్‌తో సింపుల్ లుక్‌తో అదిరిపోతుంది.

**4** ఆరెంజ్ రా సిల్క్ ఫ్యాబ్రిక్‌తో లాంగ్ గౌన్ కుట్టాం. దీనికి కింద వైపు ప్రింటెడ్ రాసిల్క్ ఫ్యాబ్రిక్‌ని బార్డర్‌గా అటాచ్ చేశాం. ఈ ఫ్యాబ్రిక్‌నే పైన వైపు కూడా అటాచ్ చేశాం. ఆరెంజ్ కలర్ రాసిల్క్ లాంగ్ స్లీవ్స్‌కి ప్రింటెడ్ ఫ్యాబ్రిక్‌ని ప్లీట్స్‌తో స్లీవ్స్ కుట్టాం. తెల్లని సిల్క్ రిబ్బన్‌తో చేసిన పువ్వు ఈ డ్రెస్‌కి అదనపు ఆకర్షణ.

**5** ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లు ఉంది ఈ డ్రెస్. బెల్ బాటమ్ ప్యాటర్న్‌తో ప్యాంట్‌ని డిజైన్ చేశాం. ఆకుపచ్చని బెనారస్ ఫ్యాబ్రిక్‌ని ప్యాంట్‌గా ఎంచుకున్నాం. ఇక రాసిల్క్ ఫ్యాబ్రిక్‌తో టాప్ కుట్టాం. దీని మీద మొత్తం సీక్వెన్స్, జరీతో ఫుల్‌గా వర్క్ ఇచ్చాం. ఒక వైపు స్లీవ్‌లెస్, మరోవైపు.. మెగా స్లీవ్స్ స్టైలిష్ లుక్‌ని తీసుకొచ్చింది.

---

## ఆపరేషన్ ద్వారా గూని పోతుందా?

**మా అబ్బాయి వయసు 17 సంవత్సరాలు. గత కొంతకాలంగా నడుము నొప్పితో బాధ పడుతున్నాడు. అంతేకాకుండా నడుము కూడా వంగినట్లు అనిపిస్తుంది. డాక్టర్‌ను సంప్రదించగా కొన్ని పరీక్షలు చేశారు. నడుము ముందుకు వంగడం వల్ల ఇలా అవుతుంది. దీనినే గూని అంటారని చెప్పారు. గూని వల్ల వెన్నునొప్పి కూడా వస్తుందన్నారు. ఇటీవల సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను మళ్లీ సంప్రదించగా ఆపరేషన్ చేయాలన్నారు. మాకు భయంగా ఉంది. నడుముకు ఆపరేషన్ సాధ్యమవుతుందా? ఒకవేళ చేస్తే ఆపరేషన్ ద్వారా గూని పోతుందా, దయచేసి తెలుపగలరు.**

**- రాధిక, వరంగల్**



గూని సమస్య ఈ రోజుల్లో పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్నది. మగపిల్లల్లో అయితే ఇంకా ఎక్కువ. యుక్తవయసులోకి వచ్చేసరికి ఇది తీవ్ర సమస్యగా మారుతుంది. దీనినే scheuermann's kyphosis disease అంటారు. సాధారణంగా నొప్పి లేకుండా ఉంటే ఈ గూనికి ఆపరేషన్ చేయాల్సిన అవసరం లేదు. కానీ కొంతమందిలో నొప్పి ఉంటుంది. మందులు వాడినా తగ్గదు. గూని కూడా పెరుగుతుంది. మీ అబ్బాయి విషయంలో కూడా ఇలాంటిదే జరుగుతుందనిపిస్తున్నది. కాబట్టి ఆపరేషన్ తప్పనిసరి చేయించాల్సిన అవసరం ఉంది. మీకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. గూనికి ఆపరేషన్ సురక్షితమే. ఆలస్యం చేయకుండా ఆపరేషన్ చేయించండి.



**డాక్టర్ జీపీవీ సుబ్బయ్య**
కన్సల్టెంట్ స్పైన్ సర్జన్
కేర్ హాస్పిటల్, హైటెక్‌సిటీ

---



జుట్టుమీద ప్రేమ ఉండని వారుండరు. ప్రతిరోజూ ఫ్రెష్‌గా కనిపించడం కోసం తలస్నానం చేసేవారు కొందరయితే.. పొడిబారుతుందని, జిడ్డుగా మారిందని తలస్నానం చేసేవారు కొందరు. అయితే జుట్టు రకాన్ని బట్టి ఎన్నిరోజులకు తలస్నానం చేయలో తెలుసా?

## జుట్టునిబట్టి తలస్నానం!

**ఆయిల్ జుట్టు :** జుట్టు ఆయిల్‌గా ఉన్నవారు వారంలో ఎక్కువసార్లు చేయడం వల్ల వెంట్రుకలకు సరైన పోషకాలు, ప్రొటీన్ అందక జుట్టుకు నష్టం కలుగుతుంది. తలస్నానం తర్వాత కొంత సిరం, నూనె అప్లై చేయడం అలవాటు చేసుకోండి.

**పొడిబారిన జుట్టు :** ఇలా ఉంటే జుట్టుకు కావలసిన తేమ లేదని అర్థం. కాబట్టి వారంలో మూడు రోజుల విరామంతో తలస్నానం చేయాలి. స్నానానికి రెండు గంటల ముందు జుట్టుకు నూనె రాయడం మరువవద్దు.

**మందపాటి జుట్టు :** ఇలాంటి జుట్టున్న వారు వారాకోసారి తలస్నానం చేయడం ఉత్తమం. మందపాటి జుట్టుకు నూనె రాసినప్పుడు విస్తరించడానికి సమయం పడుతుంది. కాబట్టి జుట్టు అంతా తొందరగా జిడ్డుగా కనబడదు.

**దట్టమైన జుట్టు :** ఈ రకం జుట్టుగల వారిలో జిడ్డు మూలాలు ఎక్కువగా కనబడుతాయి. అందువల్ల ప్రతిరోజూ తలస్నానం చేయాలన్న ఆలోచన చేస్తుంటారు. ఇలా చేస్తే జుట్టు చివర్లు పొడవుతాయి. ఇలాంటి వారు వారానికి రెండుసార్లు చేస్తే సరిపోతుంది.

**ఉంగరాల జుట్టు :** ఈ జుట్టు చూసేందుకు అందంగా ఉన్నా దీన్ని నిర్వహించడం కష్టమే. వంకర్లు తిరిగి ఉన్న జుట్టు కుదుళ్ల వద్ద జిడ్డుగా గాని పొడిగా గాని ఉంటుంది. కాబట్టి మూడు రోజులకు ఒకసారి తలస్నానం చేస్తే సరి. అట్లాగే సాధారణ జుట్టున్న వారు ప్రతి మూడు రోజులకోసారి తలస్నానం చేయవచ్చు.

### వంటింటి చిట్కాలు



జీలకర్ర మంచిదా, నకిలీదా అని తెలుసుకోవడానికి కొద్దిగా జీలకర్రను రెండు చేతుల మధ్య నలపండి. చేతికి రంగు అంటితే అది నకిలీదే.

- శనగపిండిలో బియ్యపుపిండి కలుపుతుంటారు. దీనిలో కొంచెం నీరు కలిపితే.. నీటి రంగు ఎరుపులోకి మారితే ఆ పిండి కల్తీ అని అర్థం.
- చక్కెరలో సుద్దముక్కల పొడి, బొంబాయి రవ్వ కలుపుతుంటారు. చక్కెరను నీటిలో వేస్తే కరుగుతుంది. అడుగున రవ్వ కనిపించినా నీరు తెల్లగా కనిపించినా అది కల్తీనే.
- వనస్పతిలో సామాన్యంగా గంజిపొడి, ఉడికిన బంగాళదుంపను కల్తీ చేస్తుంటారు. దీనికి కొద్దిగా అయోడిన్ కలిపితే నీలిరంగుగా మారితే కల్తీ జరిగినట్లుగా గుర్తించాలి.
- వెన్నలో, నెయ్యిలో కల్తీ జరిగిందో లేనిదో తెలుసుకోవాలంటే వాటిలో కొద్దిగా హైడ్రోక్లోరిక్ ఆమ్లం, చక్కెర మిశ్రమాన్ని కలుపాలి. 5 నిమిషాల తర్వాత నెయ్యి, వెన్నకు ఎరుపు రంగు వస్తే అది కల్తీగా భావించాలి.

---



## సాహో.. జోషి!

**పీవీ సింధును ఇప్పుడు అందరూ ఘనంగా సన్మానిస్తున్నారు. కానీ ఆమె కంటే ముందు ఈ దేశ పతాకాన్ని మరింత గర్వపడేలా చేసింది మానసి జోషి. ఆమె గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. ఆమె ప్రపంచ పారా బ్యాడింట్మన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తొలి క్రీడాకారిణి.**

**ఆగస్టు 25 ఆదివారం:** స్విట్జర్లాండ్, బాసెల్ నగరం, సెయింట్ జాకబ్స్‌హాలె ఇండోర్ స్టేడియం– ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పీవీ సింధుకు గోల్డ్ మెడల్.
**ఆగస్టు 24 శనివారం :** అదే దేశం, అదే స్టేడియం, ప్రపంచ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మానసి జోషికి గోల్డ్ మెడల్. **ఇద్దరి కోచ్ :** పుల్లెల గోపీచంద్

షట్లర్ పీవీ సింధు పోరాడిన ఆ స్టేడియంలోనే ఒకరోజు ముందే మన భారత మరో షట్లర్ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఆమె ఆత్మస్థయిర్యాన్ని మాత్రం కోల్పోలేదు. ఎముకలు విరిగినా ఆమె మాత్రం పట్టు విడువలేదు. కృత్రిమ కాలుతో బ్యాడ్మింటన్‌లో పాల్గొన్నది. ఆమె టోర్నీల్లో ఆడడం వెనుక పెద్ద కష్టమే ఉంది. ముంబైకి చెందిన మానసి జోషి తన 6 ఏండ్ల వయస్సులోనే షటిల్ పట్టుకుంది. బ్యాడ్మింటన్‌లో అంచెలంచెలుగా ఎదిగింది. 2011లో ముంబైలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో ఎముకలు విరిగిపోయి, ఎడమ కాలును పూర్తిగా కోల్పోయింది. ప్రమాదం జరిగిన మూడు గంటలకు ఆమెను ఆస్పత్రికి తరలించారు. సుమారు పది గంటలు చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు వైద్యులు. ఆ తర్వాత ఆమె పరిస్థితులు మారిపోయాయి. అయినా ఆమె నాలుగు గోడల మధ్య బతకాలనుకోలేదు. బ్యాడ్మింటన్‌లో తన భవిష్యత్‌ను సాకారం చేసుకోవాలనుకుంది. కృత్రిమ కాలుతో బ్యాడ్మింటన్ కోర్టులోకి అడుగు పెట్టింది. 2014 పారా బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లోకి దిగి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. అట్లాగే మొన్న జరిగిన పోటీల్లో కూడా పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. ఈ పోటీలకు రెండు నెలల ముందే మానసి గోపీచంద్ అకాడమీలో చేరింది. హైదరాబాద్‌లోనే శిక్షణ పొందింది. పారా బ్యాడ్మింటన్‌లో పాల్గొని విజయం సాధించి సంచలనంగా మారింది. ఇప్పుడు పారా ఒలింపిక్స్‌లో కూడా పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 30 ఆగస్టు 2019

## ఎవరేమన్నారు?



పెన్సిలిన్‌ను ప్రకృతే తయారుచేసింది. నేను కేవలం దానిని కనుగొన్నాను, అంతే!

**-అలెగ్జాండర్ ఫ్లెమింగ్**

స్కాట్లాండ్ జీవ, భౌతిక శాస్త్రవేత్త

* జయంతి: ఆగస్టు 6,
జీవితకాలం: 1881–1955

# అత్యంత మహాభారీ కాలబిలం!

**విశ్వదర్శనం**

స్థానిక విశ్వంలోనే అత్యంత మహాభారీ కాలబిలాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. మన సూర్యునికన్నా 40 బిలియన్ (4,000 కోట్లు) రెట్లు అధిక ద్రవ్యరాశిని ఇది కలిగి ఉన్నట్టు వారు వెల్లడించారు.



సెటస్ నక్షత్ర సమూహాల కూటమి (Cetus constellation) కి 700 మిలియన్ (70 కోట్లు) కాంతి సంవత్సరాల దూరంలో, 'ఎబెల్ 85' (Abell 85) తారామండల కేంద్రంలో కొలువై వున్న మహోన్నత కాలబిలం 'హోల్మ్‌బెర్గ్ 15ఏ' (Holmberg 15A) స్థానిక విశ్వంలోనే అత్యంత భారీ ద్రవ్యరాశి (Ultramassive) ని కలిగిఉన్నట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇంత భారీ ద్రవ్యరాశితో కూడిన కాలబిలాన్ని కనుగొనడం ఇదే మొదటిసారిగానూ వారు చెబుతున్నారు. మన పాలపుంత కేంద్రంలోని మహాకాలబిలం కేవలం 4 మిలియన్ (400 లక్షలు) సూర్యుళ్ల ద్రవ్యరాశిని మాత్రమే కలిగిఉంది. 'ఎబెల్ 85' తారామండలంలో మొత్తం 500 గెలాక్సీలు (నక్షత్రమండలాలు) ఉన్నట్టు వారు చెబుతున్నారు. జర్మనీలోని మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ ఫిజిక్స్, యూనివర్సిటీ అబ్జర్వేటరీ మ్యూనిచ్‌లకు చెందిన పరిశోధకులు దీనిని కనుగొనగా, 'ఆస్ట్రో ఫిజికల్' జర్నల్‌లో ఈ విశేషాలు త్వరలో ప్రచురితం కానున్నాయి.

---

**వాతావరణ సమతుల్యత కోసం ప్రకృతి ప్రేమికులు ఒకవైపు భూమాతకు హరితహారాలు వడుతుంటే మరోవైపు మరెవరి వల్లో అడవులు అంటుకొంటున్నాయి. ఆఖరకు అమెజాన్, కాంగో బేసిన్ వంటి మహారణ్యాలు సైతం ప్రతి ఏడూ వారాల తరబడి మండిపోతున్నాయి. ఫలితంగా ఎన్ని జీవజంతువృక్ష జాతులు సజీవ దహనమవుతున్నాయో లెక్కలేదు. దీనికంతటికీ కారణం మనిషే కదా?**

# హరితోదయం!



## కార్చిచ్చులు ఆగి పచ్చదనం ఉదయించేదెప్పుడు?

**మనిషి** ఎంత నిర్దయుడంటే కన్నతల్లిని సైతం గాలికి వదిలేసేంత! స్వార్థ సంకుచితాలు మనుషుల్ని ఎంత అజ్ఞానుల్ని చేస్తాయంటే తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కునేంతగా! భూమాత రోదననే పట్టించుకోని మానవులు అడవితల్లి వేదనను మాత్రం వింటారా? విచక్షణ, విజ్ఞత, దయాదాక్షిణ్యాలు లేని పాలకులు ఉన్నంత కాలం ఆయా దేశాల ప్రజల్లో ఆశావహ మార్పు రాకపోగా, మరింత అధ్వాన్నస్థితికి దిగజారుతుంటారు. ఆర్థిక పెరుగుదలనే అసలైన ఎదుగుదలగా భావించే వారికి బుద్ధిమాటలు సహించవు. ప్రపంచంలోనే అతిపెద్ద అడవి అయిన అమెజాన్‌కే దిక్కు దివాణం లేకుండా పోయిందంటే ఇంతకంటే దయనీయ స్థితి మరొకటి ఉండదు.

ఏటా ఏదో ఒక సందర్భంలో ఎక్కడో ఒకచోట అగ్గి మండి తర్వాత మంటలు చెలరేగినా, అవి తర్వాత కొన్నాళ్లకే అదుపులోకి వస్తుంటాయి. కానీ, ఈసారి ఎన్నడూ లేనంత స్థాయిలో అమెజాన్ గత మూడు వారాలుగా మండుతూనే ఉంది. కార్చిచ్చు అదుపులోకి రాకపోగా, మంటలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగోలీస్ బేసిన్ వర్షారణ్యంలోనూ పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు వార్తలు వచ్చాయి.

ప్రపంచంలోనే అతిపెద్ద అడవి అమెజాన్ (బ్రెజిల్), దాని తర్వాత రెండోస్థానంలో అంత పెద్దదైన కాంగోలీస్ (మధ్యాఫ్రికా) రెండూ అత్యంత దట్టమైన వర్షారణ్యాలే. ముఖ్యంగా అమెజాన్ అయితే అనేక వనమూలికలు, అరుదైన వృక్షపక్షిజంతు జాతులకు నిలయమని అంటారు. సుమారు 30,000 వృక్షజాతులు, 25 లక్షల కీటకజాతులు, 1500కు పైగా పక్షిజాతులు, 550 వరకు సరీసృపాలు (పాములు వంటి పాకుడు జంతువులు) ఉన్నట్టు వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ అంచనా. అత్యంత విశిష్ఠ (ఐకానిక్) జాతులుగా చెప్పే జాగ్వర్ (మచ్చల చిరుతపులి), టాపిర్ (పంది ఆకారంలో ఉండే పెద్ద శాఖాహార క్షీరద జంతువు), పింక్ రివర్ డాల్ఫిన్, హార్పీ ఈగుల్ (చాలా పెద్దసైజు డేగ) వంటి వాటికి ఈ అడవినే పేరొందింది.

మొత్తం 9 దేశాలలో సుమారు 27 లక్షల చ.మై. మేర విస్తరించిన అమెజాన్ మహారణ్యంలో 21 లక్షల చ.మై. ప్రాంతం పూర్తిగా వర్షారణ్యాలే. భూమిమీది మొత్తం వర్షారణ్యంలో సగం దీని కిందికే వస్తుంది. ఒక్క బ్రెజిల్‌లోనే 60 శాతం అమెజాన్ అడవి వ్యాపించి ఉండడం విశేషం. ఇంత పెద్ద మొత్తంలో భూభాగాన్ని ఆక్రమించింది కాబట్టే, దీనిని భూమికి ఊపిరితిత్తులు (lungs of the Earth) గా వ్యవహరిస్తారు. రెండో ఊపిరితిత్తిగా మధ్యాఫ్రికాలోని కాంగో బేసిన్ మహారణ్యాన్ని పేర్కొంటారు. అమెజాన్‌లో ఇప్పటికీ మనిషి చేరుకోని ప్రాంతాలు ఎన్నో ఉన్నాయంటారు.

ప్రస్తుత 'బ్రెజిల్‌లోని అమెజాన్ మహావర్షారణ్య కార్చిచ్చు' పర్యావరణవేత్తలు భయపడుతున్నంత పనిచేసింది. ఆ పెను మంటల్లోంచి ప్రమాదకరమైన విషవాయువు 'కార్బన్ మోనాక్సైడ్' (Carbon Monoxide–CO) మేఘాలు పెద్ద ఎత్తున వాతావరణంలోకి వ్యాపిస్తున్నాయని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) శాస్త్రవేత్తలు తాజాగా ప్రకటించారు. ఈనెల (ఆగస్టు) 8 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేకించి బ్రెజిల్ ప్రాంతంలోని అమెజాన్ మంటలలోంచి అదే పనిగా ఈ విషవాయువు మేఘాలు ఆకాశంలో వ్యాపిస్తున్నట్టు వారు కనుగొన్నారు. 'నాసా'కు చెందిన అక్వా (Aqua) ఉపగ్రహంలోని ఎఐఆర్ఎస్ (AIRS: Atmospheric Infrared Sounder) పరికరం అందించిన ఛాయాచిత్రాల ఆధారంగా వారు పై విషయాన్ని గుర్తించారు.

అమెజాన్ మహారణ్యంలోని మంటల్లోంచి ఇంత తీవ్రస్థాయిలో ఈ వాయువు వెలువడడం ఆశ్చర్యకరమని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూమి నుంచి సుమారు 18,000 అడుగుల (5,500 మీ) ఎత్తున ఈ విషవాయువు మేఘాలు విస్తరించి ఉన్నాయని 'నాసా' శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ మేరకు ఉపగ్రహ చిత్రాలను 'నాసా' విడుదల చేసింది కూడా. అయితే, అంత ఎత్తున ఉన్న కారణంగా ఆ విషవాయువుల నుంచి ప్రజలకు, జీవజాతులకు పెద్దగా ముప్పు ఉండదని కూడా వారన్నారు. కానీ, బలమైన గాలులు వీచి, ఆ మేఘాలు కనుక భూమి ఉపరితలం వైపు ఇంకా తక్కువ ఎత్తుకు దిగితే మాత్రం ప్రమాదమేనని వారు అంటున్నారు. కాకపోతే, సహజంగానే ఇలాంటి విషవాయువులు ఒక నెల రోజుల్లో అక్కడ్నించి కనుమరుగు కాగలవని వారు భావిస్తున్నారు. వాతావరణ కాలుష్య కారక వాయువుల్లో ప్రత్యేకించి జీవజాతుల ప్రాణాలతో చెలగాట మాడే విషవాయువులలో కార్బన్ మోనాక్సైడ్ (CO) ఒకటి. ఇది ప్రధానంగా డీజిల్, పెట్రోల్ తదితర శిలాజ ఇంధనాల ఉద్గారాలు, అగ్నిపర్వతాల లావానుండి వెలువడుతుంటుంది.

కార్బన్ మోనాక్సైడ్ రంగు, రుచి, వాసన లేని విషవాయువు. తీవ్రస్థాయిలో వాతావరణ కాలుష్య కారకమే కాక జీవజాతుల ప్రాణాలు తీసేంత ప్రమాదకరమైంది కూడా. ఒకవేళ దీనిని కాని ఎవరైనా పీలిస్తే ప్రాణాపాయమని శాస్త్రవేత్తలు అంటారు. సాధారణంగా ఈ విషవాయువు అగ్నిపర్వతాల లావానుంచి అడవుల్లోకి వచ్చిన కారణంగా కార్చిచ్చులు చెలరేగుతాయి. ఇక, నగరాలు, పట్టణాలలో శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాలనుంచి కూడా ఇది విడుదలవుతుంటుంది. అది పెద్ద మొత్తంలో ఉంటే ప్రమాదకరమేనని వారు అంటున్నారు. ఈ వాయువును పీల్చినప్పుడు రక్తకణాలలోని ప్రాణవాయువు స్థానంలోకి చేరిపోతుంది. రక్త సరఫరా మార్గాలలోకి చేరి ఆక్సీజన్ సరఫరాను అడ్డుకొంటుందని వారంటున్నారు. ఫలితంగా మెదడుకు ప్రాణవాయువుతో కూడిన రక్తసరఫరా అందదు. అలా సదరు వ్యక్తికి ప్రాణాపాయం ఏర్పడవచ్చు.

బ్రెజిల్ ప్రాంతంపైన ఇది తొలుత ఆకుపచ్చ రంగులో కనిపించాయని, తర్వాత వేగంగా విస్తరించినట్లు వారు తెలిపారు. దక్షిణ అమెరికాలోని తూర్పు, పశ్చిమ తీరప్రాంతం పొడవునా గగనతలంలో, అంత ఎత్తున ఇది వ్యాపించి ఉందని వారు పేర్కొన్నారు. క్రమక్రమంగా ఈ మేఘవర్ణం ఆకుపచ్చ నుంచి పసుపుకు, తర్వాత ఎరుపుకూ దట్టమైన రంగుల్లోకి మారిందని, ఇది కార్బన్ మోనాక్సైడ్ తీవ్రతర గాఢతను సూచిస్తుందని వారు చెప్పారు.

### అరణ్య రోదన వినేదెవరు?



'అడవి అన్నాక అంటుకోకుండా ఉంటుందా, మనిషి అన్నాక చెట్టును కొట్టకుండా ఉంటాడా' అన్నది కొంతవరకే చెల్లుబాటు అవుతుంది. కానీ, దానిని మించిన స్థాయిలో దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తే అది వినాశనానికి దారితీస్తుందే తప్ప మరొకటి కాదు. సాధారణంగా ఏ అడవిలో అయినా ఎండుగడ్డి, పొదలు వంటివి తీవ్రవేడికి లేదా పిడుగుపాటులకు, లేదా మనుషుల సిగరెట్, బీడీల మెరుపులకు మంటలు పుట్టవచ్చు. తర్వాత వీచే గాలితో అవి విస్తరించి, కార్చిచ్చులా మారుతుంది. ఎప్పటి కప్పుడు విషయం తెలిసిన వెంటనే అధికారులు స్పందించి ఆర్పేయడం సహజమే. కానీ, దట్టమైన కీకారణ్యాలలో పుట్టే మంటలు అధికారులకు విషయం తెలిసి వాటిని ఆర్పే లోపే అనర్థాలెన్నో జరిగిపోతుంటాయి.

**దోర్బల బాలశేఖరశర్మ**

---

**ప్రకృతి పాఠం**

# లకుముకి ముక్కు నైపుణ్యం!

**జీ**వానుకరణ (Biomimic) ఆధారంగా శాస్త్రవేత్తలు సాధిస్తున్న కొత్త సాంకేతికతల్లో 'బులెట్ ట్రెయిన్ ఆకృతి' ఒకటి. అతివేగంతో ప్రయాణించే ఈ రైళ్ల ముందు భాగం 'లకుముకి పక్షి' నాసిక తీరును పోలి ఉంటుంది. ఈ పిట్ట ఇచ్చిన స్ఫూర్తితోనే జపాన్‌లో ఆ రైలు శబ్దాన్ని పెద్ద మొత్తంలో తగ్గించడమే కాక దాని వేగాన్ని, పనితనాన్నీ పెంచినట్లు అక్కడి నిపుణులు చెబుతున్నారు.





లకుముకి పక్షి (కింగ్‌ఫిషర్ బర్డ్) 'ముక్కు నైపుణ్యం' తెలిస్తే మనకు ఆశ్చర్యమేస్తుంది. దాని పనితనం ఆధారంగానే జపాన్‌లో బులెట్ ట్రెయిన్ వేగాన్ని పెంచడమేకాక శబ్దతీవ్రతనూ తగ్గించారంటే విశేషమే మరి. పక్షులు గాలిలో ఎరుగుతూ నేలమీది, నీళ్లలోని తాము తినే జీవులను పట్టుకెళ్లే తీరు అమోఘం. ముఖ్యంగా లకుముకి పక్షి సముద్రజలాల్లోని చేపపిల్లల్ని అతి లాఘవంగా, చడీచప్పుడు కాకుండా, ముక్కున కరుచుకొని తుర్రున ఎగిరి పోవడం వెనుక దాని నాసికా నిర్మాణ తీరు ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీని ప్రత్యేకత ఏమిటంటే, ముక్కు ముందుభాగం అత్యంత పదును. దాని చివరిభాగం సూదిమొనలా వుండి, పైకి పోనుపోను కొంచెం-కొంచెం దాని వెడల్పు పెరుగుతూ వుంటుంది. దీనినే 'వెడ్జ్‌షేప్' (Wedge Shape) గా నిపుణులు పిలుస్తారు.

సూదిని మన శరీరంలోకి ఎక్కువ నొప్పి లేకుండా చొప్పించడానికి ఇలాంటి ఆకృతులే తోడ్పడతాయని నిపుణులు అంటారు. సాధారణంగా పక్షులు, ప్రత్యేకించి లకుముకి పక్షి ముక్కును నీళ్లలోకి చొప్పించే వేళ ఎలాంటి శబ్దం రాకుండా ఈ రకమైన నిర్మాణమే దోహదపడుతున్నట్టు శాస్త్రవేత్తలు గ్రహించారు. ఇదే సాంకేతికతను జపాన్‌లోని బులెట్ ట్రెయిన్ ముందుభాగానికి వర్తింపజేయడం ద్వారా వారు వినూత్న ఫలితాలను సాధించారు. బులెట్ ట్రెయిన్ శబ్దాన్ని గణనీయంగా తగ్గించడానికి ఈ లకుముకి పక్షి ముక్కు సాంకేతికత అనుకరణ ఎంతగానో ఉపయోగపడింది.

'బులెట్ ట్రెయిన్' పేరు చెబితేనే జపాన్ గుర్తుకు వస్తుంది. మొట్టమొదటి బులెట్ ట్రెయిన్ ఆ దేశంలోనే నిర్మితమైంది. ఈ రైలు అప్పట్లో గంటకు 300 కి.మీ. ప్రయాణించేది. తర్వాత దాని వేగం గంటకు 500 కి.మీ.కు పెరిగింది. ఈ రైళ్ల ఇప్పటి వేగం గంటకు 603 కి.మీ.! ఇవి ఇంతటి వేగాన్ని సాధించడం వెనుక లకుముకి పక్షి ముక్కు నైపుణ్యంలోని సాంకేతికత దోహదపడిందన్న సంగతి ఆ తర్వాత వెల్లడైంది. తొలుత ఈ రైలు అంత వేగంతో వెళుతుంటే వచ్చే శబ్దానికి జంతువులు పరుగెత్తి పోయేవి. ఇక, సొరంగమార్గాల్లో అయితే దానిని తట్టుకోలేక మనుషులు చెవులు మూసుకొనేవారు. అయినా, ఒక్కోసారి తీవ్ర అసౌకర్యకరమే కాక అనేక కష్టనష్టాలు ఎదురయ్యేవి. ఆ దేశానికి చెందిన జెఆర్ వెస్ట్ రైల్వే కంపెనీలో ఇంజినీర్, పక్షి పరిశోధకుడు అయిన ఇజి నకాట్సు (Eiji Nakatsu) సృజనాత్మక కృషి వల్ల బులెట్ రైళ్లకు లకుముకి పక్షి నాసికను పోలిన ఆకృతి సిద్ధించింది. రైలు ముందుండే ఇంజిన్ భాగానికి ఈ జీవానుకరణ సాంకేతికతను వర్తింపజేశారు. ఫలితంగా రైలు శబ్దం సుమారు 60–70 శాతం మేర తగ్గడమేకాక 10 శాతం అధిక వేగాన్ని, 15 శాతం ఎక్కువ శక్తిని పొందినట్లు నిపుణులు చెబుతున్నారు.

**-డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**

---

**పరమాణు భౌతికశాస్త్రం**

# అతిసూక్ష్మ అణుయంత్రం!

**పరమాణువులస్థాయిలో సమర్థవంతంగాపనిచేసే అతిసూక్ష్మ యంత్రాన్ని (Tiniest Engine) శాస్త్రవేత్తలు అభివృద్ధిపరిచారు. ఇది ఒక కారుఇంజిన్‌కంటేసుమారు 10 బిలియన్ (1000 కోట్లు) రెట్లు తక్కువ పరిమాణం గలదిఅని వారుచెబుతున్నారు.**



**మ**న కంటికి కనిపించని అణువు లేదా పరమాణువు అంత అతిసూక్ష్మ యంత్రంలోనూ శక్తి ఉత్పాదన సాధ్యమేనని శాస్త్రవేత్తలు ఇటీవల నిరూపించారు. వామన ప్రమాణ (nanoscale) స్థాయిలో అభివృద్ధి పరిచిన ఈ ఇంజిన్‌లో వారు తొలిసారిగా ఏక ఏకాంకశక్తి (single quanta of energy)ని మొట్టమొదటిసారిగా సాధించారు. ఐర్లాండ్‌లోని ట్రినిటీ కాలేజ్ డూబ్లిన్, జర్మనీకి చెందిన యూనివర్సిటీ మెయింజ్ (Mainz) పరిశోధకులు సంయుక్తంగా అభివృద్ధి పరిచిన ఈ అతిసూక్ష్మ యంత్రం (40Ca+ ion) పరమాణు భౌతికశాస్త్రంలో గణనీయమైన ప్రగతిగా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. ఇందులో ఉత్పత్తయ్యే శక్తి ప్రమాణాన్ని క్వాంటా (quanta) గా పిలుస్తున్నారు. ఇంత అతిసూక్ష్మ పరిమాణంలోనూ పదార్థ కోణీయ వేగగతి (angular momentum) సాధ్యమైనట్టు వారు తెలిపారు.

---

**శాస్త్రీయం**

# ఏం తింటున్నాం? ఎలా వండుతున్నాం?

**నేటినుంచిశని వారం (7వ తేది) వరకు 'జాతీయ పోషకాహార వారోత్సవాలు'జరుగుతున్న తరుణంలో ఆహార, ఆరోగ్య పరిరక్షణ గురించి అందరం ఒకసారి ఆలోచించి, కీలక నిర్ణయానికి వద్దాం.**

**1982** నుంచీ (37 సంవత్సరాలుగా) జాతీయ పోషకాహార వారోత్సవాల (National Nutrition Week) ను జరుపుకొంటున్నాం. అయినా, ఇంకా అనేకమంది ప్రజలలో పుష్టికరమైన ఆహారం పట్ల పూర్తిస్థాయి అవగాహన ఏర్పడిందా అంటే లేదనే చెప్పాలి. పాతతరం వారు అనుభవం వల్లనో లేక అలవాట్ల వల్లనో చాలావరకు తినుబండారాల విషయంలో జాగ్రత్తగానే ఉంటున్నా, వీరిలోనూ ఇంకా కొందరు, ప్రత్యేకించి ఈతరం వారైతే మారిన జీవనశైలి పుణ్యమా అని పెద్ద ఎత్తున నిర్లక్ష్యం, అజాగ్రత్తలతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఎవరైనా సరే, అసలు ఏం తింటున్నాం? ఎలా వండుతున్నాం? కడుపులోకి తీసుకొనే ఆహారం ఎంతవరకు ఆరోగ్యకరం? వంటి విషయాలను ఇకనైనా ఆలోచించాలి.

దొరికిందేదో తిని కడుపు నింపుకొని ఆకలి తీర్చుకొందామనుకొనే వైఖరి ఎవరికీ మంచిది కాదు. అలాంటి తిండి ఏదో ఒకసారి, పరిస్థితుల ప్రభావంతో జరిగినప్పుడు 'పోనీలే ఒకసారే కదా' అని సరిపెట్టుకోవచ్చు. కానీ, దీనినే నిత్యకృత్యంగా మార్చుకొనే



వాళ్లను ఏమనాలి? అలాంటి వారి ఆరోగ్యం వారి చేతుల్లో ఉండదు. పక్కన మంచినీళ్ల బావిని పెట్టుకొని కోరి మరీ ఉప్పు నీళ్ల బావిలోని నీళ్లను తాగేవారిని ఏమనాలి? ఆహార పదార్థాల రుచి మాత్రమేకాదు, వాటి నాణ్యత, శుచీ, శుభ్రతలు కూడా ముఖ్యం కదా. ఇంకా, వాటిలోని పోషకాల ప్రమాణం అయితే అత్యంత ప్రధానం. ఉన్నంతలో ఎవరికి వారు వారి ఆర్థిక స్తోమత మేరకు బలవర్ధకమైన, సమతుల పౌష్టికాహారాన్నే ఎంచుకోవాలని ఆహార, ఆరోగ్య, వైద్యరంగాల నిపుణులు ఈ సందర్భంగా మరోమారు సూచిస్తున్నారు.

ప్రత్యేక వారోత్సవాలు, మాసోత్సవాలు జరిగినప్పుడల్లా నిపుణులు ఇలాంటివి సూచిస్తూనే ఉంటారు. మనలో ఎంతమందిమి దానిని పాటిస్తున్నాం? పోషకాహారంతోపాటు వాటి తయారీ, అందుకు వాడే పానీయాలు, పదార్థాలు 'ఎలాంటి'వన్నదీ చాలా అవసరం. తినుబండారాలను వండి వార్చడంలోనూ నాణ్యత, పరిశుభ్రతలను పాటించాలని వారు పదేపదే సూచిస్తుంటారు. అందుకే, ఎవరికి వారు బయటి తిండ్లు ప్రత్యేకించి రోడ్‌సైడ్ పదార్థాలను, కాలుష్యకారక వాతావరణంలో సరైన రక్షణ, నిలువ విధానాలను పాటించని వాటిని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా మానేయడమే మంచిది. 'ఇంటి భోజనాన్ని' మించింది లేదని, మంచి పోషకాలే ఆరోగ్యానికి పెన్నిధి అని అందరం ఈ సందర్భంగానైనా గ్రహించేద్దాం.

---

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

**ధన్‌బాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ-ఐఎస్ఎం)లో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

## బెల్‌లో

**భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** సీనియర్ ఇంజినీర్( ఎలక్ట్రానిక్స్), సీనియర్ఇంజినీర్ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్), మేనేజర్ (సివిల్)
- **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 32/40 ఏండ్లుమించరాదు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్18
- **వెబ్‌సైట్:** www.bel-india.in

## ఐఐటీలో 191 నాన్ టీచింగ్ పోస్టులు



- **మొత్తం ఖాళీలు:** 191
- **పోస్టుల వారీగా ఖాళీలు:** డిప్యూటీ రిజిస్ట్రార్-3, అసిస్టెంట్ రిజిస్ట్రార్-8, జూనియర్ అసిస్టెంట్-74, జూనియర్ టెక్నీషియన్-106, గ్రూప్-1 (కెమిస్ట్రీ)-2, గ్రూప్-2 (కెమికల్)-8, గ్రూప్-3 (సివిల్)-7, గ్రూప్-4 (ఎలక్ట్రికల్)-15, గ్రూప్-5 (ఎలక్ట్రానిక్స్)-19, గ్రూప్-4 (మెకానికల్)-40, గ్రూప్-7 (కంప్యూటర్స్)-12, గ్రూప్-8 (మైనింగ్)-3 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **ఎంపిక:** మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆయా పోస్టులను బట్టి సిలబస్ ఉంటుంది. దీనిలో రాతపరీక్షకు 80 మార్కులు, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు 20 మార్కులు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 4
- **వెబ్‌సైట్:** https://www.iitism.ac.in

## బీఈసీఐఎల్‌లో

**బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** జూనియర్ ఇంజినీర్
- **ఖాళీలు:** 5
- **అర్హత:** మూడేండ్ల డిప్లొమా ఇంజినీరింగ్/బీఈ లేదా బీటెక్
- **పోస్టు:** మెయింటెనర్
- **ఖాళీలు:** 42
- **అర్హతలు:** ఐటీఐ (ఎలక్ట్రీషియన్/ఫిట్టర్/ఎలక్ట్రో మెకానిక్)
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి
- **చివరితేదీ:** సెప్టెంబర్ 16
- **వెబ్‌సైట్:** https://www.becil.com

## ఈసీఐఎల్‌లో

**హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** టెక్నికల్ ఆఫీసర్
- **ఖాళీలు:** 5 (సీఎస్ఈ-4, ఈసీఈ-1)
- **అర్హత:** బీఈ/బీటెక్ (సీఎస్ఈ/ఈసీఈ)
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా (ఆగస్టు 31న ముంబైలో)
- **పోస్టులు:** మార్కెటింగ్ విభాగంలో అడిషనల్ జనరల్ మేనేజర్-1, డిప్యూటీ జనరల్ మేనేజర్-4
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 16
- **వెబ్‌సైట్:** http://careers.ecil.co.in

## వేరుశనగ, శనగ విత్తన ధరలు ఖరారు

### 35 శాతం సబ్సిడీపై సరఫరాకు ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రానున్న యాసంగికి సబ్సిడీపై పంపిణీచేయనున్న శనగ, వేరుశనగ విత్తనాల ధరలను రాష్ట్ర వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. శనగ విత్తనాలు క్వింటాల్‌కు రూ.6,500, వేరుశనగ విత్తనాలు రూ.7,100గా నిర్ణయించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు 35 శాతం సబ్సిడీ ఇస్తుండటంతో.. క్వింటాల్ శనగ రూ.4,225, వేరుశనగ రూ.4,651 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది శనగ ధరకు ప్రస్తుతం ప్రకటించిన ధరకు మార్పులేదు. వేరుశనగకు రైతులు క్వింటాల్‌కు రూ.455 అధికంగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం శనగకు మార్కెట్లో సాధారణ ధర క్వింటాల్‌కు రూ.5,000 గా, వేరుశనగ రూ.5,050 గా ఉన్నది. యాసంగిలో రైతులకు సరఫరా చేసేందుకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వద్ద ప్రస్తుతం 10 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు ఉన్నాయి. టెండర్ల ద్వారా మరో 80 వేల క్వింటాళ్ల విత్తనాలను సేకరించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది.



### సీసీఎంబీలో హై-సై 2019

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీవశాస్త్ర పరిశోధనల పట్ల విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిలించాలనే ఉద్దేశంతో సీసీఎంబీ గురువారం హై-సై 2019 నిర్వహించింది. హైదరాబాద్ పరిధిలోని 11 సంస్థల నుంచి 260కిపైగా విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా సూచనల మేరకు గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్ల మధ్య పలు అంశాలపై చేపట్టిన ప్యానెల్ చర్చలు ఫలప్రదంగా జరిగాయి.

## వెంటనే విధుల్లో చేరండి

- కశ్మీర్ విషయంలో రాజీనామా చేసిన ఐఏఎస్ అధికారి గోపీనాథన్‌కు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కశ్మీర్ ప్రజల భావప్రకటన స్వేచ్ఛను హరించివేస్తున్నారంటూ ఉద్యోగానికి రాజీనామా చేసిన కేరళ నివాసి, ఐఏఎస్ అధికారి కన్నన్ గోపీనాథన్‌ను వెంటనే విధుల్లో చేరాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఆయన రాజీనామాను ఇంకా ఆమోదించలేదని, దీనిని ఆమోదించే వరకు విధులు నిర్వర్తించాలని సూచించింది. కేంద్రపాలిత ప్రాంతాలైన డామన్‌డయ్యూ, దాద్రా నగర్ హవేలీకి చెందిన విద్యుత్ శాఖలో గోపీనాథన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అయితే కశ్మీర్ ప్రజల భావప్రకటన స్వేచ్ఛను హరించివేస్తున్నారంటూ ఆయన ఈ నెల 21న ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో డామన్ డయ్యూ పర్సనల్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కార్యదర్శి గుర్‌ప్రీత్ సింగ్ స్పందిస్తూ 'మీ రాజీనామా ఇంకా ఆమోదం పొందలేదు. కాబట్టి ఆమోదం పొందే వరకు మీరు విధులు నిర్వర్తించాలి. వెంటనే విధుల్లో చేరండి' అని ఆదేశించారు. మరోవైపు గోపీనాథన్ స్పందిస్తూ విధుల్లో చేరాలని ఆదేశించిన విషయం తనకు తెలుసునని, అయితే దీనిపై తాను ఇప్పుడే స్పందించనని చెప్పారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేసి 20 రోజులు కావొస్తున్నదని, కానీ ఇప్పటికీ అక్కడ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి విధానం సరికాదని, ఈ విధానం తనకు నచ్చలేదని పేర్కొన్నారు.



# బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన పాక్

- 290 కి.మీ. లక్ష్యాన్ని ఛేదించడం దీని ప్రత్యేకత
- భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్న పరీక్ష



**ఇస్లామాబాద్, ఆగస్టు 29:** భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగొచ్చంటూ పాక్ రైల్వే మంత్రి షేక్ రషీద్ అహ్మద్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే ఆ దేశం అణు సామర్థ్య బాలిస్టిక్ క్షిపణి 'ఘజ్నవి'ని విజయవంతంగా పరీక్షించింది. గురువారం తెల్లవారుజామున కరాచీ సమీపంలో సోన్‌మియాని టెస్ట్ రేంజ్ వద్ద ఈ క్షిపణి ప్రయోగం చేపట్టింది. ఈ క్షిపణి భూ ఉపరితలం నుంచి 290 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించగలదు. అయితే కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసిన తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పొరుగుదేశం ఈ క్షిపణిని పరీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్షిపణి పరీక్షకు సంబంధించిన వీడియోను పాక్ సైన్యం అధికార ప్రతినిధి మేజర్ జనరల్ ఆసిఫ్ గఫూర్ గురువారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఈ క్షిపణి దాదాపు 290 కి.మీ. దూరం వరకు ఉన్న లక్ష్యాలను ఛేదించడానికి వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఈ వార్‌హెడ్‌లు అధిక తీవ్రత గల పేలుడు పదార్థాలు కావొచ్చు లేదా అణు సామర్థ్య పేలుడు పదార్థాలూ కావొచ్చు. ఇలా పలురకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉన్నది. ఆసిఫ్ గఫూర్ మాట్లాడుతూ క్షిపణి పరీక్ష విజయవంతం అయినందుకు పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ, ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ తదితరులు అభినందించారని చెప్పారు. కాగా ఆర్టికల్ 370 రద్దు అనంతరం పాకిస్థాన్ కుతకుతలాడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఆదేశ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇండో-పాక్ అణు యుద్ధం జరుగొచ్చంటూ వ్యాఖ్యానించారు. దీనికి భారత్ స్పందిస్తూ కశ్మీర్ భారత్ అంతర్గత విషయమని స్పష్టం చేసింది.

# అమెజాన్ కార్చిచ్చు.. ఎందుకీ ఉలికిపాటు ?



### మహారణ్యంలో చెలరేగిన కార్చిచ్చుపై ప్రపంచదేశాల ఆందోళన

### తక్షణం అదుపులోకి తేకుంటే భారీ ముప్పు తప్పదంటున్న పర్యావరణవేత్తలు

అమెజాన్ మహారణ్యంలో భారీ ఎత్తున కార్చిచ్చు చెలరేగింది. వేలాది ఎకరాల్లో అడవి ధ్వంసమవుతున్నది. ఏ దేశంలో అయినా అడవుల్లో మంటలు చెలరేగడం సర్వసాధారణం. రోజూ ప్రపంచవ్యాప్తంగా వేల ప్రాంతాల్లో కార్చిచ్చులు నమోదవుతుంటాయి. కానీ.. అమెజాన్ అడవిలో ఈ నెల మొదటివారంలో చెలరేగిన కార్చిచ్చుతో ప్రపంచం ఉలిక్కి పడుతున్నది. దాదాపు అన్ని దేశాల్లో అమెజాన్‌కు సంఘీభావంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. సామాన్య పౌరుల నుంచి సెలబ్రిటీలు, దేశాధినేతల వరకు కార్చిచ్చుపై విచారం వ్యక్తం చేశారు. ఏకంగా జీ-7 కూటమిలో ఈ కార్చిచ్చుపై చర్చించారు. సహాయ నిధి కింద రూ.వందల కోట్ల మేర డబ్బు పోగయ్యింది. మంటలను అదుపుచేయాలంటూ అంతర్జాతీయ సమాజం బ్రెజిల్ అధ్యక్షుడిపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నది. ఒక అడవి కాలిపోతోంటే ప్రపంచం మొత్తం ఎందుకు ఇలా ఉలికిపడుతున్నది?.. అమెజాన్‌కు వచ్చిన ముప్పు అంతర్జాతీయ సమస్యగా ఎందుకు మారింది.? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవిగో..

**గ్లోబల్‌వార్మింగ్ ముప్పు**

అమెజాన్ మహారణ్యం ధ్వంసమవుతున్నకొద్దీ గ్లోబల్ వార్మింగ్ ముప్పు పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అడవి తగలబడితే భారీగా కర్బన ఉద్గారాలు గాలిలోకి చేరుతాయని, ఆక్సిజన్ ఉత్పత్తి తగ్గిపోతుందని చెప్తున్నారు. గతంలో 40 శాతం అమెజాన్ అడవి ధ్వంసమైతే సగటు ఉష్ణోగ్రతలు 1.5-2 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు అంచనావేశారు. కానీ.. ఇప్పుడు ఆ అంచనాలను సవరించి 20-25 శాతానికి కుదించారు. ఆ హద్దు దాటితే ప్రపంచానికి పెనుముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 17 శాతం అడవులు ధ్వంసమైనట్టు అంచనా.

**వ్యాధుల ముప్పు**

అమెజాన్ మహారణ్యం ధ్వంసమైన కొద్దీ కర్బన ఉద్గారాలు గాలిలో కలిసి సమీప ప్రాంతాల్లోని ప్రజలు వ్యాధుల బారిన పడతారు. ప్రస్తుత కార్చిచ్చుల వల్ల కమ్ముకున్న పొగతో బ్రెజిల్‌లో శ్వాసకోస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నది. పొడి వాతావరణం, పొగ కారణంగా చిన్నారుల్లో నిమోనియా, దగ్గు తదితర సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం వెలువడుతున్న పొగ అడవికి 2,500 కి.మీల దూరంలో ఉన్న సావోపోలో నగరాన్ని సైతం కప్పివేసిందంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. పొగకారణంగా పోర్టో వెల్హో నగరంలోని అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేయాల్సి వచ్చింది.

**- నేషనల్ డెస్క్**

### ప్రపంచ ఊపిరితిత్తులు

అమెజాన్ మహారణ్యాన్ని ప్రపంచ ఊపిరితిత్తులు అని పిలుస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అడవులు ఏటా వాతావరణం నుంచి 240 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను పీల్చుకుంటుండగా.. అందులో 25 శాతం అంటే దాదాపు 60 కోట్ల టన్నుల ఉద్గారాలను అమెజాన్ మహారణ్యం స్వీకరిస్తున్నది. అంతేకాదు.. అమెజాన్ అడవుల్లో 8600 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలు నిల్వ ఉన్నాయి. ఇది ప్రపంచ అడవుల మొత్తంతో పోల్చితే మూడోవంతు కన్నా ఎక్కువ.

### అతిపెద్ద వర్షాధార అడవి

అమెజాన్ అడవి విస్తీర్ణం దాదాపు 55 లక్షల చదరపు కిలోమీటర్లు. మన దేశం మొత్తం వైశాల్యం కన్నా ఎక్కువ. భారత్ వైశాల్యం 32.8 లక్షల చ.కి.మీ. మాత్రమే. అంతేకాదు మొత్తం భూమి వైశాల్యంతో పోల్చినప్పుడు అమెజాన్ 4 శాతం మేర ఆక్రమించి ఉన్నది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద వర్షాధార మహారణ్యం. భూమిపై ఉన్న మొత్తం వర్షాధార అడవుల విస్తీర్ణంలో అమెజాన్ వాటా 60 శాతం.

### అధ్యక్షుడే అసలు దోషి!



బొల్సోనారో

అమెజాన్ అడవులు దాదాపు తొమ్మిది దేశాల్లో విస్తరించి ఉన్నాయి. ఇందులో 60 శాతం బ్రెజిల్‌లోనే ఉన్నది. ఈ ఏడాది జనవరిలో బ్రెజిల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సిన్స్ బొల్సోనారో విధానాల వల్ల అడవి వేగంగా ధ్వంసమవుతున్నదని అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచ్చలవిడిగా గనుల తవ్వకానికి, అడవులను వ్యవసాయ భూములుగా మార్చడానికి ఆయన అనుమతులు ఇచ్చారని, అడవిని కాపాడేందుకు అంతర్జాతీయంగా వస్తున్న విన్నపాలను పట్టించుకోవడంలేదని చెప్తున్నారు. ఫలితంగా 2013తో పోల్చితే ఈ ఏడాది రెట్టింపునకు పైగా కార్చిచ్చులు నమోదయ్యాయి.

- ఎండాకాలంలో అడవుల్లో మంటలు చెలరేగడం, వర్షాకాలంలో పునరుద్ధరణ జరుగడం సాధారణ ప్రక్రియ. అయితే ఈ ఏడాది భౌగోళిక పరిస్థితులతో సంబంధం లేకుండా భారీగా మంటలు చెలరేగుతున్నాయని బ్రెజిల్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ రీసెర్చ్ తెలిపింది.
- అభివృద్ధి పేరుతో అధ్యక్షుడు ఇచ్చిన పిలుపును ఆసరాగా చేసుకొని అడవిని వ్యవసాయ భూములుగా మార్చడానికి స్థానిక ప్రజలు మంట పెడుతున్నారని పర్యావరణ వేత్తలు చెప్తున్నారు.
- ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో అటవీ నిర్మూలన 67 శాతం పెరిగింది. ఒక్క జూలై నెలలోనే సగటుకన్నా మూడురెట్ల మేర అడవి ధ్వంసమైంది.
- మంటలు ఆర్పడానికి ప్రపంచదేశాలు సహాయం చేస్తామని చెప్తున్నా.. బ్రెజిల్ అధ్యక్షుడు ససేమిరా అంటున్నారు. ఇప్పటికే జీ-7 దేశాలు ఆర్థికంగా, ఇతర వనరుల పరంగా సాయం చేస్తామని ప్రతిపాదించగా బ్రెజిల్ అధ్యక్షుడు తోసిపుచ్చారు. ఆర్థిక సహాయం చేస్తామనడాన్ని అవమానించడంగా అభివర్ణించారు. తాజాగా అమెరికా ముందుకొచ్చింది. మంటలను ఆర్పేందుకు అవసరమైన సహాయం చేస్తామని తెలిపింది. అయితే బ్రెజిల్ అధ్యక్షుడు ఒప్పుకుంటేనే రంగంలోకి దిగుతామని అమెరికా జాతీయ భద్రతా సంఘం అధికార ప్రతినిధి గెరైట్ పేర్కొన్నారు.

### సమతుల్యతకు కీలకం

ప్రపంచ జీవజాతుల్లో 30 శాతం అమెజాన్ లోనే ఉన్నాయి. ఇక్కడ 16వేల జాతులకు చెందిన 39 వేల కోట్ల చెట్లు ఉన్నట్టు అంచనా. భూమిపై ఉన్న జీవద్రవ్యంలో ఇది 10 శాతం. అమెజాన్ నది ప్రపంచంలోనే పొడవైనది. భూమిపై గడ్డకట్టని స్థితిలో ఉన్న తాగునీటిలో 20 శాతం ఈ నదిలోనే ప్రవహిస్తున్నది.



## గుణాత్మక మార్పునకు కృషిచేయాలి

- సివిల్ సర్వెంట్లకు డీవోపీటీ అదనపు కార్యదర్శి సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్తగా విధుల్లో చేరుతున్న ట్రైనీ సివిల్ సర్వెంట్లు సమర్థ నాయకత్వ లక్షణాలతో సమాజంలో గుణాత్మక మార్పును తీసుకొచ్చేందుకు కృషిచేయాలని కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్‌శాఖ(డీవోపీటీ)అదనపు కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. 22 రాష్ర్టాల నుంచి కేంద్ర సర్వీసులకు ఎంపికైన సివిల్ సర్వెంట్లకు ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నారు. గురువారం శిక్షణలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సంప్రదాయక పద్ధతులకు భిన్నంగా విధులను నిర్వర్తించే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ రూపొందించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గిరిజనాభివృద్ధిశాఖ కమిషనర్ క్రిస్టినా ఝడ్‌చోంగ్తూ, ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య పాల్గొన్నారు.

### టీఆర్టీ వైకల్య అభ్యర్థులకు వైద్యపరీక్షలు నేడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) నియామకాలలో భాగంగా నేడు శారీరక అంగవైకల్యం గల అభ్యర్థులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఉస్మానియా వైద్య కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులు 'సదరం' సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, హాల్‌టికెట్, సంబంధితఫీజును తీసుకురావాలని కోరింది. పూర్తి వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

### తుదివిడుత పీజీఈసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీకి గురువారం నుంచి తుదివిడుత తెలంగాణ రాష్ట్ర పోస్టుగ్రాడ్యుయేషన్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ పీజీఈసెట్) విద్యార్థులకు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇచ్చామని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. తొలివిడుత కౌన్సెలింగ్ ఎంటెక్‌లో 5,469, ఎంఫార్మసీలో 3,129, ఎంఆర్క్‌లో 96 కలిపి మొత్తం 8,963 సీట్లు ఉండగా.. వాటిలో 6,096 సీట్లు నిండాయని పేర్కొన్నారు. తుదివిడుత కౌన్సెలింగ్‌లో మూడుకోర్సులు కలిపి 2,598 సీట్లు ఉన్నాయని, ఇందులో వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

### రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడిని కాపాడిన కానిస్టేబుల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణికుడికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. కదులుతున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ నుంచి కిందికి దిగేందుకు ఓ ప్రయాణికుడు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రయాణికుడు రైలు, ప్లాట్‌ఫాం మధ్య చిక్కుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన రైల్వే కానిస్టేబుల్ వికుల్‌కుమార్.. కదులుతున్న రైలు వెంట పరుగెత్తి ప్రయాణికుడిని కాపాడాడు. ప్రమాదంలో ఉన్న ప్రయాణికుడిని కాపాడిన వికుల్‌కుమార్‌ను ఆర్పీఎఫ్ ఐజీ ఈశ్వర్, కమిషనర్ రామకృష్ణతోపాటు ప్రయాణికులు అభినందించారు.

# పరుచుకున్న పచ్చదనం

- మావల, దేవాపూర్‌లో దట్టంగా అడవులు
- క్షీణించిన అడవుల పునర్జీవ కార్యక్రమంతో వెయ్యి హెక్టార్లలో పెరిగిన అటవీ విస్తీర్ణం
- హరితహారంలోనూ ఒక్కో ప్రాంతంలో 5 లక్షల మొక్కలు



పచ్చదనంతో కళకళలాడుతున్న ఆదిలాబాద్ జిల్లా మావల అటవీ ప్రాంతం

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో అడవుల ఖిల్లా ఆదిలాబాద్ జిల్లాలో పచ్చదనం మరింత పరుచుకుంటున్నది. జిల్లాలోని మావల, దేవాపూర్ అటవీప్రాంతాలు మరో కోమటిబండను తలపిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 1706.89 చదరపు కి.మీ. అటవీవిస్తీర్ణం ఉండగా, జిల్లా భూభాగంలో అడవులు 41.1 శాతం విస్తరించాయి. ఆదిలాబాద్, మావల, ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్, తలమడుగు మండలాల్లో దట్టమైన అడవులున్నాయి. కొన్నేండ్ల కిందట మావల, దేవాపూర్ ప్రాంతాల్లో కలప అక్రమ రవాణా కారణంగా అడవులు క్షీణించాయి. అడవుల పునరుద్ధరణకు జిల్లా అటవీశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. హరితహారంలో భాగంగా అటవీశాఖ చేపట్టిన 'క్షీణించిన అడవుల పునర్జీవం' (రెజువనేషన్ ఆఫ్ డీగ్రేడెడ్ ఫారెస్ట్) కార్యక్రమం ద్వారా వెయ్యి ఎకరాల్లో మొక్కలునాటి దట్టమైన అడవులుగా మార్చారు.

**పచ్చదనం కోసం పక్కాచర్యలు**

జిల్లావ్యాప్తంగా అధికారులు ఐదేండ్లుగా హరితహారంలో భాగంగా అటవీప్రాంతాల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలోకి స్మగ్లర్లు, కట్టెలు తీసుకుపోయేవారు, పశువులు రాకుండా గట్టిచర్యలు చేపట్టారు. పశువులు, మనుషులు రాకుండా కందకాలు తవ్వారు. బ్లాక్‌లుగా విభజించి హరితహారంలో భాగంగా మావలలో 5 లక్షలు, దేవాపూర్‌లో 5 లక్షల మొక్కలు నాటారు. పలుచబడిన, నరికివేతకు గురైన అడవుల్లో ఎయిడెడ్ నేచురల్ రీజనరేషన్ (ఏఎన్నార్) పద్ధతిలో తిరిగి జీవంపోశారు. మావల అటవీ ప్రాంతంలో 500 హెక్టార్లు, దేవాపూర్‌లో 500 హెక్టార్లలో అధికారులు అమలు చేస్తున్న పునర్జీవ కార్యక్రమం విజయవంతమైంది. గతంలో నరికివేతకు గురైన చెట్లు సహజసిద్ధంగా పెరుగుతున్నాయి. ఏఎన్నార్‌లో భాగంగా అధికారులు.. మొక్కలు పెరిగేందుకు చుట్టుపక్కల పిచ్చిమొక్కలు, ముండ్లపొదలను ఎప్పటికప్పుడు తొలిగిస్తున్నారు. రెండు అటవీప్రాంతాలను క్రమంగా తనిఖీ చేస్తూ సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. నాడు పలుచబడిన అడవులు నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మావల అటవీప్రాంతంలో సందర్శకుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో పార్కును ఏర్పాటుచేశారు. ఇందులో బోటింగ్, సాహస క్రీడలు ఏర్పాటుచేయడంతోపాటు అటవీ జంతువులు, మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

### అడవుల అభివృద్ధికి చర్యలు



జిల్లాలో దట్టమైన అడవులు ఉండగా కొన్ని ప్రాంతాల్లోని అడవుల నరికివేత, ఇతర కారణాల వల్ల పలుచగా మారాయి. అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మావల, దేవాపూర్ అటవీప్రాంతంలోని 1000 హెక్టార్లలో రెజువెనేషన్ ఆఫ్ డీగ్రేడెడ్ ఫారెస్ట్ కార్యక్రమం చేపట్టాం. క్షీణించిన అడవులు మళ్లీ పెరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోని అడవులను గుర్తించి ఈ కార్యక్రమం అమలుకు ప్రణాళికలు తయారుచేశాం.

**- ప్రభాకర్, జిల్లా అటవీశాఖ అధికారి**

## యూరియాకు భారీ డిమాండ్

- ప్రాజెక్టుల్లో నీటి నిల్వలతో పెరిగిన పంటల విస్తీర్ణం
- అదనంగా 1.5 లక్షల టన్నులు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో యూరియాకు భారీ డిమాండ్ పెరిగింది. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెరుగడంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంటల సాగు విస్తీర్ణం అధికమైంది. అంచనాకు మించి వరినాట్లు వేయగా, మక్కజొన్న, పత్తి, ఇతర ఆహార పంటలదీ అదే పరిస్థితి నెలకొన్నది. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం రాష్ట్రానికి కేటాయించిన లక్ష టన్నుల యూరియాకు అదనంగా మరో 1.5 లక్షల టన్నులను కేటాయించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి.. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి, కార్యదర్శులకు లేఖలు రాశారు. ఈ నెలలో 1.27 లక్షల టన్నుల యూరియా కొరత ఏర్పడినట్టు వ్యవసాయశాఖ గుర్తించింది. ఆగస్టులో వరినాట్లు 8.45 లక్షల ఎకరాల నుంచి 19.69 లక్షల ఎకరాలకు చేరడంతో రైతులు యూరియా కోసం పోటెత్తారు. ఇంపోర్టెడ్ యూరియా సరఫరా.. కేటాయింపుల కంటే లక్ష మెట్రిక్ టన్నులు తగ్గడంతో యూరియా కొరత ఏర్పడినట్టు అధికారులు తెలిపారు. కేటాయింపుల ప్రకారం ఈ నెలలో స్వదేశీ యూరియా రాష్ట్రానికి 81 వేల టన్నులు రావాల్సి ఉండగా, 58 వేల టన్నులు సరఫరా అయింది. 23 వేల టన్నులు కొరత ఏర్పడింది. ఇంపోర్టెడ్ యూరియా 1.4 లక్షల టన్నులు కేటాయించాల్సి ఉండగా, 36 వేల టన్నులే సరఫరా చేశారు. 1.04 లక్షల టన్నుల కొరత ఉన్నదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంగా 1.27 లక్షల టన్నుల కొరత ఏర్పడింది. ఇంపోర్టెడ్ యూరియా మెటీరియల్ ఐపీఎల్, ఇఫ్కో సరఫరాదారుల వద్ద లేనట్టు వ్యవసాయశాఖ.. ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టంచేసింది. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి సీజన్ ప్రారంభంలో మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్‌ను ఉపయోగించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూశారు.

**రేవుల్లో నిలిచిన యూరియా**

రాష్ట్రానికి రావాల్సిన యూరియా రేవుల్లో పెండింగ్‌లో ఉన్నదని, రాష్ట్రానికి చేర్చేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్తున్నారు. క్రిభ్‌కోకు చెందిన 13వేల టన్నులు, ఎన్‌ఎఫ్‌ఎల్‌కు చెందిన 9 వేల టన్నులు విశాఖ, కృష్ణపట్నం రేవుల్లో ఉన్నాయి. వీటిని మిర్యాలగూడ, నిజామాబాద్, కరీంనగర్ రేక్ పాయింట్లకు తరలించాల్సి ఉంటుంది. కేటాయింపుల ప్రకారం సెప్టెంబర్‌లో లక్షటన్నులే రానుండగా, దీనిని మరో 1.5 లక్షల టన్నులు పెంచి.. 2.5 లక్షల టన్నులు ఇవ్వాలని కేంద్రానికి అధికారులు లేఖ రాశారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ వద్ద 67 వేల టన్నులు, ప్రాథమిక సహకార సంఘాల వద్ద 13 వేలటన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 20 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉన్నది.

# కరంట్ కట్ చేస్తాం!

- పాక్ ప్రధాని కార్యాలయాన్ని హెచ్చరించిన విద్యుత్తు కంపెనీ
- బిల్లులు బకాయి పడినట్టు వెల్లడి

**ఇస్లామాబాద్, ఆగస్టు 29:** 'మింగ మెతుకు లేదు. మీసాలకు..' అన్నట్టుంది పాకిస్థాన్ వైఖరి. ఇప్పటికే, తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ఆ దేశానికి విద్యుత్ కష్టాలు తోడయ్యాయి. అయినా, 'అక్టోబర్‌లో లేదా నవంబర్‌లో భారత్‌తో యుద్ధానికి సై' అంటూ ప్రగల్భాలు పలుకుతున్నది. ఇక విషయానికి వస్తే, విద్యుత్ బిల్లులు చెల్లించలేదన్న కారణంతో సాక్షాత్తూ పాక్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామంటూ ఇస్లామాబాద్ ఎలక్ట్రిక్ సప్లై కంపెనీ (ఐఈఎస్సీవో) నోటీసులు జారీచేసింది. ఇమ్రాన్ సచివాలయం తమకు రూ.41 లక్షల విద్యుత్ బిల్లు బకాయిపడినట్టు పేర్కొంది. అధికారులకు బిల్లులు చెల్లించాలని ఎన్ని నోటీసులు పంపించినా బకాయిలు చెల్లించలేదని ఆరోపించింది. ప్రధాని కార్యాలయం చెల్లింపుల్లో జాప్యత వల్ల విద్యుత్తు ఉత్పత్తిచేస్తున్న ప్రైవేటు సంస్థలకు తాము బిల్లులు చెల్లించలేకపోతున్నట్టు సదరు కంపెనీ వాపోయింది. ఈ నేపథ్యంలోనే.. ప్రధాని కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామంటూ నోటీసులిచ్చినట్టు ఐఈఎస్సీవో అధికారులు తెలిపా రు. పాక్‌లో విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో కొరత ఏర్పడింది. పాక్‌లో విద్యుత్ డిమాండ్, సరఫరా మధ్య అంతరం 6000 మెగా వాట్లకు చేరుకున్నట్టు సమాచారం. దీనికి తోడు.. బలహీనమైన వృద్ధిరేటు కారణంచేత పాక్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. కష్టాలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టడంతో ఏకంగా ప్రధాని కార్యాలయానికే విద్యుత్ బిల్లులు చెల్లించలేని స్థితికి పాక్ ప్రభుత్వం దిగజారింది.

### ఆధునిక పద్ధతిలో కోచ్‌ల శుభ్రత

కాచిగూడ స్టేషన్‌లో ప్లాంటును ప్రారంభించిన జీఎం మాల్యా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాచిగూడలో ఆధునిక ఆటోమెటిక్ కోచ్ వాషింగ్ ప్లాంటును దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా గురువారం ప్రారంభించారు. ట్రైన్ మెయింటెనెన్స్ హబ్ వద్ద ఏర్పాటుచేసిన ప్లాంట్ ఐదేండ్ల నిర్వహణకు రూ.2.5 కోట్ల వ్యయం అవుతుందని జీఎం తెలిపారు. ప్రయాణికులకు భద్రమైన ప్రయాణంతోపాటు, శుభ్రత కూడా తమ బాధ్యత అని చెప్పారు. కోచ్ వాషింగ్ ప్లాంట్‌తో 24 కోచ్‌ల రైలు శుభ్రంచేయడానికి 15 నిమిషాలు పడుతుందని,10 యూనిట్ల విద్యుత్ ఖర్చవుతుందని తెలిపారు. ఒక వ్యక్తితో నిర్వహించడంతోపాటు, నీటి వినియోగం 60 శాతం తగ్గుతుందని, పూర్వ పద్ధతిలో శుభ్రంచేయడానికి 3,600 లీటర్ల నీరు అవసరం అయ్యేదని చెప్పారు.

# పపువాలో తారాస్థాయికి అల్లర్లు

- జయపురలో అసెంబ్లీ భవనానికి నిప్పుపెట్టిన నిరసనకారులు
- ఇండోనేషియా పాలన నుంచి విముక్తి కోరుతూ ఆందోళనలు



పపువాలోని జయపురలో ఆందోళనకారులు నిప్పపెట్టడంతో కాలిపోతున్న భవనాలు

**జకర్తా:** ఇండోనేషియా పాలనలో ఉన్న పపువా ద్వీపంలో అల్లర్లు తారాస్థాయికి చేరుకొన్నాయి. గురువారం నాడు పెద్ద సంఖ్యలో ఆందోళనాకారులు పపువాలోని అతిపెద్ద నగరమైన జయపురలో చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆందోళనాకారులు అసెంబ్లీ భవనానికి నిప్పుపెట్టడంతోపాటు స్థానికంగా ఉన్న దుకాణాలు, హోటళ్లపై రాళ్లు, ఇటుకలతో దాడికి దిగారు. వందల మంది ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో ద్వీపం పూర్తిగా అట్టుడుకిపోయింది. ఇండోనేషియా పాలన నుంచి విముక్తినివ్వాలని, జాత్యహంకారానికి ముగింపు పలుకాలంటూ పపువన్ నిరసనకారులు గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. మారుమూల డీయై పట్టణంలో ఆగస్టు తొలివారంలో నిరసనకారులు, ఇండోనేషియా భద్రతాబలగాల మధ్య ఘర్షణలో ఒక సైనికుడు, ఇద్దరు ప్రదర్శనకారులు చనిపోయిన మరుసటిరోజు నుంచి ఆందోళనలు మొదలయ్యాయి. దశాబ్దాలనాటి వేర్పాటువాద తిరుగుబాటు సమయంలో హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు పపువన్ నిరసనకారులను ఇండోనేషియా మిలిటరీ కాల్చిచంపింది. జావాలో పెద్ద సంఖ్యలో పపువన్ విద్యార్థుల అరెస్టును నిరసిస్తూ గత సోమవారం ఆందోళనకారులు స్థానిక జైలుకు నిప్పుపెట్టడంతో దాదాపు 270 మంది ఖైదీలు పరారయ్యారు. మెలనేషియన్ జాతికి చెందిన పపువన్లు.. ఇండోనేషియాతో అతి తక్కువ సాంస్కృతిక సంబంధాలు కలిగివున్నారు. ఇండోనేషియా పాలన నుంచి విముక్తి కోరుతూ చాలారోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి. కాగా, డీయై పట్టణంలో పరిస్థితిని అదుపులోకి తేవడానికి ఇప్పటికే ఉన్న 1200 మంది పోలీసులకు అదనంగా 300 మంది బలగాలను మోహరించినట్టు అధికారులు తెలిపారు. గత వారం రోజులుగా ద్వీపం అంతటా ఇంటర్నెట్ సేవలను ఇండోనేషియా ప్రభుత్వం నిలిపివేసింది.

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శుక్రవారం 30 ఆగస్టు 2019

# వాత్సాయనుడి నిలువెత్తు కటౌట్..!


'ఆర్‌డీఎక్స్ లవ్' చిత్రంలో పాయల్‌రాజ్‌పుత్

పాయల్ రాజ్‌పుత్, తేజస్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఆర్‌డీఎక్స్ లవ్'. శంకర్‌భాను దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. పాయల్ రాజ్‌పుత్ అందాల ప్రదర్శన, లిప్‌లాక్‌లతో ట్రైలర్ హాట్‌హాట్‌గా ఉంది. బోల్డ్‌గా ఆమె పాత్ర సాగింది. ఇంట్లో పేరెంట్స్ లేనప్పుడు మన ఒంట్లో ఫీలింగ్స్ కంట్రోల్‌లో పెట్టుకోవాలి. తప్పదు అనుకుంటే సెఫ్టీలైనా అందుబాటులో ఉంచుకోవాలి.. వాత్సాయనుడికి నిలువెత్తు కటౌట్‌లా కనిపిస్తున్నావు రాజా.. అనే సంభాషణలతో ట్రైలర్‌ను రూపొందించారు. పూర్తిగా గ్లామర్ హంగులతో యువతరాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా కనిపిస్తున్నది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుగుతున్నాయి.

# డిస్కోరాజా లక్ష్యం ఏమిటి?


రవితేజ

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డిస్కోరాజా'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. పాయల్ రాజ్‌పుత్, నభానటేష్, తాన్యహోప్ కథానాయికలు. రజిని తాళ్లూరి నిర్మాత. డిసెంబర్ 20న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానుంది. సెప్టెంబర్ 2 నుంచి గోవాలో కీలకమైన షెడ్యూల్‌ను తెరకెక్కించబోతున్నారు. అదే రోజు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హైదరాబాద్, ఢిల్లీలో చిత్రీకరణ జరిపాం. గ్రాఫిక్స్‌కు పెద్ద పీట వేస్తూ తెరకెక్కిస్తున్నాం. రవితేజ పాత్ర చిత్రణ వైవిధ్యంగా ఉంటుంది' అని చెప్పారు. 'సైంటిఫిక్ థ్రిల్లర్ చిత్రమిది. ఓ డ్యాన్సర్ నేపథ్యంలో కథ సాగుతుంది. రవితేజ మునుపెన్నడూ చూడని విధంగా వినూత్న పాత్రలో కనిపిస్తారు. డిస్కోరాజా ఏ లక్ష్యం కోసం తపించాడన్నదే చిత్ర కథ' అని దర్శకుడు తెలిపారు. బాబీసింహా, వెన్నెల కిషోర్, సత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కార్తీక్ ఘట్టమనేని, సంభాషణలు: అబ్బూరి రవి, సంగీతం: తమన్, సమర్పణ: సాయిరిషిక, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.ఐ.ఆనంద్.



'వాల్మీకి' చిత్రంలో పూజాహెగ్డే

# సైకిల్‌షాప్ కుర్రాడి కథ


'నేను నా నాగార్జున' ఆడియో ఆవిష్కరణ దృశ్యం

హాస్యనటుడు మహేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నేను నా నాగార్జున'. జీఎన్‌ఆర్ క్రియేషన్స్ పతాకంపై గుండపు నాగేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఆర్.బి.గోపాల్ దర్శకుడు. హీరో నాగార్జున జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఆడియోను ఆవిష్కరించారు. ఈశ్వర్ పెరావళి సంగీతాన్ని అందించారు. ఈ చిత్ర గీతాల్ని మళ్ల విజయప్రసాద్, ట్రైలర్‌ను నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ విడుదలచేశారు. మహేష్ మాట్లాడుతూ ''రంగస్థలం'లో నటించడానికి ముందు చేసిన సినిమా ఇది. ఇందులో ఓ సైకిల్‌షాప్ యువకుడి పాత్రలో కనిపిస్తాను. మా ఊళ్లో ఉండే రాంబాబు అనే కుర్రాడిని స్ఫూర్తిగా తీసుకొని ఈ పాత్ర చేశాను. ఈ చిత్రం ఆద్యంతం నవ్విస్తుంది' అని చెప్పారు. ఎన్నో కష్టాలు పడి ఈ సినిమాను పూర్తిచేశామని, త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెప్పారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ 'ట్రైలర్, పాటలు బాగున్నాయి. నిర్మాతకు పేరుతో పాటు డబ్బులు తెచ్చిపెట్టాలి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.దామోదరప్రసాద్, తోటపల్లి మధు, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నా జీవితం మారిపోయింది!


మురళీశర్మ

'నటుడిగా అన్ని రకాల పాత్రల్ని ఆస్వాదిస్తాను. భాషా పరమైన భేదాలు నాకు లేవు' అని అన్నారు మురళీశర్మ. తెలుగు చిత్రసీమలో విభిన్నమైన పాత్రలతో ప్రతిభావంతుడైన నటుడిగా గుర్తింపును సొంతం చేసుకున్నారాయన. మురళీ శర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మురళీశర్మ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ 'అద్భుతమైన కథ, కథనాలు, శక్తివంతమైన పాత్రల సమాహారంగా ఉండే భారీ చిత్రమిది. ఇందులో డేవిడ్ అనే పోలీస్‌గా కనిపిస్తాను.మల్టీలేయర్స్‌తో నా పాత్ర వినూత్నంగా ఉంటుంది. ప్రతి పాత్ర ప్రాధాన్యతను కలిగి గుర్తుండిపోతుంది. ప్రభాస్‌ను అందరూ డార్లింగ్ అని పిలుస్తుంటారు. అలా ఎందుకు సంబోధిస్తారో ఈ సినిమాతో అర్థమైంది. షూటింగ్ తొలిరోజు లంచ్‌బ్రేక్‌లో నాకు ఇంటి ఫుడ్ అంటే ఇష్టమని ప్రభాస్‌తో మామూలుగా చెప్పాను. ఆ మాట విన్న ఆయన షూటింగ్ జరిగినన్ని రోజులు తన ఇంటి నుంచి నాకు భోజనం పంపించారు. ప్రభాస్ ఇంటి నుంచి వచ్చే గుత్తొంకాయ కూర చాలా రుచిగా ఉంటుంది. స్టార్ హీరో అనే గర్వం లేకుండా చాలా హార్డ్‌వర్క్ చేస్తుంటారు ప్రభాస్.

**పాత్రలో లీనమవుతా..**

పాత్ర కోసం ముందస్తు ప్రిపరేషన్ అవసరమని నమ్ముతాను. ప్రతి క్యారెక్టర్ కోసం ముందుగానే సన్నద్ధమవుతాను. కన్ఫ్యూజన్‌తో ఎప్పుడూ సెట్స్‌కు వెళ్లను. యాక్షన్ చెప్పగానే నా పాత్ర, సన్నివేశాలు తప్ప మిగతా ప్రపంచాన్ని మర్చిపోతాను. పూర్తిగా సినిమాలో లీనమైపోతాను.'భలే భలే మగాడివోయ్' తర్వాత నటుడిగా నా జీవితం పూర్తిగా మారిపోయింది. దర్శకరచయితలు నా కోసం మంచి పాత్రల్ని సృష్టిస్తున్నారు. తండ్రి పాత్రలు నాకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ పాత్రల్లో నటించడం కంఫర్ట్‌గా ఉంటుంది. భాషా పరమైన భేదాలు నాకు లేవు. భాష ఏదైనా ఎమోషన్స్ ఒకేలా ఉంటాయి. ప్రస్తుతం 'సరిలేరు నీకెవ్వరు', 'అలా వైకుంఠపురంలో'తో పాటు మారుతి, శర్వానంద్, సందీప్‌కిషన్ చిత్రాల్లో నటిస్తున్నాను. పాన్ ఇండియన్ సినిమాలు తెలుగు భాష నుంచి ఎక్కువ రావడం గర్వంగా ఉంది.


ఆది, శ్రద్ధాశ్రీనాథ్

# కాంచనమాల ప్రణయం

ఆది సాయికుమార్, శ్రద్ధాశ్రీనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'జోడీ'. విశ్వనాథ్ అరిగెల దర్శకుడు. పద్మజ, సాయివెంకటేష్ నిర్మాతలు. సెప్టెంబర్ 6న ప్రేక్షకులముందుకురానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది. భిన్నధృవాలైన యువతీయువకుడి ప్రేమకు దర్పణంలా ఉంటుంది. కాంచనమాల ప్రేమను ఓ హుషారైన యువకుడు ఎలా గెలుచుకున్నాడు? ఈ క్రమంలో వారిద్దరు కలిసి సాగించిన ప్రయాణమేమిటి అన్నది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు. ఇది ప్రతి ఒక్కరిని మెప్పించే జోడీ అవుతుందని నిర్మాతలు చెప్పారు. వి.కె.నరేష్, సత్య, వెన్నెల కిషోర్, సిజ్జు, స్వప్నిక, సితార, మాధవి, గొల్లపూడి మారుతిరావు, వర్షిణి సౌందరరాజన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: యస్.వి.విశ్వేశ్వర్, సంగీతం: ఫణికల్యాణ్, నిర్మాణ సంస్థ: భావనా క్రియేషన్స్.


భూమిపడ్నేకర్, తాప్సీ

# సంకల్పబలం సాక్షిగా...

'షూటర్ దాదీస్'గా దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందారు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన షార్ప్‌షూటర్లు చంద్రోతోమర్, ప్రకాశీతోమర్. 60ఏళ్లకు పైబడిన వయసులో వీరిద్దరు జాతీయస్థాయిలో అనేక షూటింగ్ కాంపిటీషన్స్‌లో పాల్గొన్ని ఎన్నో పతకాలను గెలుచుకున్నారు. వీరి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న చిత్రం 'సాండ్ కీ ఆంఖ్'. భూమిపెడ్నేకర్, తాప్సీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తుషార్ హీరానందాని దర్శకుడు. ప్రకాశీతోమర్ పాత్రలో తాప్సీ, చంద్రోతోమర్ పాత్రలో భూమి పెడ్నేకర్ నటిస్తున్నారు. యువతరంలో మంచి క్రేజ్ ఉన్న ఇద్దరు నాయికలు వృద్ధురాళ్ల పాత్రల్ని పోషించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నిర్మాణ దశ నుంచే ఈ సినిమా అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. వీరిద్దరి ప్రయాణం సంకల్పబలానికి సాక్ష్యంగా నిలిచిందని ప్రశంసలు లభిస్తున్నాయి. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఈ సినిమాలోని ఓ ప్రత్యేకమైన స్టిల్‌ను రిలీజ్ చేశారు. తాప్సీ, భూమిపెడ్నేకర్ చిరునవ్వులు చిందిస్తూ షూటింగ్ బరిలో ఉన్న ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్టోబర్‌లో ఈ చిత్రం ప్రేక్షకులముందుకురానుంది.

# కొత్త ఆలోచనలకునాంది


జానకీరావు

'శ్రీకాకుళం కుర్రాళ్లు చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతం కావాలి. సరికొత్త ఆలోచనలకు నాంది కావాలి' అని అన్నారు నవలా రచయిత భానుప్రకాష్ కెంబూరి. వినీత్‌చంద్ర, దేవయానీశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'తూనీగ'. ప్రేమ్ సుప్రీమ్ దర్శకనిర్మాత. ఈ చిత్రంలోని 'జాతరమ్మ జాతర కూలిజనం జాతర' అనే ప్రోమో సాంగ్‌ను రచయిత భానుప్రకాష్ కెంబూరి విడుదలచేశారు. జానకీరావు స్వీయ స్వరకల్పనలో ఈ గీతాన్ని అలపించారు. రత్నకిశోర్ శంభు మహంతి సాహిత్యాన్ని అందించారు. భానుప్రకాష్ మాట్లాడుతూ 'శ్రీకాకుళం కళల్ని, సాహిత్యాన్ని, జానపదాన్ని సినిమా మాధ్యమం విరివిగా ఉపయోగించుకోవాలి. జానకీరావు పాడిన ఈ పాట హృద్యంగా ఉంది' అని చెప్పారు. భారతీయ సంస్కృతిలోని అనేక అంశాలను తీసుకొని తాత్విక భూమికతో పురాణేతిహాస ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు తెలిపారు.

